అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 12-3-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 09 | సంచిక : 12 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 10 పేజీలు + సోపతి (వెబ్‌లో) | వెల : 8.00

మాణిక్‌రెడ్డికి ఓటెయ్యండి

ఉపాధ్యాయులకు చుక్కా రామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్ బహిరంగ లేఖ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

"మచ్చలేని జీవితం..ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడే తత్వం.. గతమంతా ఉద్యమ చరిత్ర ..ఆయనకు ఓటేస్తే మనలను మనం గెలిపించుకున్నట్టే ..అందుకే మేము హామీ ఇస్తున్నాం'..మాణిక్‌రెడ్డికి ఓటేయండి" అంటూ మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ నేత పాపన్నగారి మాణిక్‌రెడ్డికి ఓటేయాలంటూ మాజీ ఎమ్మెల్సీలు చుక్కా రామయ్య, ప్రొఫెసర్ ...2లో

2017 లోనూ ఇలాగే..



- ఐదేండ్లుగా ఏం చేశారు?
- ఈడీ, సీబీఐ చర్యలపై నితీశ్ కుమార్

న్యూఢిల్లీ : రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) నాయకులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు, బీహార్ ఉప ముఖ్యమంత్రి, ఆర్జేడీ చీఫ్ లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్‌కు ...5లో

మా కుటుంబాన్ని హింసించడానికే..


- ఈడీ, సీబీఐ సోదాలపై లాలూ ట్వీట్
- బీజేపీ, ఆరెస్సెస్ ముందు ఎన్నడూ తల వంచలేదు
- వారిపై పోరాటం కొనసాగుతుందని స్పష్టీకరణ

వివరాలు 5లో..



జైల్లో పెట్టి ఇబ్బంది పెట్టగలరేమో..!

- నా ధైర్యాన్ని దెబ్బతీయలేరు
- మనీశ్ సిసోడియా ట్వీట్



న్యూఢిల్లీ : మద్యం కుంభకోణం కేసులో ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్న ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆప్ కీలక నేత మనీశ్ సిసోడియా ట్విట్టర్ వేదికగా స్పందించారు. తనను జైలులో పెట్టి ఇబ్బంది పెట్టగలరేమో కానీ అది ...5లో

స్వేచ్ఛ పాక్షికమే..!

- 2022లోనూ భారత్‌లో అదే స్థితి
- యూఎస్ సంస్థ 'ఫ్రీడమ్ హౌజ్' నివేదిక
- మోడీ పాలనలో దేశ పరిస్థితులపై ఆందోళన



వివరాలు 2లో..

మళ్లీ 16న విచారణ

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో...ఎమ్మెల్సీ కవితను 9 గంటలు ప్రశ్నించిన ఈడీ

న్యూఢిల్లీ : మళ్లీ ఈనెల 16న విచారణకు రావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు ఇచ్చింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో శనివారం ఎమ్మెల్సీ కె. కవిత ఈడీ ఎదుట హాజరయ్యారు. దాదాపు 9 గంటల పాటు సుదీర్ఘంగా విచారించారు. తొలుత మంత్రి, సోదరుడు కేటీఆర్, లీగల్ సభ్యులతో కవిత కాసేపు చర్చించారు. అనంతరం ఉదయం 9 గంటలకు భారత జాగృతి కార్యకర్తలు, బీఆర్ఎస్ శ్రేణులకు సీఎం నివాసంలో బ్రేక్ ఫాస్ట్ ఇచ్చారు. తరువాత కార్యకర్తలతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు కవితకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. అనంతరం తుగ్లక్‌రోడ్‌లోని సీఎం కేసీఆర్ నివాసం నుంచి 10 వాహనాల కాన్వాయ్‌లో అబ్దుల్ కలాం రోడ్‌లోని ఈడీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న కవిత, తన పిడికిలి బిగించి అభివాదం చేస్తూ ఈడీ కార్యాలయంలోకి అడుగుపెట్టారు. కవిత వెంట వచ్చిన భర్త అనిల్, న్యాయవాది మోహన్‌రావు ఈడీ కార్యాలయానికి చేరుకోగా, వారిని ఈడీ అధికారులు బయటే ఆపేశారు. ఉదయం 11 గంటలకు ఈడీ కార్యాలయంలోకి వెళ్లిన కవిత రాత్రి 8 గంటల సమయంలో బయటకు



విచారణకు హాజరైన కవిత

తిరిగొచ్చారు. సుదీర్ఘంగా దాదాపు 9 గంటల పాటు కవితను ఈడీ అధికారులు విచారించారు. మధ్యలో గంటసేపు భోజనం విరామం ఇచ్చారు. అయితే ఆమె ఆహారం తీసుకునేందుకు నిరాకరించినట్టు తెలిసింది. కవితను ఐదుగురు అధికారుల బృందం ప్రశ్నించింది. ఇందులో ఒక జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ స్థాయి మహిళా అధికారి, లిక్కర్ స్కాంలో ఇన్వెస్ట్ గేషన్ ఆఫీసర్(ఐఓ) జోగిందర్, మరో ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు ఉన్నారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఎ) సెక్షన్ 50 కింద కవిత స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. తొలుత ఆమె వ్యక్తిగత వివరాలను రికార్డ్ చేసుకున్న అధికారులు, అనంతరం మద్యం కుంభకోణానికి సంబంధించిన విచారణ ప్రారంభించారు. మౌఖికంగా, లిఖితపూర్వకంగా కవిత స్టేట్ మెంట్ రికార్డు చేశారు. విచారణ ముగిసిన అనంతరం ఈడి కార్యాలయం నుంచి కవిత బయటకు రాగానే ఆమె మద్దతుదారులు జై బీఆర్ఎస్.. జై కేసీఆర్.. జై కవితక్క అంటూ నినాదాలు హోరెత్తించారు. వారికి నమస్కారం తెలుపుతూ ఆమె తుగ్లక్ రోడ్డులోని కేసీఆర్ నివాసానికీ, అక్కడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు.

సౌత్ గ్రూప్‌లో మీ పాత్ర ఏంటీ....?

ఈడీ ఆరోపిస్తున్నట్టు ఢిల్లీ మద్యం పాలసీ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన సౌత్ గ్రూప్‌తో కవితకు ఉన్న సంబంధాలపై విచారించినట్టు సమాచారం. అరుణ్ పిళ్లై, బుచ్చిబాబు, అభిషేక్, శరత్ చంద్రారెడ్డి, మాగుంట రాఘవ, సమీర్ మహేంద్రు, అమిత్ అరోరా ఇచ్చిన సమాచారంతో...2లో



ఆద్యంతం ఉత్కంఠ

- ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేస్తారంటూ ప్రచారం
- రెచ్చగొట్టేలా బండి సంజయ్ కామెంట్లు
- తెలంగాణ భవన్ వద్ద ఆయన దిష్టిబొమ్మ దగ్ధం
- రాజ్‌భవన్ ముట్టడికి యత్నం
- మోడీ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఢిల్లీలో ఎమ్మెల్సీ కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ సందర్భంగా రాష్ట్రంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఉదయం నుంచే భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యకర్తలు పెద్దఎత్తున హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అగ్గికి ఆజ్యంపోసినట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి అసభ్యంగా మాట్లాడటంతో బీఆర్ఎస్ శ్రేణులు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. బండి సంజయ్‌ను అరెస్టు చేయాలంటూ రోడ్లపైకి వచ్చారు. తెలంగాణ భవన్ వద్ద...5లో

ఎమ్మెల్సీ కవితపై బండి వ్యాఖ్యలు అనుచితం..

- రాష్ట్ర మహిళా కమిషన్ విచారణకు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ శనివారం సీరియస్ అయింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయనీ, దీన్ని రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా...5లో



ఢిల్లీలో మోడీకి వ్యతిరేకంగా ఏర్పాటుచేసిన కటౌట్

త్రిపురలో హింసపై విచారణకు వెళ్లిన నేతలపై

బీజేపీ దాడి



అతికష్టం మీద బయటపడ్డ పార్లమెంటరీ బృందం

- మూడు వాహనాలు ధ్వంసం
- గవర్నర్‌ను కలిసి వినతి



న్యూఢిల్లీ : త్రిపురలో ఎన్నికల అనంతరం చోటు చేసుకున్న హింసాకాండ ప్రభావిత ప్రాంతాలను సందర్శించేందుకు వెళ్లిన సీపీఐ(ఎం) రాజ్యసభపక్షనేత ఎలమారం కరీం నేతృత్వంలోని ప్రతిపక్ష ఎంపీల బృందంపై అధికార బీజేపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై అని నినాదాలు చేస్తూ ఎంపీలు సహా దాదాపు 30 మంది ప్రయాణిస్తున్న వాహనానికి నిప్పు పెట్టారు. రాళ్లు రువ్వారు. పోలీసులు చూస్తుండగానే మరో రెండు కార్లను ధ్వంసం చేశారు. ఎంపీలపైనా దాడికి పాల్పడ్డారు. ఈ హింసాకాండను సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండించింది. త్రిపురలో మార్చి 2న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత వామపక్ష, కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు పెరిగాయి. ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ పూర్తిగా విఫలమైన త్రిపురలో ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై పది రోజుల్లోనే వెయ్యికి పైగా దాడులు జరిగాయి. వందలాది మంది కార్యకర్తలు ...5లో

దాడి దారుణం



త్రిపురలో ఎంపీలపై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడం దారుణం. అక్కడ బీజేపీ బీభత్స రాజకీయాలు కొనసాగుతున్నాయి. బాధితులతో మాట్లాడుతుండగా ఎంపీల వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ అప్రజాస్వామిక చర్యను ఖండిస్తున్నాం.

\- సీతారాం ఏచూరి

హేయమైన చర్య



నిజనిర్ధారణ బృందంపై సంఘ్ దాడి హేయమైంది. ఈ దుర్మార్గపు చర్య వెనుక సంఘ్ పరివార్ ఉంది. అక్కడ శాంతిభద్రతలు పునరుద్ధరించాల్సిన అవసరాన్ని ఇది స్పష్టం చేస్తున్నది. త్రిపురలో ఈ బీభత్స పాలనను ఓడించేందుకు ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలి.

\- పినరయి విజయన్

బీజేపీ పురిగొల్పింది



ఇది బీజేపీ పురిగొల్పిన హింస. దాడిపై అక్కడ విజయోత్సవ ర్యాలీని బీజేపీ నిర్వహించటమే ఇందుకు నిదర్శనం. పార్లమెంటరీ బృందంపై దాడిని ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలి.

\- జైరాం రమేష్




ధర కోసం ఎన్నాళ్లీ ఎదురుచూపులు..?

మరింత పతనమవుతున్న పత్తి ధర

- చేతులెత్తేసిన సీసీఐ
- ఇండ్లల్లోనే నిల్వలు
- పట్టించుకోని కేంద్రం

వివరాలు 3లో..



సేద్యానికి కార్పొరేట్ ముప్పు

దొడ్డిదారిన సాగు చట్టాల అమలుకు మోడీ కుతంత్రాలు

అన్నదాత ఆగమే...

- అస్తవ్యస్తంగా మద్దతు ధరల నిర్ణయం
- పత్తి కొనుగోలుపై చేతులెత్తేసిన కేంద్రం
- సహకార రంగంపై కార్పొరేట్ల కన్ను
- మోడీ సర్కారుతో పెరిగిన సాగు వ్యయం



పచ్చని పొలాలకు కార్పొరేట్ కంపెనీల ముప్పు పొంచి ఉంది. సేద్యాన్ని కార్పొరేట్లకు స్వాధీనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం బాటలు వేస్తున్నది. కేంద్రం తీసుకొచ్చిన సాగు చట్టాలకు రైతులు అడ్డం తిరిగి వెనక్కి కొట్టినా, దొడ్డి దారిన వాటిని అమలు చేసేందుకు మోడీ సర్కారు ప్రయత్నాలు చేస్తున్నది. రైతు పండించిన పంటలకు అస్తవ్యస్తమైన మద్దతు ధరలు నిర్ణయించింది. 2022కల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీని ఉట్టికెక్కించి, పెట్టిన పెట్టుబడి కూడా అందకుండా చేస్తోంది. ఫలితంగా రైతు అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడుతు న్నాడు. పత్తి కొనుగోలు చేయకుండా కేంద్రం చేతులెత్తేస్తే, ధాన్యం కొనుగోలుకు ఎఫ్‌సీఐ తటపటాయిస్తుంటే, రైతులు మధ్యదళారీల చేతుల్లో మోసపోతూనే ఉన్నారు.

గుడిగ రఘు



పత్తి రైతుల ఆత్మహత్యలు : పత్తికి మద్దతు ధర రూ. 6600 నిర్ణయించిన ప్పటికీ... ఆ ధర అమలు కావడం లేదు. పత్తిని కొనాల్సిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పడకేసింది. తెలంగాణలో దాదాపు 60 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుండగా, సీసీఐ కొనకపోవడంతో రైతులు దళారులకు అడ్డికి పావుశేరు తీరున అమ్ముకోవాల్సి వస్తోంది. పెట్టుబడి కూడా తిరిగిరాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

పెట్టుబడి ఎక్కువ...లాభం తక్కువ : సాధారణంగా పత్తి సాగులో ఎకరాకు పెట్టుబడి రూ. 36,610 అవుతుంది. కానీ కేంద్ర ప్రభుత్వం వరుసగా పెంచుతున్న డీజిల్, పెట్రోల్, ఎరువులు, యంత్రాల ధరలతో రైతుపై మరో పదివేల అదనపు భారం పడుతోంది. ఎకరాకు సగటున 10 క్వింటాళ్ళ పత్తి వస్తుంది. దీని ప్రకారం ఎకరాకు రూ. 60వేల ఆదాయం అనుకున్నా... పెట్టుబడ పోను రైతుకు మిగిలేది రూ. 14వేలు మాత్రమే. ఆరునెలలు కష్టపడితే నెలకు రూ. 2,333 మాత్రమే గిట్టుబాటు అవుతోంది. రైతు కుటుంబం బతకడమే గగనంగా మారింది.

వివరాలు 5లో..

పీఎం కిసాన్ సమ్మాన్ పథకంపై ప్రచారహోరు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద రైతుకు ఏడాదికి రూ 6వేలు ఇస్తున్నది. దీనిపై ప్రచారం ఉన్నంతగా ఆచరణ లేదు. రాష్ట్రంలో 60 లక్షల మంది రైతులు ఉంటే, కేంద్ర ప్రభుత్వ కఠిన నిబంధనలతో కేవలం 25 లక్షల మంది రైతులకు మాత్రమే ఇది అందుతోంది. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, అకౌంట్ లింకు పేరిట సర్కారు సాకులు చెప్పడంతో 35 లక్షల మందికి అంద కుండా పోయింది.

ఆరు నెలల్లో చక్కెర కర్మాగారాన్ని

తెరిపిస్తాం

వంద రోజుల్లో తెరిపిస్తామని రైతులను మోసం చేశారు

- కోరుట్ల నియోజకవర్గ యాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి



నవతెలంగాణ - మల్లాపూర్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని టీపీసీసీ చీఫ్ ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. జోడో యాత్రలో భాగంగా శనివారం జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలో పర్యటించిన ఆయన మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని సందర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముత్యంపేట చక్కెర కర్మాగారం పరిధిలో 10లక్షల ఎకరాల్లో చెరుకు సాగయ్యేదని, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చక్కెర కర్మాగారాలు మూతపడ్డాయని అన్నారు. నిజామాబాద్ ఎంపీగా కొనసాగిన కల్వకుంట్ల కవిత వంద రోజుల్లో చక్కెర కర్మాగారాలను తెరిపిస్తామని చెప్పి.. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉన్నదాన్నే మూసేశారని విమర్శించారు. శాసనమండలిలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చక్కెర కర్మాగారంపై ప్రభుత్వ వైఖరిని ...5లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

స్వేచ్ఛ పాక్షికమే..!

2022లోనూ భారత్‌లో అదే స్థితి

- యూఎస్ సంస్థ 'ఫ్రీడమ్ హౌజ్' నివేదిక
- మోడీ పాలనలో దేశ పరిస్థితులపై ఆందోళన

న్యూఢిల్లీ : మోడీ పాలనలో భారత్‌లో స్వేచ్ఛ అనే పదానికి స్థానం కనిపించడం లేదు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వేచ్ఛ అనేది అందని ద్రాక్షగా మారింది. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలు ఈ విషయాన్ని అనేక సార్లు వెల్లడించాయి. యూఎస్‌కు చెందిన ఫ్రీడమ్ హౌజ్ కూడా ఇప్పుడు ఇదే విషయాన్ని వెల్లడించింది. భారత్‌లో 2022లోనూ 'పాక్షిక స్వేచ్ఛ' స్థితి ఉన్నదని వివరించింది. కిందటేడాదితో పోల్చుకుంటే మొత్తం స్కోర్లలో ఎలాంటి మార్పూ లేదని స్పష్టం చేసింది. 'ప్రపంచంలో స్వేచ్ఛ(ఫ్రీడమ్ ఇన్ ద వరల్డ్)' పేరిట 2023 ఏడాదికి సంబంధించిన ఎడిషన్‌ను సదరు సంస్థ విడుదల చేసింది. కొన్ని అంశాల ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా 195 దేశాలకు ఈ నివేదికలో ర్యాంకులు కేటాయించారు. కాగా, భారత్ వంద మార్కులకు గానూ 66 మార్కులను సాధించింది. ఎన్నికల ప్రక్రియ, రాజకీయ బహుళత్వం మరియు భాగస్వామ్యం, ప్రభుత్వ పనితీరు, భావప్రకటనా స్వేచ్ఛ మరియు నమ్మకం, సంఘ మరియు సంస్థాగత హక్కులు, చట్ట పాలన, వ్యక్తిగత స్వయంప్రతిపత్తి మరియు హక్కులు వంటి అంశాలు ఇందులో ఉన్నాయి.

ముస్లింల రాజకీయ హక్కులకు ముప్పు

భారత ముస్లింల రాజకీయ హక్కులకు ముప్పు పొంచి ఉన్నదని నివేదిక పేర్కొన్నది. ఈ విషయంలో మోడీ సర్కారు పట్టుబట్టి మరీ తీసుకొచ్చిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) గురించి ఉటంకించింది. జనాభాలోని అట్టడుగు వర్గాలు పూర్తి స్థాయి రాజకీయ ప్రాతినిథ్యానికి నోచుకోలేక అడ్డంకులను ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 545 ఎంపీ స్థానాలకు గానూ ముస్లింలు 27 మంది మాత్రమే విజయం సాధించారని పేర్కొన్నది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 14.2 శాతం ఉన్న ముస్లిం జనాభాకు దక్కిన స్థానాలు ఐదు శాతం మాత్రమేనని వివరించింది. 2022 ముగింపు నాటికి బీజేపీ నుంచి ఒక్క ముస్లిం ఎంపీ కూడా లేకపోవడం గమనార్హం.

పత్రికా స్వేచ్ఛపై పెరిగిన దాడులు

భారత్‌లో పత్రికా స్వేచ్ఛ ప్రమాణాలు పడిపోవడంపై ఈ నివేదిక వివరించింది. మోడీ పాలనలో పత్రికా స్వేచ్ఛపై దాడులు క్రమం గా పెరిగాయని పేర్కొన్నది. కీలకమైన మీడియా గొంతు నొక్కేందుకు అధికారిక యంత్రాంగాలు రాజద్రోహం, పరువునష్టం, కోర్టు ధిక్కరణ చర్యలతో పాటు పలు చట్టాలను ఉపయోగించాయని వివరించింది. స్వతంత్ర మీడియా సంస్థలపై సోదాలనూ ఉటంకించింది. ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకులు ముహమ్మద్ జుబేర్ అరెస్టును, గతేడాది ది వైర్‌కు సంబంధించిన నలుగురు ఎడిటర్లు, ఇండ్లలో జరిగిన సోదాలను ఇందులో ఉదహరించింది.

నిష్క్రియాత్మకంగా లోకాయుక్త

భారత్‌లో ప్రభుత్వ పని తీరుపైనా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. లోకాయుక్తలు ఉనికిలో ఉన్నప్పటికీ.. వాటి అసమర్థ సంస్థాగతీకరణను పేర్కొన్నది. ఇలాంటి సంస్థలు తమ పనులను నెమ్మదిగా చేస్తున్నాయని వివరించింది. 2022 అక్టోబర్ నాటికి దేశవ్యాప్తంగా 29 రాష్ట్ర స్థాయి లోకాయుక్తలలో ఏడింటి వార్షిక నివేదికలు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండటం గమనార్హం. ఇక ఆర్టీఐ కింద ప్రభుత్వ పని తీరుకు సంబంధించి దాఖలు చేసిన పలు దరఖాస్తులకు సమాధానాలు లభించడం లేదు. ఇందుకు ఆర్టీఐ అధికారులపైనా చర్యలు ఉండటం లేదు. ఆర్టీఐ తన ప్రభావాన్ని కోల్పోయిందని వివరించింది.

యూనివర్సిటీల్లో హింస.. ప్రొఫెసర్లపై దాడులు

పత్రికా స్వేచ్ఛ మాత్రమే కాదు.. కొన్నేండ్లుగా భారత్‌లో విద్యా స్వేచ్ఛ గణనీయంగా బలహీనపడిందని నివేదిక పేర్కొన్నది. యూనివర్సిటీ క్యాంపస్‌లలో హింస, ప్రొఫెసర్లపై దాడులు పెరిగాయని వివరించింది. "బీజేపీ సర్కారు సున్నితమైన అంశాలుగా భావించే వాటిపై చర్చించొద్దనే ఒత్తిడిని విద్యావేత్తలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా, పాకిస్థాన్‌తో భారత సంబంధాలు, భారత కాశ్మీర్‌లో పరిస్థితులకు సంబంధించి ఇందులో ఉన్నాయి" అని నివేదిక పేర్కొన్నది. కర్నాటకలో తీవ్ర చర్చకు దారి తీసిన హిజాబ్ అంశాన్ని కూడా లేవనెత్తింది.



ఎన్జీఓల లైసెన్సుల రద్దుపై ఆందోళన

2017 నుంచి 2021 మధ్య దేశంలో 6,677 ఎన్జీఓల విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) లైసెన్సుల రద్దుపై నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే, 2022లో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ నేతృత్వంలోని రెండు ఎన్జీఓలపై జరిపిన ఇలాంటి చర్యనూ ఉటంకించింది. మహ్మద్ ప్రవక్తపై బీజేపీ మాజీ అధికార ప్రతినిధి నుపూర్ శర్మ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో చోటు చేసుకున్న హింసాత్మక నిరసనలు, ఢిల్లీ, గుజరాత్, యూపీ, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అక్కడి బీజేపీ ప్రభుత్వాలు, పాలనా యంత్రాంగాలు ముస్లింల భవనాలను కూల్చివేసిన ఘటనల గురించి నివేదిక వివరించింది.

మాణిక్‌రెడ్డికి ఓటేయ్యండి

(మొదటిపేజీ తరువాయి)

డాక్టర్. కె. నాగేశ్వర్ ఉపాధ్యాయ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ నేపథ్యంలో వారికి ఇరువురూ బహిరంగ లేఖ రాశారు. మీడియాకు విడుదల చేశారు. సోషల్ మీడియా వేదికగా నాగేశ్వర్ వీడియో పాపులర్ అవుతున్నది. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో మాణిక్‌రెడ్డి రాజీపడబోరని ఇరువురూ వ్యాఖ్యానించారు. సీపీఎస్ సమస్య, పీఆర్సీ, అక్రమ బదిలీల విషయంలో ప్రభుత్వంతో నేరుగా పోట్లాడారని చెప్పారు. ఆయన ఎమ్మెల్సీగా శాసనమండలికి వెళితే అక్కడ మీరున్నట్టేనని చెప్పారు. నిజమైన ప్రతినిధిగా ఉపాధ్యాయ లోకానికి సేవలు అందిస్తారు. సొంతపనులు చూసుకోకుండా ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర తపనతో పోరాటం చేసే మాణిక్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మీరు గెలిపిస్తే మాణిక్‌రెడ్డి మచ్చలేని ప్రజాజీవితాన్ని గడుపుతాడని హామీ ఇచ్చారు. మొదటి ప్రాధాన్యతా ఓటేయాలని కోరారు. బ్యాలెట్‌లో ఆయన సీరియల్ నెంబరు 17గా పేర్కొన్నారు. ఇదిలావుండగా మాణిక రెడ్డికి మరో సంఘం మద్దతు ప్రకటించింది. ఇప్పటివరకు మొత్తం 12 సంఘాలు సహకారం అందించేందుకు ముందుకొచ్చాయని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు.

మాణిక్‌రెడ్డికే మా ఓటు: మేవా

ఉపాధ్యాయుల గొంతుక పాపన్నగారి మాణిక్ రెడ్డికే మా ఓటు అంటూ తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం(మేవా) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ మసూద్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ జుబేర్ అహ్మద్ లేఖ అందజేశారు. గతంలో ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన వారు ఎలా పనిచేశారో, ఎవరికి ఊడిగం చేశారో మనందరికి తెరిచిన పుస్తకమని గుర్తు చేశారు. ప్రలోభాలు, తాయిలాలకు ఉపాధ్యాయ సమాజం లొంగదని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాణిక్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

మళ్లీ 16న విచారణ

(మొదటిపేజీ తరువాయి)

ఈడీ కవితను ప్రశ్నించింది. విచారణ సందర్భంగా వారి మధ్య జరిగిన సంభాషణలు, వాట్సాప్ చాట్‌లు, డిజిటల్ ఆధారాలను కవిత ముందుంచినట్టు విశ్వసనీయ సమాచారం. వాటి ఆధారంగా సౌత్ గ్రూప్‌లో కవిత పాత్ర పై ఈడీ ప్రశ్నలు వర్షం కురిపించినట్టు తెలిసింది. 'లిక్కర్ పాలసీ రూపొందిస్తోన్న విషయం ఎలా తెలుసు? అందులో చేరాలని ఎవరు కోరారు? ఇందుకోసం ఎవరు సంప్రదించారు.? అని ప్రశ్నించినట్టు తెలిసింది. నిందితులతో ఉన్న సంబంధాలు, ఇండో స్పిరిట్స్ కంపెనీలో వాటాలు, రూ.100 కోట్ల ముడుపుల వ్యవహారం' వంటి ప్రశ్నలకు సమాధానం కోరింది. ఢిల్లీ, హైదరాబాద్ వేదికగా జరిగిన సమావేశాలను ప్రస్తావించింది. రూ.100 కోట్ల ముడుపుల వ్యవహారం, హవాల మార్గంలో వాటిని తరలించిన తీరుపై ప్రశ్నించింది. అలాగే ఒకటి రెండు రోజుల తేడాలో తనకు చెందిన రెండు ఫోన్ నెంబర్లు కలిగిన మొత్తం 10 విలువైన ఫోన్ల ధ్వంసానికి కారణాలను అడిగినట్లు సమాచారం. అదే సమయంలో మిగితా నిందితులూ ఫోన్లు ధ్వంసం చేయడం వెనక ఉన్న ఉద్దేశాన్ని ప్రశ్నించినట్లు తెలిసింది.

పిళ్లైతో కలిపి విచారణ..?

ఉదయం రెండు గంటల పాటు కవితను ఒంటరిగా ఈడి ప్రశ్నించింది. అయితే, మధ్యాహ్నం తరువాత తమ కస్టడీలో ఉన్న ఆమె అనుచరుడు, మద్యం వ్యాపారి అరుణ్ పిళ్లైతో కలిసి విచారించినట్లు సమాచారం. కవిత ఇచ్చిన స్టేట్‌మెంట్‌లోని ప్రశ్నలను, పిళ్లై సమక్షంలో క్రాస్ ఎగ్జామిన్ చేసినట్లు తెలిసింది. తాను కవిత బినామినంటూ పిళ్లై ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ప్రస్తావించింది. 'ఢిల్లీ మద్యం కుంభకోణం గురించి నాకేం తెలీదు. నేను కుట్ర దారురాలిని కాదు. నేనేం ఆధారాలు ధ్వంసం చేయలేదు' అని కవిత చెప్పినట్టు సమాచారం.

భారీ భద్రత

ఈడీ విచారణకు కవిత హాజరైన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు హడావుడి చేశారు. ఈడీ కార్యాలయానికి వెళ్లే మార్గాల్లో మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. బిఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు ఈడీ కార్యాలయం వద్దకు చేరుకోకుండా ఢిల్లీ పోలీసులు భద్రతను భారీగా పెంచారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఈడీ కార్యాలయ పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. మరోవైపు సాయంత్రం 5.30 గంటలకే విచారణ ముగియాల్సి ఉండగా.. అనూహ్యంగా ఆ సమయాన్ని పెంచారు. రూల్ ప్రకారం మహిళలను సాయంత్రం 6 వరకు మాత్రమే విచారించాల్సి ఉన్నా, సమయం దాటినా కవితను ఈడీ బయటకు పంపలేదు. ఈడీ వైఖరితో బిఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలో పడ్డాయి.

ఢిల్లీలోనే మంత్రుల మకాం...

కవిత ఈడీ విచారణ నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన ఏడుగురు మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, మహమ్మూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్ రెడ్డిలు ఢిల్లీలోనే మకాం వేశారు. శుక్రవారం రాత్రికే మంత్రి కేటిఆర్, హరీష్ రావు ఢిల్లీ చేరుకున్నారు. అనంతరం సీఎం కేసీఆర్ నివాసంలో కేటీఆర్, హరీష్ రావు, కవిత, లీగల్ టీం భేటీ అయ్యారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం

ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ ముందు బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రేఖా శర్మకు తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ మహిళా సమాజం తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సత్యవతి రాథోడ్ మాట్లాడారు. బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలపై గవర్నర్ తమిళిసై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో చీమ చిటుక్కుమంటే స్పందించే గవర్నర్ ఇప్పుడేం చేస్తున్నారని నిలదీశారు. సంజయ్ వ్యాఖ్యలపై గవర్నర్ స్పందించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి మాటలకు తావు లేదని సత్యవతి రాథోడ్ స్పష్టం చేశారు. సంజయ్ రాజకీయ విలువల్లేని వ్యక్తి అని విమర్శించారు. మహిళలను ఏ మాత్రం గౌరవించకుండా మాట్లాడటం సరికాదన్నారు. ఇలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండటం దురదృష్టకరమన్నారు. మహిళలు తల దించుకునేలా బండి సంజయ్ మాట్లాడానని, ఆయన మాట్లాడే ప్రతి మాట వ్యక్తిగతమా..? పార్టీ లైనా స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈడీ, సీబీఐ దాడులకు తెలంగాణ బిడ్డలు భయపడరని సత్యవతి రాథోడ్ స్పష్టం చేశారు

గుజరాతీ బాసుల చెప్పులు మోసే సన్నాసులకు తెలంగాణ ప్రగతి అర్థం కాదు

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ట్వీట్‌పై మంత్రి కేటీఆర్ ఘాటు స్పందన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

'గుజరాతీ బాసుల చెప్పులు మోసే బీజేపీ సన్నాసులకు తెలంగాణ ప్రగతి అర్థం కాదు' అంటూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కే తారకరామారావు ట్వీట్ చేశారు. మిలియన్ మార్చ్‌ను గుర్తు చేస్తూ కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి చేసిన ట్వీట్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో మంత్రి కేటీఆర్ కూడా అంతే ఘాటుగా స్పందించారు. కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా మిలియన్ మార్చ్‌కు పుష్కరకాలం గడిచిందనీ, కేసీఆర్ నియంతృత్వ పాలనలో కనీస గుర్తింపు లేకపోవడం దురదష్టకరమని ట్వీట్ చేశారు. కల్వకుంట్ల కుటుంబానికి తప్ప మిలియన్ మార్చ్‌కు కారణమైన నేతలకు, ఉద్యమంలో అసువులు బాసిన అమరులకు, విమోచన దినోత్సవానికి సరైన గుర్తింపు లభించడం లేదంటూ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఉద్యమం పేరిట అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఉద్యమాలనే అణచివేయాలని చూస్తున్నారనీ, తెలంగాణ ప్రజల కండ్లలో కడగళ్లు మిగిల్చేలా కేసీఆర్ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. కోట్లాది ప్రజలు కొట్లాడితే కల్వకుంట్ల కుటుంబం మాత్రమే కూర్చొని అధికారాన్ని చెలాయిస్తోందంటూ విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వారిని నేడు పక్కన కూర్చోబెట్టుకుని ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ, ఇంకా అనేక అంశాలను ప్రస్తావిస్తూ ఆక్రోశం వెళ్లగక్కారు. దీనిపై రాష్ట్ర మంత్రి కేటీఆర్ కూడా అంతే ఘాటుగా స్పందించారు. "తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయకుండా పారిపోయిన ఎమ్మెల్యే ఎవరో చెప్పుకోండి చూద్దాం" అంటూ అదే ట్విటర్ వేదికగా ప్రశ్నించారు. "తల్లిని చంపి బిడ్డను ఇచ్చారని తెలంగాణ పుట్టుకనే పలుమార్లు అవమానించిన మోడీకి, గుజరాతీ బాసుల చెప్పులు మోసే బీజేపీ సన్నాసులకు తెలంగాణ ప్రగతి అర్థం కాదు" అంటూ ట్వీట్ చేశారు. మోడీ వ్యాక్సిన్ కనిపెట్టాడంటూ గొప్పలు చెప్పుకోవడం మానేసి, ప్రజలకు పనికి వచ్చే పనులు చేయాలంటూ ట్వీట్ చేశారు.

నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా గుట్టురట్టు

• ముగ్గురు నిందితుల అరెస్ట్ • వివిధ యూనివర్శిటీలకు చెందిన నకిలీ సర్టిఫికెట్లు సీజ్

నవతెలంగాణ- సిటీబ్యూరో

విదేశాలకు వెళ్లేందుకు అవసరమైన సర్టిఫికెట్లతోపాటు ఉన్నత చదువులకు అవసరమయ్యే సర్టిఫికెట్లు నకిలీవి తయారు చేస్తూ.. విక్రయిస్తున్న ముఠాను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు, ఫలక్‌నుమా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి వివిధ యూనివర్శిటీలు, ఇన్‌స్టిట్యూషన్లకు చెందిన నకిలీ సర్టిఫికెట్లతోపాటు కంప్యూటర్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం..

చాంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ కలిముద్దీన్ 7వ తరగతి చదివాడు. చెత్తబజార్‌లోని 'డైమండ్ గ్రాఫిక్ ప్రింటింగ్ ప్రెస్'లో డీటీపీ ఆపరేటర్‌గా చేరాడు. 2015లో అక్కడ గ్రాఫిక్స్, కోరల్‌డ్రా సాఫ్ట్‌వేర్ నేర్చుకున్నాడు. ఈ క్రమంలో సులువుగా డబ్బులు సంపాదించాలని నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి విక్రయించాడు. విషయాన్ని రాజేంద్రనగర్‌కు చెందిన ఎండీ ఫేరోజ్, లంగర్‌హౌజ్‌కు చెందిన అబ్దుల్ బాషీత్ ఆసీఫ్‌కు చెప్పాడు. వారితో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ఢిల్లీకి చెందిన శివానితో చేతులు కలిపారు. అమెరికా, యూకేతోపాటు తదితర దేశాలకు వెళ్లేవారితోపాటు ఉన్నత చదువులకు అవసరమైన సర్టిఫికెట్లను తయారు చేస్తున్నారు. వాటిని కావాల్సినవారికి విక్రయిస్తూ డబ్బులు తీసుకుంటున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ, ఉస్మానియా, చండిగఢ్‌తోపాటు వివిధ యూనివర్శిటీలకు చెందిన సర్టిఫికెట్లను తయారు చేస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. నిందితులు పలుసార్లు జైలుకెళ్లొచ్చినా వారిలో మార్పురాలేదని ఏసీపీ తెలిపారు. జైలు నుంచి తిరిగొచ్చిన తర్వాత నకిలీ సర్టిఫికెట్ల దందాను కొనసాగిస్తున్నారన్నారు. పరారీలోవున్న ఢిల్లీకి చెందిన శివాని కోసం గాలిస్తున్నామని చెప్పారు.



హత్రాస్ లైంగికదాడి కేసు ప్రత్యేక న్యాయస్థానం తీర్పుపై ఆగ్రహం

- ముగ్గురు నిందితులపై ఆరోపణల్ని కొట్టేసిన కోర్టు

న్యూఢిల్లీ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నవేళ..ఒక లైంగికదాడి కేసులో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పు (ఈనెల 3న) సంచలనం రేపింది. ఈ కేసులో నలుగురు నిందితులుగా ఆరోపణలు నమోదుకాగా, ముగ్గురు నిందితులపై లైంగికదాడి ఆరోపణల్ని కొట్టేస్తూ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. దీంతో ఈ కేసులో ఒకే ఒక వ్యక్తి ప్రధాన నిందితుడిగా మిగిలాడు. ఈ తీర్పు ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. బాధితురాలు తన మరణవాంగ్మూలంలో నలుగురి పేర్లు చెప్పిన తర్వాత కూడా, కోర్టు నుంచి ఈ విధమైన తీర్పు వెలువడటాన్ని దళిత, ఆదివాసీ సంఘాలు తీవ్రంగా తప్పుబట్టాయి. తీర్పును యూపీ ప్రభుత్వం హైకోర్టులో సవాల్ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. లైంగికదాడి, హత్య ఘటన సెప్టెంబర్ 2020లో చోటుచేసుకుంది. ఘటన జరిగి ఇంతకాలమైనా న్యాయస్థానంలో దోషులకు శిక్ష పడకపోవటాన్ని సామాజిక కార్యకర్తలు, దళిత, ఆదివాసీ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. నలుగురు నిందితులు ఠాకూర్ సామాజిక వర్గానికి చెందినవారు కావటం వల్లే కేసును బలహీన పరుస్తున్నారని, జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా ఎస్పీ నిందితులకు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. "అంతర్జా తీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్న వేళ కోర్టు నుండి ఇలాంటి తీర్పు వచ్చింది. ఇది తెలిసాక మహిళా దినోత్సవాన్ని అణగారిన వర్గాలు జరుపు కుంటాయా? కుల ఆధారిత ఈ సమాజంలో మహిళల హక్కులకు గౌరవం లేదు. సామాజిక న్యాయం, సమానత్వం కోరుకునే వారికి కోర్టు తీర్పు తీవ్రంగా నిరాశపర్చింది" అని శనివారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో దళిత, ఆదివాసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. దళితులు, గిరిజనులపై లైంగికదాడి ఘటనల్లో దోషులకు శిక్ష పడటం లేదని, న్యాయ విచారణ అత్యంత పేలవంగా ఉంటోందని సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేర న్యాయ వ్యవస్థ మరింత సులభతరం కావాలి

- ఉన్నతస్థాయి సమావేశంలో డీజీపీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో నేర న్యాయ వ్యవస్థ (క్రిమినల్ జస్టిస్ సిస్టమ్) మరింత సులభతరం కావాలనీ, అందుకు అనువైన మార్గాలను అటు న్యాయ నిపుణులు, ఇటు పోలీసున్నతాధికారులు సమన్వయంతో అన్వేషించాలని రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ అన్నారు. శనివారం డీజీపీ కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులు, న్యాయ కోవిదులతో కూడిన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రిమినల్ జస్టిస్ సిస్టమ్‌ను ప్రజలకు మరింత సులభతరం చేయడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా పెంపొందించా ల్సినవసరం ఉన్నదని డీజీపీ అభిప్రాయపడ్డారు. ప్రజలకు న్యాయాన్ని త్వరితగతిన, మరింత సులువుగా అందుబాటులోకి తేవడానికి కేసుల దర్యాప్తు సాగించే పోలీసు వ్యవస్థ కోర్టులలో దానికి అనుగుణమైన తీర్పులను సాధించే న్యాయవాద వ్యవస్థ మధ్య మరింత సమన్వయం అవసరమని ఆయనన్నారు. ముఖ్యంగా, ఈ సమన్వయ వ్యవస్థ మరింత పారదర్శకంగా ముందుకు సాగడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ వ్యవస్థను మరింతగా పరిపుష్టత చేయడానికి ప్రతి 3 నెలలకోసారి పోలీసున్నతాధికారులు, న్యాయకోవిదుల మధ్య సమన్వయ సమావేశాలను నిర్వహించాలని ఇందులో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శివప్రసాద్‌తో పాటు ఇతర న్యాయ కోవిదులు, రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, రాష్ట్ర పోలీసు లీగల్ విభాగం అదనపు డీజీ కె. శ్రీనివాస్‌రెడ్డి, మరో అదనపు డీజీ సౌమ్య మిశ్రా, పోలీసు పర్సనల్ విభాగం ఐజీ కమలాసన్ రెడ్డిలతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

20న చలో ఢిల్లీ : రైతు సంఘాలు

లక్నో : కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)పై మోడీ ప్రభుత్వ బూటకపు హామీకి వ్యతిరేకంగా ఈ నెల 20న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు కార్మిక, రైతు సంఘాలు ప్రకటించాయి. యూపీలోని మీరట్ జిల్లాలో నిర్వహించిన కిసాన్ మహాపంచాయత్‌లో రైతు సంఘాలు ఈ మేరకు పిలుపునిచ్చాయి. మీరట్ డివిజన్‌లోని వివిధ జిల్లాలతో పాటు బిజ్నోర్, షామ్లి, ముజఫర్‌నగర్, హపూర్, మొరాదాబాద్ జిల్లాలకు చెందిన వందలాది మంది రైతులు పాల్గొన్నారు. వివిధ ట్రేడ్ యూనియన్లతో పాటు భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ), సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నేతత్వంలో ఢిల్లీలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్టు ప్రకటించాయి. ఎంఎస్‌పీతో పాటు 13 నెలల పాటు చేపట్టిన నిరసనలో రైతులపై నమోదు చేసిన కేసులు కొట్టివేయాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. అలాగే చెరుకు బకాయిలు వెంటనే చెల్లించాలనీ, బలవంతపు భూ సేకరణను నిలిపివేయాలనీ, విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను అదుపుచేయాలని డిమాండ్ చేస్తున్నాయి. రైతులకిచ్చిన ఏ ఒక్క వాగ్దానం కూడా ప్రధాని మోడీ నెరవేర్చలేదని బీకేయూ నేత రాకేష్ తికాయత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చేంతవరకు ఎస్‌కేఎం ఆధ్వర్యంలో నిరసన కొనసాగుతుందని రైతు నేతలు పునరుద్ఘాటించారు. చెరకు రైతులకు న్యాయం జరిగేలా చెరకు చట్టం గాని, అలహాబాద్ తీర్పును గాని యూపీ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశాయి. దేశంలోని మొత్తం చెరకు ఉత్పత్తిలో సుమారు 45 శాతం యూపీ నుంచి ఉత్పత్తి అవుతున్నదనీ, కానీ 11-13 శాతం రికవరీతో దేశంలోనే అత్యల్ప స్థానంలో నిలిచిందని అన్నారు.

మహారాష్ట్రలో రోజుకు ఎనిమిది మంది రైతులు మృతి : అజిత్ పవార్

ముంబయి: మహారాష్ట్రలో ప్రతిరోజూ ఎనిమిది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుని మృతి చెందుతున్నారని ఎన్‌సిపి నేత అజిత్ పవార్ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే షిండే ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన శాసనసభా సమావేశాల్లో రైతు ఆత్మహత్యలపై పవార్ మాట్లాడారు. షిండే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి 1,203 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆయన ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. "మహారాష్ట్రలో అకాల వర్షాల కారణంగా పంట నష్టపోతుంది. పండిన పంటకు మంచి ధర లభించడం లేదు. దాంతో రైతులు ఆవేదనతో పండించిన పంటను రోడ్డుపై పడేస్తున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తెగిపోతున్నాయి. ఎరువుల ధరలు పెరిగిపోతున్నాయి. షిండే- ఫడ్నవీస్‌ల ప్రభుత్వం రైతులకు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చడం లేదు' అని పవార్ శాసనసభా సమావేశాల్లో మాట్లాడారు. అలాగే ఈ సమావేశాల్లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదికను ఉటంకిస్తూ.. రెండు నెలల్లో మరఠ్వాడా ప్రాంతంలో 62 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు.

బిజినెస్

సిలికాన్ వ్యాలీ బ్యాంక్ మూత

- స్వాధీనం చేసుకున్న ఎఫ్‌డిఐసి



వాషింగ్టన్ : అమెరికాకు చెందిన సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌విబి) సంక్షోభంతో మూత పడింది. ఈ బ్యాంక్‌ను మూసి వేస్తూ.. పూర్తిగా తమ ఆధీనంలో కి తీసుకున్నామని శుక్రవారం అమెరికా రెగ్యులేటరీ ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎఫ్‌డిఐసి) ప్రకటన చేసింది. ఆ బ్యాంక్‌కు సంబంధించిన ఆస్తుల్ని సీజ్ చేసింది. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత అమెరికాలో అతిపెద్ద రిటైల్ బ్యాంకింగ్ ఎస్‌విబి కుప్పకూలడంతో ఆనాటి పరిస్థితులు ఎక్కడ పునరావృతం అవుతాయేనని నిపుణులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆ బ్యాంక్ 2 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.16వేల కోట్లు) నష్టాలు చవి చూసింది. ఎస్‌విబి ప్రధానంగా టెక్, స్టార్టప్ సంస్థలకు నిధులను సమకూర్చుతుంది.

ఎస్‌విబిలో సంక్షోభం నెలకొనడం.. రెండు రోజుల్లోనే ఆ బ్యాంక్ సూచీ భారీగా పడిపోవడంతో అక్కడి రెగ్యులేటరీ సంస్థ వేగంగా స్పందించింది. ఆ బ్యాంక్ మూత పడిన తర్వాత ఇందులోని 175 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.14 లక్షల కోట్లు) వినియోగదారుల డిపాజిట్లను ఎఫ్‌డిఐసి తన చేతుల్లోకి తీసుకుంది. ఖాతాదారులకు నష్టం జరగకుండా ఎఫ్‌డిఐసి కొత్తగా నేషనల్ బ్యాంక్ ఆఫ్ శాంటా క్లారాను ఏర్పాటు చేసింది. సోమవారం నుంచి ఖాతాదారులు తమ డిపాజిట్లపై ఉన్న బీమా సొమ్మును వెనక్కి తీసుకోవచ్చని తెలిపింది. మిగితా మొత్తం బ్యాంక్ విక్రయం తర్వాత అందిస్తామని వెల్లడించింది. ఎస్‌విబి సంక్షోభ పరిస్థితులు తెలిసిన ఆ బ్యాంక్ సిఇఒ బేకర్ 10 రోజుల ముందే తన షేర్లను అమ్మేసుకున్నారు. ఎస్‌విబి ఫైనాన్షియల్‌లో ఉన్న 3.6 బిలియన్ డాలర్ల విలువైన 12,451 షేర్లను ఫిబ్రవరి 27న విక్రయించారని ఆ గ్రూప్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఎస్‌విబిని కొనుగోలు చేసేందుకు తాను సిద్ధమేనని ట్విట్టర్ అధినేత ఎలన్ మస్క్ ట్వీట్ చేశారు.

మైక్రోసాఫ్ట్‌లో ఆగని ఉద్వాసనలు

- మెటాలోనూ కోతలు

శాన్‌ఫ్రాన్సిస్కో : ఆర్థిక సంక్షోభం భయాల్లో టెక్ కంపెనీలు వరుస పెట్టి ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ వరుసగా మూడో విడత తమ ఉద్యోగులకు ఉద్వాసనలు పలికుతుందని సమాచారం. ఈ సారి సప్లయ్ చెయిన్, క్లౌడ్, కృత్రిమ మేధ (ఎఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ వంటి విభాగాల్లోని వారిని తొలగించినట్లు శనివారం రిపోర్టులు వచ్చాయి. 2023 జనవరిలోనే 10 వేల మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటన చేసింది. ఇందులో భాగంగానే తాజా ఉద్వాసనలు చోటు చేసుకున్నాయని తెలుస్తోంది. అయితే ఎంత మందిని తొలగించేది వెల్లడించలేదు. ఇటీవలే వాషింగ్టన్‌లో 689 మంది ఉద్యోగులకు పింక్ స్లిప్‌లు ఇచ్చింది. గత నెలలో వాషింగ్టన్‌లో 617 మందిని ఇంటికి సాగనంపింది. జనవరిలో ఉద్వాసన పలికి 878 మందితో మొత్తం వాషింగ్టన్ రాష్ట్రంలోనే 2184 మందిని తొలగించింది. కృత్రిమ మేధ (ఎఐ) చేపట్టిన ప్రాజెక్ట్ బొన్సాయ్‌ని సంస్థ మూసివేస్తున్నట్లు ఓ ఉద్యోగి వెల్లడించారు.

మరోవైపు 18 ఏళ్ల పైగా పని చేస్తున్న ఓ ప్రిన్సిపల్ ప్రొడక్ట్ మేనేజర్ సహా తనతో పని చేసే మొత్తం గ్రూపు సభ్యులకు ఉద్వాసన పలికింది. ఆర్థిక సంక్షభం భయాలతో టెక్ కంపెనీల వరుస పెట్టి ఉద్యోగులను పీకేస్తుండటంతో వారి కుటుంబాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా వచ్చే వారంలో ఉద్యోగు లకు కోత విధించనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే మెటా నాలుగు నెలల క్రితం 11వేల మంది ఉద్యోగులను తొలగించింది. ఇది మొత్తం ఉద్యోగుల్లో 13 శాతానికి సమానం. దీంతో రెండో రౌండ్‌లోనూ ఉద్యోగులను తొలగించనున్నట్లయ్యింది.

ఇన్ఫీ ప్రెసిడెంట్ మోహిత్ జోషి రాజీనామా



బెంగళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద టెక్ కంపెనీ ఇన్ఫోసిస్ ప్రెసిడెంట్ మోహిత్ జోషి తన పదవికి రాజీనామా చేశారు. దాదాపు రెండు దశాబ్దాల నుంచి ఆయన ఇన్ఫీలో వివిధ హోదాల్లో పని చేశారు. త్వరలో ఆయన టెక్ మహీంద్రాలో ఎండి, సిఇఒగా చేరనున్నారు. ప్రస్తుతం టెక్ మహీంద్రా ఎండిగా ఉన్న సిపి గుర్నానీ 2023 డిసెంబర్ 19న పదవీ విరమణ పొందనున్నారు. మోహిత్ జోషి మార్చి 11 నుంచి సెలవులో ఉండగా.. ఈ ఏడాది జూన్ 9 వరకు కంపెనీలో కొనసాగనున్నారు. మోహిత్ ఇన్ఫోసిస్‌లో ఇప్పటి వరకు ఆయన యూరప్ కంపెనీకి సంబంధించి ఫైనాన్షియల్ సర్వీసెస్ బిజినెస్‌ను చూసుకున్నారు. 2000 సంవత్సరంలో ఇన్ఫోసిస్‌లో చేరారు.

ఐడిఎఫ్‌సి ఎంఎఫ్ ఇక బంధన్ మ్యూచువల్ ఫండ్

ముంబయి: ఐడిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్ కొత్తగా బంధన్ మ్యూచు వల్ ఫండ్‌గా పేరు మార్చుకుంది. మార్చి 13 నుంచి కొత్త పేరుతో కనిపించనుంది. తదనుగుణంగా ఈ ఫండ్ హౌస్ ప్రతి పథకానికి ఐడిఎఫ్ సి పదానికి బదులుగా బంధన్ పదం కనిపించనుందని ఆ సంస్థ వెల్లడించింది. పెట్టుబడుల వ్యూహాలు, ప్రక్రియలు, బందం మాత్రం అదే కొనసాగుతుందని పేర్కొంది.

మదుపరులు, అదే తరహా అత్యున్నత నాణ్యత కలిగి పెట్టుబడుల విధానంతో ప్రయోజనం పొందగలరని ఎఎంసి సిఇఒ విశాల్ కపూర్ పేర్కొన్నారు. రీ బ్రాండింగ్ పేరు, లోగో మారనుందన్నారు. బంధన్ మ్యూచువల్ ఫండ్ ఈ ఫండ్ హౌస్ ప్రయాణంలో నూతన అధ్యాయానికి ప్రతీకగా నిలువడంతో పాటుగా తమ వ్యాపారాలకు నూతన శక్తిని తీసుకురానుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

నగరంలో "టాయ్స్ ఆర్ అస్" స్టోర్ ప్రారంభం



హైదరాబాద్ : సాంకేతికాధారిత రిటైల్ కంపెనీ ఎస్ టార్టైల్ హైదరాబాద్‌లో కొత్తగా 'టాయ్స్ ఆర్ అస్'ను శనివారం ప్రారంభించింది. హైటెక్‌సిటీ సమీపంలోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్ వద్ద దీన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ నూతన శ్రేణీ బ్రాండెడ్ బొమ్మలు అందించనున్నటు ఎస్ టర్టైల్ సిఇఒ నితిన్ చాబ్రా పేర్కొన్నారు. విస్తృత శ్రేణీ అత్యున్నత ఉత్పత్తుల ద్వారా స్టోర్ లోపల మరుపురాని అనుభవాలను అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు.

ధర కోసం ఎన్నాళ్లీ ఎదురుచూపులు..?

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లా బేల మండలం శంషాబాద్ గ్రామానికి చెందిన శుభంభోడే అనే రైతు 8 ఎకరాల్లో పత్తి సాగుచేశారు. 80క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు అవసరాల కోసం 20క్వింటాళ్లు మాత్రమే విక్రయించారు. మిగతా 60క్వింటాళ్ల పత్తిని ఇంట్లోనే నిల్వ చేశారు. ధర పెరుగుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. కానీ మొదట్లో ఉన్న ధర కూడా రానురానూ మరింత దిగజారుతుండటంతో ఆందోళన చెందుతున్నారు.

జైనథ్ మండల కేంద్రానికి చెందిన ఆశన్న నాలుగెకరాల్లో పత్తి సాగుచేశారు. 40క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు క్వింటాల్ పత్తి కూడా మార్కెట్‌కు తీసుకెళ్లలేదు. ధర పెరుగుతుందనే ఆశతో పత్తి మొత్తాన్ని ఇంట్లోనే నిల్వ ఉంచారు. ఇలాంటి రైతులు రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది ఉన్నారు. ధర పెరుగుతుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. కానీ, ధర పెరగకపోగా.. మరింత తగ్గుతుండటంపై ఆందోళన చెందుతున్నారు.





రాష్ట్ర వ్యాప్తంగా పత్తి రైతుల అవస్థలు తీరడం లేదు. మార్కెట్‌లో ధర పెరగకపోవడంతో పండించిన పత్తి పంటను ఇంట్లోనే నిల్వ చేసుకుంటున్నారు. పంట కాలం పూర్తయినా ఇంకా విక్రయించే పరిస్థితి లేదు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. మార్కెట్ ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.8300వరకు పలికిన ధర తాజాగా క్వింటాల్‌కు రూ.7300కి పడిపోయింది. దీంతో పత్తిని విక్రయించేందుకు రైతులు ముందుకు రావడం లేదు. మరోపక్క వాణిజ్య కొనుగోళ్లు చేపడతామని చెప్పిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పూర్తిగా చేతులెత్తేసింది. కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ కేంద్ర ప్రభుత్వం పత్తి సేకరణకు నిధులు తగ్గించింది. ప్రయివేటు వ్యాపారులతో సమానంగా ధర నిర్ణయిస్తూ రైతులకు ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. ఈ ఏడాది కనీసం కిలో పత్తి కూడా సదరు సంస్థ కొనుగోలు చేయకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క కిందటేడాది పత్తి మొత్తం విక్రయించిన తర్వాత క్వింటాల్‌కు రూ.10,300వరకు ధర ఉండటంతో రైతులు అదే ఆశతో ఉన్నారు. ఈ ఏడాది కూడా సీజన్ చివరలో పత్తి ధర రూ.10వేల వరకు పెరుగుతుందనే నమ్మకంతో ఉన్నారు. నెలల తరబడి క్వింటాళ్ల కొద్దీ పత్తిని ఇంట్లోనే నిల్వ చేసుకున్నారు. కానీ అధికారవర్గాలు మాత్రం ధర పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు.

పశుమిత్రలకు కనీస వేతనం ఇవ్వాలి

- 18న డీఆర్‌డీఏ ఆఫీసుల ఎదుట ధర్నాలు : సీఐటీయూ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని పశు మిత్రలకు కనీస వేతనమివ్వాలని పశుమిత్ర వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాను మాధవి డిమాండ్ చేశారు. ఈ నెల పశుమిత్రల డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 18న డీఆర్‌డీఏ ఆఫీసుల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామనీ, 20న కలెక్టర్లకు వినతిపత్రాలి స్తామని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ-పశు పోషకులకు మధ్య పశుమిత్రలు వారధిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వారికి కనీసం గౌరవ వేతనం కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. వారికి యూనిఫామ్‌లు, గుర్తింపుకార్డులు, గ్లౌజులు, మాస్కులు, మెడికల్ కిట్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పశుమిత్రలందరికీ ఏఐ ట్రైనింగ్ ఇవ్వాలని కోరారు. కొత్త రజిని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శ్రీరాం పద్మ, ఎమ్‌డీ నాజియా, సమీన్, చైతన్య, ఇరుసుల్ల శ్రీలత, మనీషా, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి : ఐద్వా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ వ్యాఖ్యలు అనుచితంగా సంస్కారహీనంగా ఉన్నాయనీ, ఇలాంటి వ్యాఖ్యలు మానుకోవాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆర్ అరుణజ్యోతి, మల్లులక్ష్మి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాజకీయ విమర్శలు ఇంగిత జ్ఞానంతో చేయాలని హితవుపలికారు. మహిళలంటే ఆ పార్టీకి చులకన భావం ఉన్నదనీ, అందుకే సంజయ్ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలనీ, లేదంటే తగిన విధంగా మహిళలు బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

ఎమ్మెల్యే పదవికి రాజయ్య రాజీనామా చేయాలి

మహిళా కాంగ్రెస్‌రాష్ట్ర కో ఆర్డినేటర్ నీలం పద్మ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మహిళా సర్పంచ్ పట్ల అనుచితగా ప్రవర్తించిన ఎమ్మెల్యే రాజయ్య తన పదవికి రాజీనామా చేయాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ నీలం పద్మ డిమాండ్ చేశారు. శనివారం ఈమేరకు హైదరాబాద్‌లో గాంధీభవన్ వద్ద రాజయ్య దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా పద్మ మాట్లాడుతూ జనగామా జిల్లా ధర్మసాగర్ మండలంలోని జానకిపురం సర్పంచ్ కురసపెల్లి నవ్యను లైంగికంగా వేధించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పదవి నుంచి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బర్తరఫ్ చేసి, ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత, మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు నవ్యకు క్షమాపణ చెప్పాలని కోరారు. కార్య క్రమంలో సికింద్రాబాద్ అధ్యక్షులు పుస్తకాల కవిత, నాయకులు సుభాషిణి, సంగీత, రమాదేవి, జిలాని, భాగ్యలక్ష్మి, రోజి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పేదల బతుకులు మారలే

గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు ఇవ్వాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి డిమాండ్

నవతెలంగాణ- బోధన్

తరాలు మారినా పేదల బతుకులు మారలేవని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి అన్నారు. 50 ఏండ్లుగా పేదలు కిరాయి ఇండ్లల్లోనే నివసిస్తున్నారని, పాలకులు వారికి కనీసం 120 గజాల ఇంటి స్థలం కేటాయించకపోవడం దారుణమని అన్నారు. నెహ్రూనగర్‌లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం నెహ్రూనగర్‌లో చేపట్టిన భూపోరాట కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. గుడిసెలు వేసుకున్న పేదలతో మాట్లాడారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు నిలువ నీడ కల్పించకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి పేదలు సుమారు 50 ఏండ్ల నుంచి అద్దె ఇండ్లల్లో ఉండి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరిగా పనులు లేక ఇంటి కిరాయి చెల్లించలేక పిల్లలను సైతం సరిగ్గా చదివించలేకపోయారని చెప్పారు. దీనికి తోడు పెట్రో, వంట గ్యాస్ ధరల పెరుగుదలతో నిత్యావసర ధరలు అమాంతంగా పెరిగాయని దీంతో బతకడమే కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల మీద ధరలు పెంచుతూ మరింత భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం గ్యాస్ బండ ధర రూ.410 నుంచి 1220 రూపాయల వరకు పెంచడంతోపాటు డీజిల్, పెట్రోల్ , కూరగాయలు, పప్పులు ఉప్పులు నూనె కారం ధరలు పెంచుతూ పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దలకు రాయితీలు కల్పిస్తూ పేదలపై భారాలు మోపుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.



పేదలతో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

బోధన్ ఎమ్మెల్యే షకీల్ గుడిసె వాసులకు అండగా ఉంటామని చెప్పారని, గుడిసెలు తొలగించొద్దని తహసీల్దార్‌ను ఫోన్‌లో ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. దీంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, ఐద్వా జిల్లా కార్యదర్శి సబ్బని లత, సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి ఏశాల గంగాధర్, ఫారూఖ్ మన్సూర్, గంగామణి, జరీనా యాస్మిన్ రాజు ఉన్నారు.

ఏప్రిల్ 5న ఢిల్లీలో మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ

- కార్మికులు, రైతులు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలి : సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఢిల్లీలో ఏప్రిల్ ఐదో తేదీన జరిగే మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ర్యాలీ జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....కార్మికులను, రైతులను దోపిడీ చేస్తూ అదానీ, అంబానీ వంటి కుబేరులకు 'అమృతకాల్' భరోసా కల్పించేందుకు మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. రోజురోజుకీ నిత్యావసరాల ధరలు పెరిగిపోతుండటంతో సామాన్యులు అల్లాడిపోతున్నారన్నారు. దేశంలో నిరుద్యోగం తారాస్థాయికి చేరిందని పేర్కొన్నారు. చారిత్రాత్మక రైతుల పోరాటం సందర్భంగా రైతు సంఘాలకు మోడీ సర్కారు రాతపూర్వకంగా ఇచ్చిన గిట్టుబాటు ధర ఏమైందని ప్రశ్నించారు. ఆరోగ్యం, వైద్య సౌకర్యాలు పేదలకు దక్కకుండాపోతున్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పని పద్మ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

హాత్ సే హాత్ జోడో యాత్ర...

- మార్చి 16 నుంచి ప్రారంభం
- ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర ఈ నెల 16 నుంచి జూన్ 15 వరకు 91 రోజులపాటు పాదయాత్ర చేయనున్నట్టు ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం, బజరహత్నూర్ మండలం, పిప్పిరి గ్రామం నుంచి పాదయాత్ర చేస్తానన్నారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి విలేకర్లతో మాట్లాడారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు 39 నియోజకవర్గాల్లో 1365 కిలోమీటర్ల మేర పాదయాత్రకు రూపకల్పన చేసినట్టు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగనే తెలంగాణ లక్ష్యాలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు పాదయాత్రలో భాగంగా మంచిర్యాల, హైదరాబాద్ శివారు ప్రాంతం, ఖమ్మంలో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వ అవినీతిపై విచారణ జరపాలి : మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ డిమాండ్ చేశారు. పంజాబ్, గోవా ఎన్నికల్లో ఆప్ పార్టీ డబ్బులు సమకూర్చిందని ఆరోపించారు. పంజాబ్ ఎన్నికల్లో ఎమ్మెల్సీ కవిత కూడా రూ 100 కోట్లు అడ్వాన్స్ ఇచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ ప్రాజెక్టుల్లో భారీ కుంభకోణాలు జరిగాయంటూ కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్నారే తప్ప బీఆర్ఎస్ ప్రభుత్వంపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

బండి మాటల్ని వక్రీకరిస్తున్నారు : తరుణ్‌చుగ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

లిక్కర్ స్కామ్ విషయంలో విచారణ ఎదుర్కొంటున్న కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల్ని వక్రీకరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ పేర్కొన్నారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దర్యాప్తు సంస్థల ముందు ఎవరైనా ఒక్కటేనని తెలిపారు. లిక్కర్ స్కామ్‌లో విచారణ ఎదుర్కొంటున్న కవిత నిజాలు చెప్పాలని సూచించారు. తెలంగాణ తొలి రాష్ట్ర క్యాబినెట్‌లో ఒక్క మహిళా మంత్రి కూడా లేరనీ, రెండో క్యాబినెట్‌లోనూ ఇద్దరే మహిళా మంత్రులున్నారని విమర్శించారు. అలాంటి వాళ్లు చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు కోసం కవిత ఢిల్లీలో దీక్ష చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

రైతుల్ని అడ్డుకోవద్దు : హైకోర్టు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సిద్దిపేట జిల్లాలో గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం పేరుతో తమను సొంత భూముల్లోకి వెళ్లనీయడం లేదంటూ గుడాటిపల్లి గ్రామానికి చెందిన బోయిని భాస్కర్ ఇతరులు వేసిన కేసులో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు పిటిషనర్లను వాళ్ల భూముల్లోకి వెళ్లనీయకుండా అడ్డుకోరాదని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఇతరులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రాజెక్టు కాంట్రాక్టర్, ఇరిగేషన్ ఆఫీసర్లు రైతుల విషయంలో సమయమనం పాటించాలని జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. హుస్నాబాద్ నుంచి రామవరం వెళ్లే రహదారిని పోలీసులు మూసివేశారని, తమ జీవనోపాధి కోసం తమ పొలాల్లోకి వెళ్లి పని చేయడానికి వీలు లేదని చెబుతున్నారని రైతుల లాయర్ చెప్పారు. రైతులకు పరిహారం ఇచ్చామని ప్రభుత్వం చెప్పింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు విచారణను 31కి వాయిదా వేసింది.

దానంపై చార్జిషీట్ డిస్మిస్

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలోకి చొరబడి దౌర్జన్యానికి పాల్పడ్డారనే అభియోగాల కేసులో ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. కింది కోర్టులో పోలీసులు నమోదు చేసిన చార్జీషీట్‌ను కొట్టివేసింది. 2012 నాటి కేసులో ఆలయ మేనేజర్ సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు తర్వాత పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ ఆయనతో రాజీ చేసుకున్నారు. ఇరువురి మధ్య జరిగిన రాజీ ఒప్పందాన్ని పరిశీలించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ పోలీసుల చార్జిషీట్‌ను కొట్టేస్తూ తుది ఉత్తర్వులిచ్చారు.

విచారణను ఎదుర్కొండి

ఓబుళాపురం మైనింగ్ లీజులో అక్రమాలు జరిగాయనే కేసులో సీబీఐ కోర్టులో వేసిన డిశ్చార్జి పిటిషన్‌ను కొట్టేయడాన్ని సవాల్ చేసిన గనుల శాఖ మాజీ డైరెక్టర్ రాజగోపాల్ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో తన డిశ్చార్జి పిటిషన్ ను సీబీఐ కోర్టు కొట్టేయడం అన్యాయమని పిటిషనర్ వాదనను చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ తోసిపుచ్చారు. సీబీఐ కోర్టులోని అభియోగాలపై విచారణను ఎదుర్కొనాలని చెప్పారు.

మహిళలను అవమానించాలని ఏ మతం చెప్పింది? : కూనంనేని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అవమానపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళల వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని, బహిరంగంగా మాట్లాడలేని పదాలతో మాట్లాడిన బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునే విధంగా వున్నాయని తెలిపారు. కవితపై విచారణ జరుగుతున్న క్రమంలోనే అరెస్టులపై ద్వంద అర్థాలు వచ్చే విధంగా సంజయ్ చేసిన వ్యాఖ్యలు ముందస్తు ప్రణాళికలో భాగమేనని పేర్కొన్నారు. కవితను అరెస్టు చేస్తారనే నిర్ణయానికి బీజేపీ నాయకులు ముందే వచ్చారని తెలిపారు. ప్రతిపక్షాల నోర్లు నొక్కడానికి ముందస్తు ప్రణాళికతోనే అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. మహిళలను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేయమని హిందూ సంస్కృతి, సాంప్రదాయం నేర్పిందా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కవితపై చేసిన వ్యాఖ్యలకు బండి సంజయ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నయం చేయలేని జబ్బు

- నాలుగు లక్షల మందికి శాశ్వత అంధత్వ ప్రమాదం
- నేటి నుంచి గ్లకోమా వారోత్సవాలు : కంటి వైద్య నిపుణులు

నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

గ్లకోమా (నీటి కాసులు) నయం చేయలేని జబ్బు. ఒకసారి వస్తే దాన్ని తిరికి వెనక్కి పంపించడం సాధ్యం కాదు. కంటి వెనుకభాగంలో ఉన్న నరం దెబ్బతినడం ద్వారా వచ్చే ఈ వ్యాధి కారణంగా రాష్ట్రంలో దాదాపు నాలుగు లక్షల మంది శాశ్వత అంధత్వానికి గురయ్యే ప్రమాదముందని అంచనా. ఎటువంటి నొప్పి, లక్షణాలు లేకుండా క్రమేణా కనుచూపును కనుమరుగు చేస్తున్న నిశ్శబ్ద అంధత్వ కారకమైన గ్లకోమా పట్ల అప్రమత్తంగా ఉండాలని పలువురు కంటి వైద్యులు సూచిస్తున్నారు. శనివారం సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని, గ్లకోమా స్పెషలిస్ట్ ప్రొఫెసర్, డాక్టర్ వెంకటరత్నం, గ్లకోమా విభాగం డాక్టర్ సువర్ణ, ఆర్ఎంఓ నజఫియా, హైదరాబాద్ జిల్లా అంధత్వ నియంత్రణ అధికారి డాక్టర్ దీపక్ రెడ్డి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మోదిని మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది మార్చి 12 నుంచి 18 వరకు గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తుంటారని తెలిపారు. ఈ క్రమంలో మన రాష్ట్రంలోనూ ప్రజల్లో అవగాహన పెంచేలా వారోత్సవాలను వినియోగించుకుంటున్నట్టు చెప్పారు. ఆదివారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు హైదరాబాద్ సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో నిర్వహించే ప్రదర్శన, సదస్సును వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ప్రారంభించనున్నట్టు తెలిపారు. అనంతరం వారం రోజుల పాటు రకరకాల కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తామని వెల్లడించారు.

40 ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరు ఏడాదికి ఒకసారైనా గ్లకోమా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్లకోమా కలిగిన కుటుంబ చరిత్ర, చుక్కలు, ఇంజెక్షన్స్, ఇన్ హేలర్, చర్మ సంబంధమైన కణాలరుగ్మతలు, క్యాన్సర్ రోగులు, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, షటిల్ ఆడే వారు, రెటీనా ఆపరేషన్ అయినవారు, కంటికి చిన్నపాటి దెబ్బతులు తగిన వారు పరీక్షలు చేయించుకోవడం మంచిదని తెలిపారు. ఈ వ్యాధిగ్రస్తుల్లో 40 శాతం మందికి వంశపారంపర్యంగా వస్తుందన్నారు. తరచూ కండ్లద్దాలు మార్చాల్సి వచ్చిన వారిలోనూ, తలవెంట్రుకలు రాలిపోతున్నాయని స్టెరాయిడ్స్ ఆయిల్స్ వాడే వారిలోనూ గ్లకోమా వచ్చే ప్రమాదముందన్నారు. గ్లకోమా ఒక కంటిలో మొదలై రెండో కంటిలోనూ పెరిగిపోతుందని హెచ్చరించారు. గ్లకోమా వచ్చిన వారికి కాటరాక్ట్ పరీక్ష చేసినా ప్రయోజనం ఉండదని తెలిపారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇతర ఆరోగ్య సంస్థల అంచనాల ప్రకారం జనాభాలో ఒకశాతం మందిలో గ్లకోమా ఉందని తెలిపారు. ఆ లెక్కన మన రాష్ట్రంలోనూ నాలుగు లక్షల మందిలో ఈ వ్యాధి వివిధ దశల్లో ఉండే అవకాశముందన్నారు. వీరిలో 90 శాతం మందికి తమలో వ్యాధి పెరుగుతున్న అవగాహన లేదన్నారు. కేవలం 10 శాతం మంది మాత్రమే చికిత్స కోసం వస్తున్నారనీ, వారిలోనూ కాలాతీతమైన వారు అంధత్వం బారిన పడుతున్నారనీ, ఇలాంటి వారికి నేత్రదానం ద్వారా కూడా కూడా చూపు తెప్పించలేమని స్పష్టం చేశారు.

బిల్లులివ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటా..

అధికారులకు సర్పంచ్ అల్టిమేటం

- సోషల్ మీడియాలో ఆడియో వైరల్

నవతెలంగాణ - గంగాధర

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులపై ఓ సర్పంచ్ రిలీజ్ చేసిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బిల్లుల పేమెంట్ చేయకపోతే పదిహేను రోజుల్లో ఆత్మహత్య చేసుకుంటానంటూ ఆడియోలో అధికారులకు అల్టిమేటం జారీ చేశారు. ఆడియోలోని వివరాలిలా ఉన్నాయి..

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకటాయపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమల్ల మేఘరాజ్ ఓ ఆడియోను రికార్డు చేసి అధికారులకు పంపుతూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తన గ్రామంలో శ్మశానవాటిక, సెగ్రేషన్ షెడ్డు నిర్మాణం చేపట్టగా నేటికీ ఎంబీ రికార్డు చేయ లేదని ఆరోపించారు. రూ.64 వేలు వెచ్చించి క్రీడా ప్రాంగణం నిర్మిస్తే రూ.42 వేల ఎన్ఆర్‌ఈజీఎస్ ద్వారా పేమెంట్ అయిందని ఆవేదన చెందాడు. గ్రామంలో చేపట్టిన పనులకే బిల్లులు పేమెంట్ కాక ఇబ్బంది పడుతుంటే, అధికారుల ఒత్తిడితో వర్షాలకు కూలిన సెగ్రేషన్ షెడ్డు రెండోసారి నిర్మిస్తే బిల్లు రికార్డు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోయాడు. అభివృద్ధి పనులు చేపట్టేలా ఒత్తిడి చేసిన ఎంపీడీవో భాస్కర్‌రావు, ఈజీఎస్ ఏపీవో చంద్రశేఖర్ బిల్లుల పేమెంట్ విషయంలో పట్టించుకోక నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామ కార్యదర్శి లాంగ్ లీవ్ పెట్టుకుని వచ్చిపోతుంటే గ్రామాభివృద్ధి కుంటుపడిందని, కొత్త కార్యదర్శిని నియమించాలని డీపీవోకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందాడు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎంబీ రికార్డులు చేయకపోగా, రికార్డు అయిన పేమెంట్ కాక తనలాగే సర్పంచులు ఆవేదన చెందుతున్నారని, తన ఆత్మహత్యతోనైనా సర్పంచులకు న్యాయం జరుగుతుందని రికార్డులో పేర్కొన్నారు. పదిహేను రోజుల్లో తన బిల్లుల పేమెంట్ చేయపోతే గంగాధర మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకోవడం ఖాయమని సర్పంచ్ మేఘరాజు అధికారులకు అల్టిమేటం జారీ చేశారు.



సర్పంచులు, గులాబీ గూటిలో ఆడియో కలకలం

తను ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ అధికార పార్టీ సర్పంచ్ శ్రీమల్ల మేఘరాజు ఓ వైపు అధికారులకు, మరో వైపు సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఆడియో కలకలం రేపుతోంది. నిన్న, మొన్నటి వరకు బిల్లులు, పేమెంట్ కాకుండా ఇబ్బంది పడుతూ ఆత్మహత్య చేసుకున్న వారి ఘటనలు, పేపర్ క్లిప్పింగ్స్‌ను సర్పంచ్ మేఘరాజు ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేసేవారు. అందరిలాగే తాను బాధపడుతున్నట్టు ఆడియో రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయడం వైరల్‌గా మారింది. వెంకటాయపల్లి సర్పంచ్ శ్రీమల్ల మేఘరాజు తరహాలో ప్రతి గ్రామ సర్పంచ్ బిల్లులు పేమెంట్ జరుగక మదన పడుతున్నారు. అధికార పార్టీలో ఉంటూ బాహాటంగా ఆందోళన వ్యక్తం చేయలేక, బిల్లులు పేమెంట్ జరుగక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే బిల్లు పేమెంట్ చేశాం : అధికారుల వెల్లడి

ఎన్ఆర్‌ఈజీఎస్ కింద నిర్మించిన సెగ్రేషన్ షెడ్డుకు ఇప్పటికే బిల్లు పేమెంట్ చేశామని ఏపీవో చంద్రశేఖర్ వెల్లడించారు. నిర్మించిన షెడ్డు వర్షాలకు కూలిపోగా మరోసారి సెగ్రేషన్ షెడ్డు నిర్మించిన సర్పంచ్ ఏఈ పీఆర్ ద్వారా బిల్లు రికార్డు చేసుకుని జీపీ ఫండ్స్ ద్వారా పేమెంట్ తీసుకోవాలన్నారు. సెగ్రేషన్ షెడ్డుకు ఇప్పటికే పేమెంట్ చేసినందున మరోసారి చేయరాదని స్పష్టం చేశారు. ఇదే విషయమై పీఆర్ ఏఈ రమేశ్‌ను వివరణ కోరగా, ఎన్ఆర్‌ఈజీఎస్ ద్వారా బిల్లు పేమెంట్ కావాలి తప్ప తాను చేసేదేమీ లేదన్నారు. ఒకే సెగ్రేషన్ షెడ్డుకు రెండుసార్లు ఎంబీ రికార్డు చేయడం సాధ్యంకాదన్నారు. ఎంపీడీవో భాస్కర్‌రావును ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. గ్రామ కార్యదర్శి లేక ఇబ్బంది పడుతున్న అంశాన్ని ఎంపీవో జనార్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఉన్న కార్యదర్శి లాంగ్ లీవ్‌లో వెళ్లారని, కాచిరెడ్డిపల్లి కార్యదర్శికి అదనపు బాధ్యతలు ఇచ్చామని చెప్పారు.

సంపాదకీయం

అపాయం..ఊబకాయం!

కొత్త అల్లుడు ఇంటికొస్తే... రకరకాల రుచికరమైన వంటకాలతో వడ్డిస్తారు. ఏకంగా 135 వంటకాలతోనో, 379 వంటకాలతోనో విందు భోజనం వడ్డించారన్న వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంటాయి. ఇష్టమైనవారికి కోరిన వంటకాలు చేయడం, కొసరి కొసరి వడ్డించడం... ప్రేమను వ్యక్తీకరించే ఒక మార్గం. 'వివాహ భోజనంబు వింతైన వంటకంబు/ వియ్యాలవారి విందు ఓ హొహ్హొ నాకె ముందు/ ఔరౌర గారెలల్ల అయ్యారె బూరెలిల్ల/ ఓహ్హోరె అరెసెలుల్ల అహహ్హహ...' అంటూ షడ్రసోపేతమైన పెళ్లి విందును రకరకాల పదార్థాల పేర్లతో బహు పసందుగా రాస్తాడు సినీకవి పింగళి. సినిమాల్లోనే కాదు... నిజ జీవితంలోనూ భోజన ప్రియులు భుక్తాయాసంతో తేన్చాల్సిందే. గతంలో అందుకు తగ్గట్టుగానే శారీరక శ్రమ కూడా వుండేది. కానీ, ఈ రోజుల్లో మారిన జీవనశైలి, తప్పిన ఆహారపు అలవాట్ల వల్ల ఇంతకుముందెన్నడూ చూడని రోగాలు రొప్పులు, ప్రాణాంతక వ్యాధులు ముప్పుగా మారాయి. ముఖ్యంగా అధిక బరువు, ఊబకాయం విపరీ తంగా పెరిగింది. పిల్లలు సైతం ఈ స్థూలకాయం బారిన పడడం ఓ విషాదం.

> **నయా ఉదారవాద విధానాలు అమల్లోకి వచ్చిన తర్వాత షార్ట్‌కట్‌లో సక్సెస్ సాధించి, పిల్లలను డబ్బు సంపాదించే యంత్రాలుగా మార్చాలని అనేకమంది తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. ప్రభుత్వాల విద్యావిధానం కూడా ఇందుకు తగ్గట్టుగానే వుంది. దీంతో పిల్లల్లో గతంలో మాదిరిగా ఆట, పాట కొరవడింది. స్కూల్స్‌లో సైతం ఆట పాటలను పక్కన బెట్టి పాఠాలను బట్టీ వేయడమే పనిగా పెట్టుకుంటున్నారు. అసలు కొన్ని స్కూళ్లకు ఆటస్థలాలే లేవు. కొండొకచో వున్నా... పిఇటీలు వుండరు. చెరువుల్లో కాలువల్లో ఈతలెయ్యడం వంటివి ఇప్పటివారికి అసలే తెలియవు.**



'తిండి కలిగితే కండ కలదోయ్.. కండ కలవాడే మనిషోయ్' అని గురజాడ అప్పుడెప్పుడో అన్నారు. కానీ ఈ కాలంలో ఇది రివర్స్ అయ్యింది. 'ఒక్కపూటే తినవోరు... ఆరోగ్యంగా వుండవోరు' అంటున్నారు. ఏం తినాలి, ఏం తినకూడదు...తింటే ఎంత తినాలి అనే అవగాహన లేకపోతే... అనారోగ్యం బారిన పడకతప్పదంటున్నారు కొందరు నిపుణులు. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో ఊబకాయం ఒకటి. 2035 నాటికి ప్రపంచ జనాభాలో సగానికిపైగా ఊబకాయం, అధిక బరువు సమస్యతో బాధపడతారని తాజాగా 'అంతర్జాతీయ ఒబేసిటీ ఫెడరేషన్' హెచ్చ రించింది. ఊబకాయంతో బాధపడుతున్న జనాభా వున్న దేశాల్లో భారత్ కూడా వుంది. రాబోయే దశాబ్దంలో ప్రతి నలుగురిలో ఒకరు ఊబకాయం సమస్యతో బాధపడనున్నారు. ముఖ్యంగా ఈ సమస్య చిన్నారుల్లోనూ, తక్కువ ఆదాయంగల దేశాల్లోనూ వేగంగా పెరుగుతోందని డబ్ల్యుఓఎఫ్ అంచనా వేసింది. ఈ నివేదిక ప్రపంచానికొక హెచ్చరిక. పరిస్థితి మరింత దిగజారక ముందే జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నారులు, యుక్తవయస్సు వారిలో ఊబ కాయం పెరుగుదల రేటు ఆందోళన కలిగించే రీతిలో పెరుగుతోంది. ఈ సమస్యను నివారించే దిశగా ప్రభుత్వాలు, ఆరోగ్య నిపుణులు దృష్టి సారించాల్సివుంది. 2035 నాటికి 208 మిలియన్ల మంది అబ్బాయిలు, 175 మిలియన్ల మంది అమ్మాయిల్లో స్థూలకాయం రేటు రెట్టింపు కానుందని ఆ నివేదిక చెబుతోంది. మరోవైపు ఆకలికేకలు, పోషకాహార లోపం, రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులు, మహిళలు కనిపించే దేశం మనది. శతాబ్దాల నుంచి పోషకాహార సమస్య వెంటాడుతుండగా, దశాబ్ద కాలంగా ఊబకాయ సమస్య కూడా దానికి తోడయ్యింది. పూర్తి భిన్నమైన రెండు సమస్యలను ఏకకాలంలో మన దేశం ఎదుర్కొంటోంది.

నయా ఉదారవాద విధానాలు అమల్లోకి వచ్చిన తర్వాత షార్ట్‌కట్‌లో సక్సెస్ సాధించి, పిల్లలను డబ్బు సంపాదించే యంత్రాలుగా మార్చాలని అనేకమంది తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. ప్రభుత్వాల విద్యావిధానం కూడా ఇందుకు తగ్గట్టుగానే వుంది. దీంతో పిల్లల్లో గతంలో మాదిరిగా ఆట, పాట కొరవడింది. స్కూల్స్‌లో సైతం ఆట పాటలను పక్కన బెట్టి పాఠాలను బట్టీ వేయడమే పనిగా పెట్టుకుంటున్నారు. అసలు కొన్ని స్కూళ్లకు ఆటస్థలాలే లేవు. కొండొకచో వున్నా... పిఇటీలు వుండరు. చెరువుల్లో కాలువల్లో ఈతలెయ్యడం వంటివి ఇప్పటివారికి అసలే తెలియవు. వ్యాయామాలను పక్కనపెట్టేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే శారీరక శ్రమ, కంటినిండా నిద్రా వుండాలి. ఇప్పుడా రెండూ లేవు. దీనికితోడు మొబైల్ ఫోన్లు పిల్లల ఆరోగ్యానికి మరింత ప్రతిబంధకంగా మారాయి. 'పాపం, పుణ్యం, ప్రపంచమార్గం/ కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ/ ఏమీ ఎరుగని పూవుల్లారా/ అయిదా రేడుల పాపల్లారా' అంటాడు మహాకవి శ్రీశ్రీ. భావితరానికి దూతలు వీళ్లు. వీరిని యంత్రాలుగా, ఊబకాయులుగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. 'మీదే, మీదే సమస్త విశ్వం/ మీరే లోకపు భాగ్యవిధాతలు/ మీ హాసంలో మెరుగులు తీరును/ వచ్చేనాళ్ల విభాప్రభాతములు' అని శ్రీశ్రీ అన్నట్టుగా- దేశం ప్రగతిపథంలో పయనించాలంటే... ఉత్సాహంతో ఉరకలెత్తే యువతరం కావాలి.

> **సిసోడియాను విడుదల చేయాలని కూడా స్టాలిన్ తన లేఖలో రాయడం జరిగింది. ఆయనను మరో సంస్థ ద్వారా కస్టడీలో కొనసాగించడం, ముఖ్య మంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను కూడా అరెస్టు చేయొచ్చని బీజేపీ చోటా నాయకులు బెదిరిస్తూనే ఉన్నారు.ఈ లేఖల తర్వాతనే బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ యాదవ్‌ఆయన కుమార్తెల ఇండ్లపై దాడులు చేశారు.అంటే ఇదంతా కావాలని జరుగుతున్నదేనని స్పష్టమవుతుంది.**

> **గౌతం అదానీ ఇంతగా దేశాన్ని దగా చేయగలిగాడంటే ప్రధాని మోడీ ఆయన ప్రభుత్వ అండదండలే కారణమని ప్రతి ఒక్కరూ విమర్శించారు. పార్లమెంటులోనూ ప్రతిపక్షాలు నిలదీశాయి. ఈ వ్యవహారం మొత్తం కూలంకషంగా దర్యాప్తు చేయడానికి సంయుక్త పార్లమెంటరీ సంఘం(జేపీసీ) వేయాలని గట్టిగా పట్టుపట్టాయి.వారి కంఠశోష,పార్లమెంటు సమయం హరించుకుపోవడం తప్ప దమ్మిడీ ప్రయోజనం కలగలేదు.**

మోడీని కాదంటే ఈడీ...



తెలకపల్లి రవి

గత నెల ప్రారంభంలో హిండెన్ బర్గ్ నివేదిక విడుదలైన తర్వాత ఒక్కసారిగా అదానీ సామ్రాజ్యం కుప్పకూలినంత పనైంది.దేశంలోనే గాక ప్రపంచ వ్యాపితంగా ఆ గ్రూపు ప్రభలు కొడిగట్టాయి. రాజకీయ పార్టీల నుంచి సుప్రీం కోర్టు వరకూ ఆందోళనతో ఆగ్రహంతో స్పందించాయి. దేశదేశాల మీడియా సంస్థలు కథ నాలు ప్రకటించాయి. గౌతం అదానీ ఇంతగా దేశాన్ని దగా చేయగలిగాడంటే ప్రధాని మోడీ ఆయన ప్రభుత్వ అండ దండలే కారణమని ప్రతి ఒక్కరూ విమర్శించారు. పార్లమెంటులోనూ ప్రతిపక్షాలు నిలదీశాయి. ఈ వ్యవహారం మొత్తం కూలంకషంగా దర్యాప్తు చేయడానికి సంయుక్త పార్లమెంటరీ సంఘం(జేపీసీ) వేయాలని గట్టిగా పట్టుపట్టాయి.వారి కంఠశోష,పార్లమెంటు సమయం హరించుకుపోవడం తప్ప దమ్మిడీ ప్రయోజనం కలగలేదు. చివరలో చర్చకు సమాధానమిచ్చిన మోడీ వాటిపై సమాధానం ఇవ్వడం కాదు కదా కనీసం ఖండిం చడం కూడా జరగలేదు!ఎల్ఐసి,ఎస్‌బిఐల నుంచి రూ.లక్ష కోట్ల వరకూ అప్పులు ఇప్పించి అదానీని అందలమెక్కించిన కేంద్రం నిర్వాకం కనీసంగా విచారణకు నోచలేదు! దీనిపై పరిశీలనకు ఒక విచారణ కమిటీని నియమించాలని భావించిన సుప్రీం కోర్టుకు కూడా కేంద్రం సహకరించలేదు. తనుగానే అత్యున్నత న్యాయస్థానం ఒక కమిటీని వేసింది.

> **ఈ సమయంలో ఎనిమిది పార్టీలకు చెందిన తొమ్మిది మంది నాయకులు వారిలో నలుగురు ముఖ్యమంత్రులు, అయిదుగురు మాజీలు ప్రధాని మోడీకి లేఖరాస్తూ దర్యాప్తు సంస్థలను ప్రత్యర్థు లపై నిర్బంధానికి దుర్వినియోగపర్చడం అప్రజాస్వామికమని విమర్శించారు. అదానీ ఉదంతం వలే బీజేపీకి అనుకూలమైతే రక్షించడం,తమ పార్టీలో చేరితే వదలివేయడం ద్వంద్వనీతి అని తేల్చిచెప్పారు.**

ఈ దర్యాప్తునకు సహకరించకపోగా కేంద్రం సంస్థలు బీజేపీకి దగ్గరగా ఉండే మహాకుబేరులు అదానీని కాపాడేందుకు రంగంలోకి దిగారు.అంతిమంగా అమెరికాకు చెందిన రాజీవ్ దేశాయ్ భారీ రుణమిచ్చి ఆదుకున్నారు. ఇప్పుడు ఆ గ్రూపు గట్టెక్కిందని కథనాలు వదులుతున్నారు. అదానీ చిక్కులెదుర్కొంటున్న మరోదేశం ఆస్ట్రేలియా ప్రధానిని పిలిపించి మరీ క్రికెట్ ఆట ముసుగులో మంతనాలాడి దారికి తెచ్చుకున్నారు. ఇది అస్మదీయుల సంగతి.

తస్మదీయులే లక్ష్యం

మరి తస్మదీయులైతేనో?ఢిల్లీలో లిక్కర్ స్కాం జరిగిందంటూ వార్తలు లీక్‌లు వచ్చాయి. ఏడాది కిందటినుంచి బీజేపీ నేతలు దీని గురించి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ కుటుంబ సభ్యులు అరెస్టు కాకతప్పదని చెబుతూ వచ్చారు.ఇంతకూ ఈ కుంభకోణం విచారించాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ విజయ్ సక్సేనా సీబీఐని కోరారు.వారు రంగంలోకి దిగాక బీజేపీ నేతల దాడి దూకుడు మరింత పెరిగాయి.తెలంగాణలో ఆపరేషన్ ఫాంహౌస్ ప్రహసనం తర్వాత బీజేపీ నేతల దాడి మరింత పెరిగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అరెస్టు కావలసిందేనని బీజేపీ అధ్యక్షుడు బండిసంజయ్ పలుమార్లు బెదిరించారు.తర్వాత ఈ దాడి ఎంఎల్‌సి కవితపైకి మరలింది. సౌత్‌గ్రూపుగా ఏర్పడిన కొందరు వైసీపీ, బీఆర్ఎస్ నాయకులు ఢిల్లీ మద్యపాన విధానాన్ని మార్పు చేసి తమకు లాభం వచ్చేలా చేసుకున్నారని ఈ క్రమంలో రూ. వందకోట్లు ముడుపులు ముట్టాయని తెలంగాణ బీజేపీ మోతమోగిం చింది.ఢిల్లీలోనూ ఆప్‌ను దెబ్బతీయడానికి ఇదే ప్రచారం మరింత తీవ్రంగా నడిచింది. కేవలం సందేహాల ఆధారంగానే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడి) రంగంలోకి దిగింది. తమ ఇల్లు మొత్తం సోదా చేసిన ఈడి ఏ ఆధారాలు దొరకలేదని ప్రకటించిందని ఇప్పుడు అరెస్టులో ఉన్న మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్‌సిసోడియా ప్రకటించారు. అయితే అది వేగంగా మారిపోయింది.ఏవో ఆధారాలు దొరికాయంటూ హైదరాబాద్ లో కొన్ని అరెస్టులు చేశారు. ఆ తర్వాత దీనంతననటికీ సంధానకర్త కవిత అంటూ ఆమెపై దాడి మొద లెట్టారు. కవిత ఇందుకు సంబంధించిన ఫోన్లు ధ్వంసం చేశారనేది మాత్రమే వారు చెబుతున్న ఆధారం. చచ్చిపోయిన గేదె పగిలి పోయిన కుండడు పాలు ఇచ్చేదన్న చందంగానే ఈ వాదన ఉంది. తమాషా ఏమంటే ఇదంతా కూడా మొదట మీడియాలో రావడం తర్వాత ఈడీ సీబీఐ రంగంలోకి దిగడం.ఆ విధంగా ఆంధ్ర తెలం గాణ రాష్ట్రాల్లో లిక్కర్ కంపెనీలకు మీడియా సంస్థలు లాబీయింగ్ వ్యవస్థకు సంబంధించిన పలు వురిని అదుపులోకి తీసుకున్నారు. కవిత నిర్దేశకత్వంలో అరుణ్ రామచంద్ర పిళ్లై అనే ఆసామి వీరందరినీ సమన్వయం చేశారనేది సీబీఐఈడీ ఆరోపణ.వారిని వారి తర్వాత సిసోడియాను అదుపులోకి తీసుకున్నారు. ఆయన తర్వాత రాజకీయ ప్రచారం ఎక్కువ చేసింది కవిత గురించే.ఆమెను రెండు మూడు సార్లు విచారించారు. ఆ సమ యంలో ఉద్రిక్తత కూడా తారాస్థాయికి చేరింది. ఈ వారంలో మరోసారి విచారణకు పిలిస్తే ఆమె ఢిల్లీలో మహిళా రిజర్వేషన్ల బిల్లు గురించిన దీక్ష కారణంగా వాయిదాకోరి ఈ రోజు హాజరయ్యారు. ఆ క్రమంలో ఆమె ఫొటోలు ప్రచురించి ఆమె చాలా భయపడుతున్నట్టు వ్యాఖ్యలు రాశారు.అనేక ఇంటర్వ్యూలు ఇచ్చిన కవిత తనకు ఈ వ్యవహారంతో ఏం సంబంధం లేదని భయం కూడా లేదని చెబుతూ వచ్చారు. ఈమధ్యలో ఆమె ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడటం, వ్యూహం నిర్ణయించుకోవడం ప్రతిదీ అపహాస్యం చేశారు. స్కాం ఇప్పటికే రుజువైనట్టు, ఆమె కుటుంబం పార్టీ కూడా పద్మవ్యూహంలో చిక్కినట్టు ప్రచారం సాగింది.

ఎనిమిది పార్టీల అభ్యంతరం

ఈ సమయంలో ఎనిమిది పార్టీలకు చెందిన తొమ్మిది మంది నాయకులు వారిలో నలుగురు ముఖ్యమంత్రులు, అయిదుగురు మాజీలు ప్రధాని మోడీకి లేఖరాస్తూ దర్యాప్తు సంస్థలను ప్రత్యర్థు లపై నిర్బంధానికి దుర్వినియోగపర్చడం అప్రజాస్వామికమని విమర్శించారు. అదానీ ఉదంతం వలే బీజేపీకి అనుకూలమైతే రక్షించడం,తమ పార్టీలో చేరితే వదలివేయడం ద్వంద్వనీతి అని తేల్చిచెప్పారు. లేఖపై సంతకం చేసిన బీఆర్ఎస్, ఆప్, టీఎంసీ, నేషనల్ కాన్ఫరెన్స్, శివసేన, సమాజ్‌వాది, ఆర్జేడి, నాయకులందరూ ఈ విధమైన వేటకు గురైనవారే, గవర్నర్లను అడ్డం పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వాలతో చెలగాలమాడటం తప్పని కూడా హెచ్చరించారు. (ఢిల్లీ లిక్కర్ వ్యవహారం లెఫ్టినెంట్ గవర్నర్‌దగ్గరే మొదలైందని గుర్తుంచుకోవాలి.ఆ లేఖ రాసిన రోజునే తెలంగాణ గవర్నర్ తమిళిసై వివాదం రాజేయడం యాదృచ్ఛికం కాదు) ఈ లేఖలో సంతకాలు చేసిన వారంతా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారేనని ఆరోపిస్తూ దీనిపై కాంగ్రెస్ వామ పక్షాల నేతల సంతకాలు లేక పోవడం గురించి ఎక్కువ చేసి చూపించారు. తర్వాత కేరళ ముఖ్య మంత్రి పినరాయి విజయన్, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ విడి విడిగా మోడీకి ఇదే విష యమై లేఖలు పంపించారు. కేసుల మంచి చెడ్డలు ఏమైనా దర్యాప్తు సంస్థల తీరు పారదర్శకంగా నిష్పక్ష పాతంగా లేదని పినరాయి సోదాహరణంగా వ్యాఖ్యానిం చారు. ఇంతకూ పినరాయి విజయన్ తన లేఖలో పేర్కొన్నట్టు ఈ కుంభకోణా నికి సంబంధించి ఎలాటి ఆధారాలు లేదా నగదు కాదంటే డేటా దొరికినట్టు ఇంతవరకూ వెల్లడి కాలేదు. సిసోడియాను విడుదల చేయాలని కూడా స్టాలిన్ తన లేఖలోరాయడం జరిగింది. ఆయనను మరో సంస్థ ద్వారా కస్టడీలో కొనసాగించడం, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను కూడా అరెస్టు చేయొచ్చని బీజేపీ చోటా నాయకులు బెదిరిస్తూనే ఉన్నారు.ఈ లేఖల తర్వాతనే బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ యాదవ్‌ఆయన కుమార్తెల ఇండ్లపై దాడులు చేశారు.అంటే ఇదంతా కావాలని జరుగుతున్న దేనని స్పష్టమవుతుంది.

ఇదే మోడీ న్యాయం

అదేపనిగా ప్రత్యర్థులపై దాడులు దుష్ప్రచారాలతో లొంగదీసుకునే మోడీ ప్రభుత్వ పోకడలకు తోడు మీడియాలో పక్షపాత ధోరణుల వల్ల ఈడీ,ఐటీ, సీబీఐలను దుర్వినియోగ పరిచే త్రిశూల వ్యూహం తగినంతగా ప్రజల దృష్టికి రావడం లేదు. ప్రజాస్వామ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ పార్టీలకూ సమానమైన హక్కులు ఉంటాయనే సత్యం విస్మరించబడుతున్నది. కేంద్ర దర్యాప్తు సంస్థలు స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేయాలి.గతంలోనూ వీటిపై ఆరోపణలు ఉన్నమాట నిజమే గాని మోడీ హయాంలో వాటిని పూర్తి కీలుబొమ్మలుగా మార్చివేయడం సత్యం. సీబీఐ, ఈడీలకు అధిపతులను నియమించేప్పుడు సుప్రీం కోర్టు సూచనలు తోసిపుచ్చి తమకు లోబడి ఉండేవారి సర్వీసు పొడగించి మరీ ఎంపికచేస్తున్నారు.వారిని తమ ఇష్టానుసారం వేధింపులకు పాల్పడు తున్నారు. ముందే చెప్పినట్టు అస్మదీయులకు ఒక నీతి తస్మదీయులకు ఒక నీతి అంటున్నారు. తృణమూల్ నాయకులు సువేందుఅధికారి, ముకుల్ రాయ్ తమతో చేరగానే వారిపై దర్యాప్తులు ఆగిపోయాయి. తెలుగునాట కూడాకొందరు టీడీపీ నేతలకు ఇదే విధమైన ఉపశమనం లభించింది. మరోవంక తమను వ్యతిరేకించేవారిపై నిరంతరాయంగా దాడులు, దర్యాప్తులు నాటకీయంగా సాగిస్తున్నారు. కేరళ వామపక్ష ప్రభుత్వంపైన ముఖ్యమంత్రిపైన కూడా బంగారం స్మగ్లింగ్ కేసు మోపాలని విఫలయత్నం చేసిన కేంద్రం దాన్ని ఏదో రూపంగా సాగదీస్తూనే ఉంది. మోడీతో జోడీ లేదంటే ఈడీ అన్నది ఇప్పుడు తారకమంత్రంగా మారింది. సంపన్న వ్యాపార వేత్తలు, వ్యాపారాలు గల సంపన్న రాజకీయ నేతలు స్వీయ రక్షణ కోసం బీజేపీని ఆశ్రయించితే రక్షణ దొరుకుతుందని భావిస్తున్నారు. మరోవంక మానవ హక్కుల కోసం, ప్రజల కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో సహా లేనిపోని దాడులకు, వేధింపులకు గురవుతున్నారు. న్యూస్‌క్లిక్, క్వింట్‌తో సహా అనేక మీడియా సంస్థలు నడిపించడం దుర్భరంగా మార్చేశారు.ఇవేవీ ప్రజాస్వామిక లక్షణాలు కావు. ఇది ప్రభుత్వ పరిధులు దాటి రాజకీయపార్టీగా బీజేపీ ఇష్టారాజ్యంగా మారుతున్నది.

చాలామంది తప్పుగా భావిస్తున్నట్టు లేదా కొందరు వాఖ్యాతలు చిత్రిస్తున్నట్టు ఇది అవినీతి నిరోధానికి సంబంధించిన అంశం కాదు. అవినీతి వ్యవహారాలకు ఆధారాలుంటే పార్టీల ప్రమేయం లేకుండా ఎవరిపైనైనా చర్యతీసుకోవాల్సిందే. శిక్షలు పడాల్సిందే. కాని ఒకవైపే చూడు అన్నట్టు తస్మదీయులను ఏరికోరి ఇబ్బంది పెట్టడం,వెంటబడి వేధించడం ప్రజాస్వామ్య విరుద్ధం. మనీ లాండరింగ్ కింద కేసు నమోదు చేసే అధికారం గతంలోవలే గాక మామూలు అధికారులకు కూడా కట్టబెడుతూ చట్టాన్ని సవరించారు.ఇప్పుడు ఏచిన్న అధికారి అయినా ఆరోపణచేస్తే నిర్దోషిత్వం నిరూపించుకోవలసిన భారం నిందితులదే, ఇంతకన్నా తలకిందులు తర్కం మరొకటి ఉండదు. దురదృష్టవశాత్తూ దీనికి సుప్రీం కోర్టు ఆమోదం కూడా పొందారు. కనకనే ప్రతిపక్షాలు సుప్రీంకోర్టుకు దీనిపై లేఖరాసి పున:పరిశీలన కోరాయి. విచ్చలవిడిగా ఈడి కేసులు దాడులు పెరగడానికి ఇదో ముఖ్య కారణం.కేసుల జాప్యం దీనికి తోడు. ఇటీవల న్యాయస్థానాలు కూడా ఇలాటి తప్పుపోకడలను గుర్తించినా కేంద్రం వైఖరిలో మార్పులేదు.ఆధారాలున్న అక్రమాలను చట్టప్రకారం విచారించి కోర్టుల ముందుంచాలి. అంతేగాని తామే తీర్పరులై దండనాయకులై ప్రతిపక్షాలపై విరుచుకుపడి లొంగదీసుకోచూడటం సహించరానిది.

> **చాలామంది తప్పుగా భావిస్తున్నట్టు లేదా కొందరు వాఖ్యాతలు చిత్రిస్తున్నట్టు ఇది అవినీతి నిరోధానికి సంబంధించిన అంశం కాదు. అవినీతి వ్యవహారాలకు ఆధారాలుంటే పార్టీల ప్రమేయం లేకుండా ఎవరిపైనైనా చర్యతీసుకోవాల్సిందే. శిక్షలు పడాల్సిందే. కాని ఒకవైపే చూడు అన్నట్టు తస్మదీయులను ఏరికోరి ఇబ్బంది పెట్టడం,వెంటబడి వేధించడం ప్రజాస్వామ్య విరుద్ధం. మనీ లాండరింగ్ కింద కేసు నమోదు చేసే అధికారం గతంలోవలే గాక మామూలు అధికారులకు కూడా కట్టబెడుతూ చట్టాన్ని సవరించారు.**

> **న్యాయస్థానాలు కూడా ఇలాటి తప్పుపోకడలను గుర్తించినా కేంద్రం వైఖరిలో మార్పులేదు.ఆధారాలున్న అక్రమాలను చట్టప్రకారం విచారించి కోర్టుల ముందుంచాలి. అంతేగాని తామే తీర్పరులై దండనాయకులై ప్రతిపక్షాలపై విరుచుకుపడి లొంగదీసుకోచూడటం సహించరానిది.**



మోడీతో జోడీ లేదంటే ఈడీ అన్నది ఇప్పుడు తారకమంత్రంగా మారింది. సంపన్న వ్యాపార వేత్తలు, వ్యాపారాలు గల సంపన్న రాజకీయ నేతలు స్వీయ రక్షణ కోసం బీజేపీని ఆశ్రయించితే రక్షణ దొరుకుతుందని భావిస్తున్నారు.

ఏమయ్యా...రాజయ్య?

'తాటికొండ' ఏంటయ్యా...పెద్ద హోదాలో ఉండి కూడా ఇదేం బుద్ధి...ఇది నీకు తగునా? అంటూ సోషల్ మీడియాలో స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య గురించి వెలువడుతున్న కామెంట్లు. ఇవి ఆయన మీద వస్తున్న రుమార్లు కావు. మహిళల పట్ల అనుచిత ప్రవర్తనతో చాలాకాలం నుంచి ఆయన వార్తల్లో నిలిచారు. ఉపముఖ్యమంత్రి పదవి కూడా అందుకే ఊడిందనే పుకార్లు అప్పట్లోనే చక్కర్లు కొట్టాయి. ఆ ఎమ్మెల్యేకు మహిళలు కనిపిస్తే చాలు....ఆగలేరన్న ప్రచారం ఉంది. ప్రచారమే కాదు.. అనేకసార్లు ఆయన చిలిపి చేష్టల ఆడియోలు వైరల్ అయ్యాయి. ఆయన పుట్టినరోజు వేడుకల్లోనూ ఇలాంటి ఘటనే జరిగింది. ఆ వీడియో కూడా హల్‌చల్ చేసింది. ఆయన పెద్ద పదవిలో ఉన్నప్పుడు సాయుధ బలగాల రక్షణ వలయంలో గంటల తరబడి 'ఓ ఇంట్లో' సేద తీరడంతో ఆ ఊరి వారంతా ఇబ్బంది పడ్డారని వార్తలొచ్చాయి. చాటింగ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా చెప్పుకొనే సదరు ఎమ్మెల్యే... ఓ చాటింగ్ బహిర్గతమై పదవికే ఎసరొచ్చింది. అయినా ఆయనలోపల పశ్చాతాపం లేదు. మార్పు అంతకన్నా లేదు. పార్టీకి కూడా చెడ్డపేరు వస్తుందన్న చర్చ పార్టీలో ఉన్నది. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనకు టికెట్ గండం కూడా ఉందనే ప్రచారం జరుగుతున్నది. రాజయ్య వ్యవహార శైలి నిజమేనంటూ మహిళా సర్పంచ్ నవ్య కుండబద్దలు కొట్టినట్టు ధైర్యంగా మీడియా ముందుకొచ్చి ప్రపంచానికి చెప్పారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అని చూడకుండా ఎదురుతిరిగారు. బీఆర్ఎస్ మహిళా నాయకురాలి వలలో చిక్కుకోకుండా చాకచక్యంగా బయట పడ్డారు. ఆమె ధైర్యానికి జేజేలు అందుకుంటున్నారు. డటీజ్ నవ్య

-గుడిగ రఘు

'బండీ'..చల్ తొండీ

బండీ చల్ తొండీ. ప్రజల మనిషిని అంటివి. ప్రజల కోసం పోరాడుతున్నంటివి. ఓ గొప్పాలు కొడితివి. ఏంటీ అప్పుడే ప్లేట్ ఫిరాయించేశావ్. 'ప్రజల కోసం పనిచేసేటోడ్ని కాదు నేను..పార్టీ కోసం పనిచేసేటోడ్ని. నేను అనుకుంటే పదవి రాలేదు. అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా నా బిస్తర్ రడీగా ఉంటది' అంటూ తనలోని నిజస్వరూపాన్ని కక్కేశాడు. అధిష్టానం దగ్గర మార్కులు కొట్టేసేందుకు కవితపై మాటలు తూలితివి మహిళా కమిషన్ చేతిలో అడ్డంగా బుక్కయితివి. 'గీ మాటలు నేను అనలేదు' అని తొండి చేయడంలోనూ బండి సిద్ధహస్తుడే రేపొద్దుగాల ఏమైనా చేయొచ్చు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలిపిస్తే.. వర్షాలకు బైకుపోతే బైకు..కారుపోతే కారు కోనిస్తమంటివి. గిదెట్ల సాధ్యమైతదని మీడియావాళ్లు అడిగితే 'బండ్లకు ఇన్సూరెన్స్ ఉంటదిగా అవి ఇప్పిస్తం' అని నవ్వులపాలైతివి. గీదానికి గీయన కావాల్నా అని అప్పట్లో పెద్ద సెటైర్లే సోషల్‌మీడియా సాక్షిగా పేలాయి. హే చల్ తొండి పోరగాండ్లు ముగ్గురు పోతే ఇష్టమొచ్చినట్టు చలాన్లు వేస్తరా? రద్దు చేపిస్తమంటివి?. ఆశపడ్డ పోరగాండ్లు సార్ చలాన్లు రద్దు ఏమైంది అని అడిగితే నెత్తి గోక్కుంటివి. సారూ మీరు రాష్ట్రంలో ఓ పార్టీకి అధ్యక్షులు. మాట్లాడేటప్పుడు జర ఎన్కముందు చూస్కొని మాట్లాడు లేకుంటే నలుగురిలో నవ్వులపాలైతవ్.

- అచ్చిన ప్రశాంత్

మట్టికుండ..చల్లగుండ..

'వాణ్ని ఎలా తట్టుకుంటున్నారా బాబూ.. కాస్త వాణ్నెవరైనా ఆపండ్రా.. వాణ్ని మార్చండ్రా...' ఓ సినిమాలో నటుడు రావు రమేశ్ వాడిన డైలాగ్ ఇది. మనం చెప్పిన మాట వినకపోయినా, అతిగా ప్రవర్తించినా అలాంటి వ్యక్తుల గురించి మనం కూడా అప్పుడప్పుడూ ఇలా మాట్లాడుకుంటూ ఉంటాం. ఇప్పుడు రాష్ట్ర ప్రజలు సైతం ఒకరి గురించి పదే పదే చెప్పుకుంటూ తెగ ఇదై పోతున్నారు. ఆయనే సూరయ్య ఉరఫ్ భాస్కరుడు అలియాస్ సూర్య భగవానుడు. బుడతల దగ్గర్నుంచి ముసలోళ్ల దాకా నిన్న మొన్నటి వరకూ ఈ సూరయ్య గారి నులి వెచ్చని కిరణాల కోసం ఎదురు చూసిన వారే. జనవరిలో కురిసిన పొగ మంచు.. వెరసి గజగజ వణికించిన చలికి ఉహూహూ.. అంటూ వారందరూ పొద్దున్నే ఎండ హాయిని ఆస్వాదించారు. కానీ చలికాలం ముగిసీ ముగియగానే.. ఫిబ్రవరి పూర్తి కాకుండానే ఈ 'సన్నాఫ్ సత్య మూర్తి తన ప్రచండ వేడితో జనం మీద ప్రతాపం చూపించసాగాడు. ఉదయం 11 గంటలైతే చాలు..మన నెత్తిని 'చుర్రు'మనిపిస్తున్నాడు. సాయం త్రం నాలుగింటిదాకా ఇదే తంతు. మరోవైపు వాతావరణ కేంద్రం సైతం ఆయన గారి గురించి ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. 'గతంతో పోలిస్తే ఈసారి ఎండలు మరింత మండిపోనున్నాయి. మార్చి నుంచి మే దాకా జాగ్రత్త...' అంటూ అలర్ట్ చేసింది. సో...ఫిబ్రవరిలోనే సూరయ్య గారి ప్రతాపం ఇలా ఉందంటే... రాబోయే మూడు నాలుగు నెలలు మనకు ఆయన చుక్కలు చూపించటం ఖాయమన్నమాట. అందుకే మరోసారి మట్టి కుండలు.. మజ్జిగ.. కొబ్బరి నీళ్లు.. నిమ్మకాయ షరబత్.. వీటితోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు గుర్తుకొస్తున్నాయి...

- బి.వి.యన్.పద్మరాజు

ఉందంటే.. లేదనిలే..!



జంధ్యాల రఘుబాబు
9849753298

మిట్ట మధ్యాహ్నం. సూర్యుడు నడినెత్తిన ఉన్నాడు. మండిపోతున్నాడు. ఆ సమయంలో నడినెత్తిన కాక ఏ తూర్పునో, పడమరో ఉంటాడా అని మజాక్ చేసేవాళ్ళూ ఉండొచ్చు మిత్రుల్లో. ఏ సమయంలోనైనా సూర్యుడు మండిపోతూనే ఉంటాడు మనకు తెలీదంతే అని ఇంకో విషయ నేర్పరి, తెలుగులో చెప్పుకుంటే సబ్జెక్ట్ ఎక్స్పర్ట్ అన్న మాట, చెప్పొచ్చు. సాక్షాత్తు మెగాస్టారే ఒక సినిమాలో ఓ ఇంగ్లీషు పదం తెలుగైపోయిందన్నాడు అది వేరే సంగతి. ఆంగ్లంలో ఇతర భాషా పదాలు ఎన్నో చేరాయి అందుకే అది ప్రపంచాన్ని ఏలుతోంది అంటూ ఒక విషయం వదిలేసి వేరే సబ్జెక్టులోకి సునాయాసంగా అంటే తెలుగులో ఈజీగా వెళ్ళిపోవచ్చు. అసలు విషయానికొస్తే, ఆ ఎండలు మండిపోవడానికి సూర్యుడే కారణమా, లేక తనకి దగ్గరగా పోయే భూమి కారణమా, ప్రపంచమంతా యుద్ధాలు చేయిస్తూ భూ వాతావరణాన్ని వేడెక్కిస్తున్న దేశమా, ఇతర ప్రపంచమా, ప్రపంచ ప్రజలా? ఇలా ఎవరు కారణం అని ఆరా తీసుకుంటూ పోతే ఒక పుస్తకం రాయొచ్చు, మొత్తం ఈ పేపరంతా మన ఒక్క ఆర్టికలుకే సరిపోతుంది.

విషయానికొస్తే, అసలు ఇషయానికొస్తే అంటూ రాయడం కొందరికి అలవాటు. అంటే నీవు అసలు విషయం వదిలేసి ఎటో పోయి ప్రపంచమంతా తిరిగి, చదివేవాళ్ళను తిప్పి సడెన్‌గా విషయానికొచ్చి ఆ విషయం చెప్పి మరీ పేజీలు పేజీలు నింపేస్తే నేవేదో పెద్ద తోపువని చదవాలా అనొచ్చు కూడా. వస్తా సబ్జెక్టుకొస్తా. అవునంటె కాదనిలే, కాదంటె ఔననిలే అని ఒక కవి రాశారు. మొన్న ఎనిమిదో తేదీననే మహిళా దినోత్సవం ఐపోయింది కాబట్టి ఆయన ఎవరిమీద రాశాడో చెప్పకూడదు. చెప్పను అనుకుంటూ అసలు విషయం చెప్పేయడం ఓ టెక్నిక్. చెప్తాను అనుకుంటూ విషయాన్ని దాచేయడం, వేరే విషయం చెప్పడం ఇంకో టెక్నిక్. అప్పుడే మనిషి పైకొచ్చేది.

ఉందంటె లేదనిలే, లేదంటె ఉందనిలే రాజకీయ మాటలకు అర్థాలు వేరులే అని మనమూ రాయొచ్చు. దీని వెనుక ఒక తెలుగు పాట అదీ సాలూరివారు స్వరపరచి ఏ.ఎం రాజా తీయగా పాడిన పాట ఉందని తెలియనోళ్ళు మస్తుగ చెప్పిండ్రా అనుకునే ప్రమాదం అదే డేంజర్ ఉంది. ఆ మెగా స్టారు తమ్ముడు తన సినిమాల్లో పాత పాటలను వాడబట్టి అవి కొందరికి తెలుస్తున్నాయి, అది వేరే సంగతి. అసలు సంగతి గాలికి వదిలేసి వేరే సంగతులెందుకు చెబుతారు అన్న అనుమానం అంటే డవుట్ వేయకూడదు. ఎందుకంటే లేనిది ఉన్నట్టు, ఉన్నది లేనట్టు కనికట్టు విద్యలు నేర్చినోళ్ళే ఇప్పుడు నేర్పరులు, అంటే ఎక్స్పర్టులన్నమాట.

వివాహాల కాలం, అంటే మ్యారేజీ సీజన్. ఇంట్లో ఒక్కొక్కరు ఒక్కో పెళ్ళికి పోయినా అన్నింటినీ కవర్ చేయలేని పరిస్థితి. అందులో ఎండలు. నూతన వధూవరులకు అంటే న్యూలీ మారీడ్ కపుల్ కు ప్రెజెంటేషన్ ఇచ్చి ఫొటో దిగిపోదామనుకుంటే వాళ్ళు స్టేజి మీదకు ఎంతకూ రారు. ఏమంటే వాళ్ళతో ఎన్నో పూజలు, హోమాలు చేయించి చివరికి ఆ ఎండలోనే అరుంధతీ నక్షత్రాన్ని చూపించి వచ్చేవరకూ మనం తెలిసినోళ్ళతో మాట్లాడుకుంటూ, సెల్ఫీలు తీసుకుంటూ, వాటిని ఇతరుల ఫోనుల్లో నింపేసుకుంటూ ఉండాలి. తినింది అరగాలంటే ఏదో ఒకటి చేయాలిగా అంటాడు మా మిత్రుడు. మొత్తం మీద అరుంధతీ స్టారును చూసి వస్తారు. ఎలా చూస్తారు అంటే చూపిస్తే చూస్తారు అనాలంతే. పొరపాటున కూడా కనబడలేదని అనకూడదు. ముందే చెప్పుకున్నట్టు, ఉందంటే ఉందనాలి అంతే ఇంక వేరే క్వెస్చెను లేదు. అంతే. దట్సాల్.



ఇదంతా ఏకపక్షంగా ఉంది గురూ, నువ్వేది చెబితే దానికి ఊ కొట్టాలా, నమ్మాలా? అంటే ఇప్పుడు మీరు చేస్తున్నది అదే కదా అంటా. అసలేం మాట్లాడుతున్నావ్, అసలు విషయం చెప్పు అని రివర్సులో నన్నే విషయంలోకి రమ్మంటే సమాధానం ఒకటే నేను సబ్జెక్టును వదిలి ఒక్క మాట కూడా అస్సలు చెప్పలేదంటా. ఐతే నీవు ముఖ్య మంత్రి, ప్రధానమంత్రి అయ్యే ఛాన్సులున్నాయి, ఎక్కువరిస్తే గవర్నరువయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనొచ్చు గిట్టని వాళ్ళు. సరే, ఆ వెలుగులు చూడు అని చీకటిని చూపిస్తే, అవును సారూ అనాలి. పెట్రోలు నూటాపది అని మొత్తుకుంటే ఇంకో దేశంలో అదే పెట్రోలు రెండువేలు తెలుసా అంటే అబ్బో పంతొమ్మిది వందలు మిగిలిందని ఆనందపడాలి. అసలే ఉద్యోగాలు లేకుంటే ఉన్న ఉద్యోగాలను తీసేసి సంస్థలను మూసేస్తున్నారని చెబితే ఫ్లిప్ కార్టులో, వాల్మార్టులో ఇన్ని వేలమందిని తీసేశారని గుర్తు చేయాలి. అలా ఒకటి చెబితే ఇంకోటి చెప్పి సము దాయించాలి. ఒక్కో దేశంలో ఆర్థిక మాంద్యం ఎలా ఉందో ఊకదంపుడు ఉపన్యాసాలివ్వాలి. మనమెలా నిలబడగలిగామో స్పీచులివ్వాలి. ఇప్పుడు పడనట్టు, మనమూ ఇబ్బందులు పడే రోజులు వస్తాయని పేపర్లలో రాస్తున్నారుగా ఎలా అంటే ఆ ఛాన్సే లేదు అంటే ఓకే అనాలి. ముందే పడ్డాము ఇంక పడేదేముంది అని సంతోషపడాలి.



నిరుద్యోగాన్ని అంతమొందిస్తాం, కొన్ని లక్షల పనిగంటలు సష్టిస్తాం అని గంటలు గంటలు ఉపన్యాసాలివ్వొచ్చు. ఉద్యోగాలెక్కడ అని అడిగే వీలు లేకుండా రాజకీయ నిరుద్యోగాన్ని తగ్గించడం చూడొచ్చు. కరువు వల్ల వలసల్ని ఆపలేకపోవచ్చు కాని రాజకీయ వలసల్ని చూడండి ఎంత చకచకా చేయిస్తున్నామో అనొచ్చు. ఒక సమస్య ఉంది చూడు అంటే ఇంకో అభివద్ధి చూపొచ్చు. రైతు కూలీలు, రైతులు, కార్మికులు రోజూ ప్రయాణం చేసే రైళ్ళను ఇన్ని రద్దు చేశారే అనేలోపు విలాసవంతమైన రైళ్ళు ఎలా పరుగులు తీస్తున్నాయో చూడమనొచ్చు. సైన్సులో, వైద్యంలో ఇంకా కొన్నింటిలో పరిశోధనలు ఆగిపోయాయి వాటి కథ చూడమంటే పాత పుస్తకాల్ని తర్జుమా చేయిస్తున్నాము ఆగండనొచ్చు. దేశంలో పరిస్థితి బాగోలేదంటే ప్రపంచంలో మనం నాయకులమనొచ్చు. అదే ప్రపంచంలో ఆకలి సూచీలో మన ఎదుగుదలను చూడమంటే మీరెప్పుడూ అంతే బాగుపడరు అందుకే ఇంకా అక్కడే ఉన్నారనొచ్చు.

ఒకేమాదిరి ఉన్న చిత్రాలు రెండు పక్కపక్కనే పెట్టి ఒకదాంట్లో కొన్ని మార్పులు చేసి వాటిని కనిపెట్టండి అని మెదడుకు మేత పెట్టే పనిలో కొందరున్నట్లే అసలు కనిపెట్టలేని తేడాలతో కంటికి మెదడుకు పరీక్షలు పెడతారు. ఫలానాది ఉందా బొమ్మలో అని లేనిదాని గురించి అడిగితే ఉంది కొట్టొచ్చినట్టు, తన్నొచ్చినట్టు కనిపిస్తోందనాలి. అప్పుడు నీకు వందకు వంద మార్కులు. అదే ప్రశ్నకు లేదు అని సమాధానం చెబితే మాత్రం సున్నా మార్కులేసి పక్కన పెడతారు. అందుకే రాజుగారి దుస్తుల కథలో మాదిరిగా ఎలా ఉన్నాయి అంటే భలే బాగున్నాయి రాజుగారి దుస్తులు అనాలి. ఏ కలర్‌లో ఉన్నాయంటే మాత్రం కష్టమొచ్చి పడుతుంది. నా కళ్ళకు జబ్బుంది, రంగులు కనబడవు అని సింపుల్‌గా జారుకోవాలి. ఉందంటె లేదనిలే అన్న సూత్రం మాత్రం ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలి.

> **ఒకేమాదిరి ఉన్న చిత్రాలు రెండు పక్కపక్కనే పెట్టి ఒకదాంట్లో కొన్ని మార్పులు చేసి వాటిని కనిపెట్టండి అని మెదడుకు మేత పెట్టే పనిలో కొందరున్నట్లే అసలు కనిపెట్టలేని తేడాలతో కంటికి మెదడుకు పరీక్షలు పెడతారు. ఫలానాది ఉందా బొమ్మలో అని లేనిదాని గురించి అడిగితే ఉంది కొట్టొచ్చినట్టు, తన్నొచ్చినట్టు కనిపిస్తోందనాలి. అప్పుడు నీకు వందకు వంద మార్కులు. అదే ప్రశ్నకు లేదు అని సమాధానం చెబితే మాత్రం సున్నా మార్కులేసి పక్కన పెడతారు. అందుకే రాజుగారి దుస్తుల కథలో మాదిరిగా ఎలా ఉన్నాయి అంటే భలే బాగున్నాయి రాజుగారి దుస్తులు అనాలి. ఏ కలర్‌లో ఉన్నాయంటే మాత్రం కష్టమొచ్చి పడుతుంది. నా కళ్ళకు జబ్బుంది, రంగులు కనబడవు అని సింపుల్‌గా జారుకోవాలి. ఉందంటె లేదనిలే అన్న సూత్రం మాత్రం ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలి.**

నెలసరి సమయానికి రావాలంటే..?



నెలసరి సమయంలో నొప్పి, అసౌకర్యం.. లాంటివి సాధారణమే! అది వచ్చినపుడే కాదు.. ఆలస్యమైనప్పుడూ శారీరకంగా చాలా ఇబ్బంది అనిపిస్తుంది. వాతావరణ మార్పులు, జీవనశైలి కారణంగా చాలామందికి నెలసరి తప్పుతుంటుంది. సరైన సమయానికి రావాలంటే వీటిని అనుసరించమంటున్నారు నిపుణులు.

- కొద్దిపాటి వ్యాయామం కండరాలకు విశ్రాంతి నివ్వడమే కాదు.. నెలసరిని క్రమబద్ధీకరించడంలోనూ సాయపడుతుంది. తేలిక నుంచి మధ్యస్థ వ్యాయామాలను రోజులో భాగం చేసుకోండి. సాధారణంగా అధిక బరువు, హార్మోనుల్లో అసమతుల్యత నెలసరి ఇబ్బందులకు కారణమవుతుంది. వ్యాయామం ఈ రెంటికీ చెక్ పెట్టేయగలదు. నడక, ఏరోబిక్స్, డ్యాన్స్.. ఇలా నచ్చినదానికి రోజూ 30 నిమిషాలు కేటాయించాలంతే.
- శారీరక సమస్యలే కాదు.. ఒత్తిడి ప్రభావం కూడా నెలసరిపైనే పడుతుంది. కాబట్టి, వీలైనంత ప్రశాంతంగా మనసును ఉంచుకునే ప్రయత్నం చేయండి. స్నేహితులతో సమయం గడపడం, పాటలు వినడం.. ఇలా మీ మనసుకు శాంతిని చేకూర్చే వాటిపై దృష్టిపెడితే సరి.
- విటమిన్ సి ఈస్ట్రోజన్ స్థాయులను పెంచుతుంది. అంతేకాదు శరీరక ప్రక్రియలు సక్రమంగా జరగడానికి అవసరమైన వేడినీ పుట్టించగలదు. ఇది మెన్‌స్ట్రువల్ సైకిల్‌కీ ప్రయోజనకరం. కాబట్టి ఇది ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలకు రోజువారీ ఆహారంలో చోటివ్వండి.
- నెలసరిని క్రమబద్ధీకరించడంలో బెల్లానిదీ ప్రధాన పాత్రే. సంప్రదాయ విధానమే అయినా బాగా పనిచేస్తుంది కూడా. అదనంగా ఐరన్, హిమోగ్లోబిన్‌నీ వృద్ధి చేస్తుంది. రోజూ తీసుకుంటే సరిపోతుంది.

చర్మాన్ని ఇబ్బంది పెట్టొద్దు



అవాంఛిత రోమాలను ఎప్పటికప్పుడు తొలగించుకోవడం సహజమే. ఇందుకోసం వివిధ రకాల క్రీములు వాడడం, పదే పదే వ్యాక్సింగ్ ట్రీట్‌మెంట్లు చేయించుకోవడం.. వంటివి చేస్తుంటారు చాలామంది. అయితే వీటివల్ల చర్మం ఇరిటేట్ అయి ఎరుపెక్కడం, దురద రావడం.. ఇలా పలు సమస్యలు తలెత్తుతాయి.

- కాబట్టి అవాంఛిత రోమాలను తొలగించుకోవడానికి ముందు, తర్వాత ఆ ప్రదేశంలో చర్మాన్ని మాయిశ్చరైజ్ చేయడం తప్పనిసరి. ఇందుకోసం చర్మతత్వాన్ని బట్టి మాయిశ్చరైజింగ్ క్రీమ్‌లను ఎంపిక చేసుకోవాలి. వీటిలోని గ్లిజరిన్ చర్మాన్ని మాయిశ్చరైజ్ చేసి ఎలాంటి చర్మ సంబంధిత సమస్యలు ఎదురవకుండా చేస్తుంది.
- అలాగే వ్యాక్సింగ్ చేయించుకునే వారు పదే పదే కాకుండా.. వ్యాక్సింగ్‌కి, వ్యాక్సింగ్‌కి మధ్య కనీసం పదిహేను రోజులైనా గ్యాప్ తీసుకోవడం తప్పనిసరి. ఇలా షేవ్ చేసుకున్న వెంటనే పూల్స్, బీచ్‌లలోని నీటిలో ఈతకొట్టడం సరికాదు. దీనివల్ల ఆ నీటిలోని క్లోరిన్, ఉప్పు, సూర్యరశ్మి.. తదితర అంశాల వల్ల చర్మంపై ట్యాన్ వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి కనీసం 24 గంటల సమయమైనా గ్యాప్ తీసుకోవాలి.

సాహిత్యం ఆమెకు ప్రాణం. తెలుగంటే అంతులేని అభిమానం. సమాజ మార్పులో సాహిత్యం అత్యంత శక్తివంతమైన సాధనమని బలంగా నమ్మిన వ్యక్తి. రాసే ప్రక్రియ ఏదైనా సామాజిక స్పృహ తప్పని సరి అంటారు. తన రచనల్లోనూ అదే కనబరుస్తారు. ఓ రచయితగా సమాజాన్ని, ఓ తల్లిగా ఇంటిని, ఓ ఉపాధ్యాయిని విద్యార్థులను తీర్చిదిద్దుతూ సాహిత్య రంగంలో కొనసాగుతున్నారు. ఆమే పులి జమున. ఆమె చేస్తున్న సాహితీ సేద్యం గురించి నేటి మానవిలో...

సామాజిక జీవితానికి అద్దం పట్టేదే
అసలైన సాహిత్యం



జమున హన్మకొండలో జన్మించారు. తల్లిదండ్రులు బొజ్జ అమృతాదేవి, కనకరాజ్. ఈమెకు నలుగురు అన్నదమ్ములు, ఇద్దరు అక్కచెల్లెళ్ళు. తండ్రి చదువుకున్నది కేవలం ఆరో ఫారమైనా స్వయంకృషితో ఎలక్ట్రానిక్స్ పుస్తకాలు చదివి రేడియో, టీ.వీ., కెమెరా వంటి వాటిపై అవగాహన పెంచుకుని వరంగల్లో తొలి ఎలక్ట్రానిక్స్ షాపు పెట్టారు. అదే వారి కుటుంబానికి ఆధారం. వరంగల్‌లో "ఫాదర్ ఆఫ్ ద ఎలక్ట్రానిక్సు"గా పేరు గడించారు. ఇక తల్లి కూడా పేరుకు తగ్గట్టు అమృతమూర్తి.

సాహితీ ప్రముఖుల వద్ద

జమున స్కూల్ చదువు మొత్తం హన్మకొండలోని లష్కర్ బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగింది. పాఠశాలలో రెండుసార్లు మెరిట్ స్కాలర్ షిప్ పొందారు. ఇంటర్మీడియట్ వరంగల్‌లోని క్రిష్ణాకాలేజ్‌లో, డిగ్రీ వడ్డేపల్లి ఉమెన్స్ కాలేజ్‌లో పూర్తి చేసారు. ఎం.ఏ. తెలుగు సాహిత్యాన్ని కాకతీయ విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. అక్కడే సాహితీ ప్రముఖుల వద్ద ఆమె విద్యనభ్యసించారు. ఎం.ఏ.లో తెలుగు సాహిత్య చరిత్ర, సంస్కృతి అంశానికి గాను కాకతీయవిశ్వవిద్యాలయం నుండి బంగారు పతకాన్ని అందుకున్నారు. ఇది ఆమె జీవితంలో మరవలేని మధుర స్మృతిగా ఆమె చెబుతారు.

కవిత్వం ఓ మార్గనిర్దేశం


అంతరంగంలోని భావాలకు అక్షర రూపమే కవిత్వం. సమాజహితాన్ని కోరి సమాజాన్ని తట్టి లేపే చైతన్య కిరణమే కవిత్వం. కవి సామాన్య ప్రజల కన్నా భిన్నం. కవులను సమాజం అనుసరిస్తుంది, అనుకరిస్తుంది, ఆదర్శంగా స్వీకరిస్తుంది. కాబట్టి కవిత్వం ఒక మార్గదర్శనంగా ఉండాలి. దిశా నిర్దేశం లేని సమాజానికి కవిత్వం వేగుచుక్కలా పనిచేస్తుంది. ప్రపంచగతినే మార్చగలిగే శక్తివంతమైన సాధనం సాహిత్యం. మానవ జీవితంలోని విభిన్న కోణాలను సృజిస్తూ జీవితాన్ని చక్కగా విశ్లేషిస్తుంది. జీవన వాస్తవాలను కళ్ళకు కట్టినట్టు, హృదయానికి హత్తుకునేటట్టు చేయగలదు. సామాజిక జీవితానికి అద్దం పడుతూ సమాజాన్ని ప్రభావితం చేయగలదు.

పదేండ్ల తర్వాత...

తెలుగు పండిత శిక్షణ పూర్తి కాగానే సత్యనారాయణ రాజుతో వివాహం జరిగింది. ఆ తర్వాత బాబు సాయి చరణ్, పాప తన్మయిల పుట్టారు. పిల్లల పెంపకంలో దాదాపు పదేండ్లు గడిచిన తర్వాత 2002లో ఉపాధ్యాయ అర్హత పరీక్షను రాసి జిల్లాలో ఫస్ట్ రాంక్ సాధించి మహబూబ్‌నగర్‌లో భాషోపాధ్యాయురాలిగా వృత్తిని చేపట్టారు. తర్వాత ప్రముఖ జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజపై "సుద్దాల అశోక్ తేజ పాటలు- ఒక పరిశీలన" అనే అంశంపై 2010లో ఎంఫిల్ చేసారు. ప్రస్తుతం చౌదూరి గోపాలరావు సమగ్ర సాహిత్య చరిత్ర అంశంపై పి.హెచ్.డి చేస్తున్నారు.

తెలుగుపై అభిమానంతో...

జమునకు చిన్నప్పటి నుండి తెలుగు భాషంటే ఎంతో ఇష్టం. చందమామ, బొమ్మరిల్లు, బాలమిత్ర వంటి పుస్తకాలతో పాటు చాచా చౌదరి, ఫాంటమ్ వంటి కామిక్స్ పుస్తకాలలోని కథలను ఎంతో ఆసక్తిగా చదివేవారు. అలా వయసుతో పాటు వివిధ ప్రక్రియలపై అభిలాష కూడా పెరిగింది. కాకతీయ విశ్వవిద్యాలయంలోఎం.ఏ.ప్రవేశ పరీక్షలో తెలుగుతో పాటు ఎకనామిక్స్‌లోనూ సీటు వచ్చినా తెలుగుపై అభిమానంతో ఆమె తెలుగు సాహిత్యం తీసుకున్నారు. అధ్యాపకుల బోధనలతో తెలుగు భాషపై



మరింత అభిమానం కలిగింది. సాహిత్య రంగంలో తొలి అడుగులు వేస్తున్న తరుణంలో ప్రముఖ సాహితీవేత్తలతో పరిచయం కలిగింది. తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షులు ప్రముఖ కవి, రచయిత వల్లభాపురం జనార్దన, ఖాజామైనద్దీన్, పాలమూరు సాహితీ అధ్యక్షులు ప్రముఖ కవి డా॥భీంపల్లి శ్రీకాంత్, ప్రముఖ కవయిత్రి, రచయిత్రి కె.ఎ.ఎల్.సత్యవతి వంటి వారితో కలిసి ప్రపంచ తెలుగు మహాసభలలో పలుమార్లు పాల్గొన్నారు. అలాగే భువనేశ్వర్, ఛండీఘర్, తిరువనంతపురం, అజ్మీర్‌లో నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొన్నారు.

వివిధ ప్రక్రియల్లో...

దాశరథి, సినారే, కాళోజీ, సురవరం ప్రతాపరెడ్డి, యశోదారెడ్డి మొదలైన కవి పండితుల రచనల అధ్యయనం ఆమె సాహిత్య ప్రస్థానానికి ఎంతో స్ఫూర్తినిచ్చాయి. 2002 నుండి సామాజిక సమస్యలపై స్పందిస్తూ వివిధ ప్రక్రియలలో రచనలు చేస్తున్నారు. కవితలు, కథలు, వ్యాసాలు, పాటలు, ఆటవెలది, తేటగీతి పద్యాలు, సమీక్షలు, మొగ్గలు, మణిపూసలు, గజల్, ఇష్టపది, పద మంజీరాలు, కైతికాలు, ప్రపంచకాలు, రుబాయిలు, సమ్మోహనాలు, మొదలైన ప్రక్రియలలో రచనలు చేస్తున్నారు. ఈమె తొలి కవితా సంపుటి "నీలో నేను"(మొగ్గల ప్రక్రియ), రెండవ సంపుటి "నేత మొగ్గలు"(మొగ్గల ప్రక్రియ), మూడవది "అమృతవర్షిణి" (మణిపూసల ప్రక్రియ).



పిల్లల్ని తీర్చిదిద్దుతూ...

సాహిత్య రంగంలో ఇంతగా సాగిపోతున్న జమునకు భర్త, పిల్లలు ఎంతో సహకారం చేస్తుంటారని గర్వంగా చెబుతున్నారు. ఉపాధ్యాయినిగా విద్యార్థుల సృజనకు పదును పెట్టి భవితకు వెలుగులు దిద్దడానికి కృషిచేస్తున్నారు. బాలచెలిమి బాలల వికాస పత్రిక, చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఆకాడమీ ఆధ్వర్యంలో 'తెలంగాణ బడి పిల్లల కథలు' పుస్తకంలో ప్రచురించిన "ఉమ్మడి మహబూబ్ నగర్ కథలు" పుస్తకంలోని 13 కథలలో వీరి పాఠశాల దేవరకద్ర బాలికలు రచించిన 5 కథలకు చోటు దక్కింది. తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన నాటక పోటీలలో వీరి విద్యార్థినులు పాల్గొని జిల్లా స్థాయిలో ఎంపికయ్యారు.

సామాజిక స్పృహ వుండాలి

సమాజానికి, సాహిత్యానికి అవినాభావ సంబంధం ఉంది. సాహిత్యం సామాజిక మార్పులో అత్యంత శక్తివంతమైన సాధనమని చెప్పవచ్చు. సమాజం నుండి సాహిత్యం ఉద్భవిస్తుంది. సమాజంలో మార్పు కలగడం సహజమే. దానికి అనుగుణంగా సాహిత్యం కూడా మారుతూ వుంటుంది. పద్య కవిత్వం, గేయ కవిత్వం, వచన కవిత్వం, కథ, వ్యాసం మొదలైన అనేక ప్రక్రియలు సృష్టించబడ్డాయి. ప్రక్రియ ఏదైనా సామాజిక స్పృహ ప్రధాన లక్ష్యంగా వుండాలి.

జిల్లాలో జరిగిన 'పలికెద భాగవతం' పద్య పఠన పోటీలలో విద్యార్థులు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం' సందర్భంగా తెలంగాణ అక్షరయాన్ మహిళా విభాగం, షీటీమ్స్ ఆధ్వర్యంలో



నిర్వహించిన ఆన్‌లైన్ కవితా పోటీలలో వీరి విద్యార్థినికి నగదు బహుమతి లభించినది. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కవితల పోటీలలో వీరి విద్యార్థిని ప్రథమ బహుమతి అందుకున్నది. తన విద్యార్థులను కళలు, సాహిత్యం పట్ల ఎంతటి అవగాహన కల్పిస్తున్నారో వీటిని బట్టి ఇట్టే అర్థమవుతుంది.

సమాజాన్ని ప్రభావితం చేసేలా...

వాస్తవానికి జమున ఎం.ఫిల్ పూర్తి చేయగానే పి.హెచ్.డి చేయాలనుకున్నారు. కానీ ఆమె ఆశ నిరాశే అయ్యింది. కానీ పట్టు వదలక ప్రయత్నం చేసి చివరకు పాలమూరు విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డి సీటు సాధించారు. పరిశోధనను కొనసాగిస్తూ, సామాజిక స్పృహతో సమాజాన్ని ప్రభావితం చేసి స్ఫూర్తినందించే రచనలు చేయాలని ఆమె కోరిక. తాను చేస్తున్న సాహిత్య సేవకుగాను జమునకు ఎన్నో పురస్కారాలు, బిరుదులు అందుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్‌చే ఉత్తమ కవితా పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే కోయిలకొండ మండలం ఉత్తమ రచయిత్రిగా నగదు పురస్కారం అందుకున్నారు. మణిపూసల ప్రక్రియలో చేసిన విశేష కృషికి మణి పూసల కవి భూషణ్, మణిపూసల తొలి కవయిత్రి పురస్కారం అందుకున్నారు.

- సలీమ

మా కుటుంబాన్ని హింసించడానికే

న్యూఢిల్లీ : తన కుటుంబంపై ఈడీ దాడుల విషయంలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ స్పందించారు. కేంద్ర దర్యాప్తు సంస్థ సోదాల అనంతరం లాలూ, ఆయన రెండో కుమార్తె రోహిణి ఆచార్య లు బీజేపీ తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మా కుటుంబాన్ని వేధించడానికి, హింసించడానికే బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నదని ఆరోపించారు. "బీజేపీ, ఆరెస్సెస్‌తో నాకు సైద్ధాంతిక విభేదాలు ఉన్నాయి. వారితో పోరాడుతున్నాను. ఆ పోరాటం కొనసాగుతుంది. వారి ముందు నేనెప్పుడూ తల వంచలేదు. నా కుటుంబ సభ్యులు కానీ, పార్టీ వ్యక్తులు కానీ ఎవరూ తల వంచలేదు" అని లాలూ ప్రసాద్ యాదవ్ ట్వీట్ చేశారు. "ఎమర్జెన్సీని చూశాం. అప్పుడూ పోరాడాం. ఈ రోజు నిరాధారమైన ప్రతీకార విషయంలో బీజేపీ ఈడీ నా కూతుర్లు, మనవళ్లు, మనవరాళ్లు, గర్భిణీ అయిన నా కోడలును 15 గంటల పాటు కూర్చోబెట్టింది. మాతో రాజకీయ పోరులో బీజేపీ ఇంత దిగజారిపోతుందా?" అని మరొక ట్వీట్‌లో లాలూ ప్రశ్నించారు. శుక్రవారం ఈడీ.. తేజస్వీ యాదవ్, అతని ఇద్దరి సోదరీమణుల నివాసాలతో పాటు ఢిల్లీ, పాట్నా, రాంచీ, ముంబయిలలోని 24కు పైగా ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిన విషయం విదితమే. ఈ సోదాల్లో రూ. 70లక్షల నగదు, 1.5 కేజీల బంగారం, 540 గ్రాముల గోల్డ్ బులియన్, విదేశీ కరెన్సీని స్వాధీనపర్చుకున్నట్టు అధికారులు వెల్లడించారు.

2017లోనూ ఇలాగే..

(మొదటిపేజీ తరువాయి)

సీబీఐ సమన్లు జారీ చేయడంపై బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ స్పందించారు. దీనిని రాజకీయ ప్రేరేపిత చర్యగా ఆయన అభివర్ణించారు. ఐదేండ్లుగా వారు (కేంద్ర దర్యాప్తు సంస్థలు) ఏం చేస్తున్నారు? అని ప్రశ్నించారు. ఉద్యోగాలకు భూమి (ల్యాండ్ ఫర్ జాబ్) కుంభకోణం కేసులో తేజస్వీకి సీబీఐ సమన్లు అందజేసిన విషయం విదితమే. ఈ కేసులో దర్యాప్తు సంస్థ చివరగా 2017లో దర్యాప్తు జరిపింది. ఆర్జేడీ నాయకులు, లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబీకులతో సంబంధం ఉన్నవారిని సంస్థ ప్రశ్నించింది. ఆ సమయంలో నితీశ్ కుమార్ జేడీయూ, ఆర్జేడీ లు మిత్రపక్షాలుగా ఉండి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఆ తర్వాత రెండు పార్టీలు వేరు పడి మళ్లీ ఇటీవలే కలిసి బీహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. "ఇది(కేంద్ర దర్యాప్తు సంస్థల సోదాలు) 2017లో కూడా జరిగింది. ఐదేండ్ల తర్వాత మేము (జేడీయూ-ఆర్జేడీ) మళ్లీ కలిసిన తర్వాత సోదాలు తిరిగి జరుగుతున్నాయి.

జైల్లో పెట్టి ఇబ్బంది పెట్టగలరేమో..!

(మొదటిపేజీ తరువాయి)

తన ధైర్యాన్ని దెబ్బతీయలేదని పేర్కొన్నారు. " సార్, మీరు నన్ను జైలులో ఉంచి ఇబ్బంది పెట్టగలరు. కానీ, మీరు నా స్థైర్యాన్ని మాత్రం దెబ్బతీయలేరు. స్వాతంత్ర్య సమరయోధులనూ బ్రిటీషు పాలకులు ఇబ్బందులకు గురి చేశారు. కానీ వారి ఆత్మస్థైర్యం మాత్రం చెక్కు చెదరలేదు. జైలు నుంచి మనీశ్ సిసోడియా సందేశం" అని ముగిస్తూ ఉన్న సందేశం ఆయన అధికారిక ట్విట్టర్ ఖాతాలో కనబడింది. మనీశ్ సిసోడియా ప్రస్తుతం ఢిల్లీ తీహార్ జైలులో ఉన్నారు. మద్యం కుంభకోణం కేసులో ఆయనను సీబీఐ గతనెల 26న అరెస్టు చేసింది. సీబీఐ కోర్టులో తన బెయిల్ పిటిషన్ విచారణకు రానున్న ఒక్క రోజు ముందే గురువారం నాడు మరొక దర్యాప్తు సంస్థ ఈడీ ఆయనను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు మనీశ్ సిసోడియాను ఈనెల 17వరకు ఈడీ రిమాండ్‌కు అనుమతిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేయడంతో తీహార్ జైలులోనే ఆయన ఉండనున్నారు.

ఎమ్మెల్సీ కవితపై బండి వ్యాఖ్యలు అనుచితం..

(మొదటిపేజీ తరువాయి)

స్వీకరించింది. ఈ నేపథ్యంలో బండి సంజయ్‌కు మహిళా కమిషన్ నోటీసులు జారీ చేయనుంది. మహిళల గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు ఉన్నాయని కమిషన్ చైర్మెన్ సునీతా లక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర మహిళా కమిషన్ సంజయ్ వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించనుంది. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని డీజీపీని మహిళా కమిషన్ విచారణకు ఆదేశించింది.

త్రిపురలో హింసపై విచారణకు వెళ్లిన నేతలపై బీజేపీ దాడి

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రంగా గాయపడ్డారు. దాదాపు 700 ఇండ్లు కాలిపోయాయి. ధ్వంసమయ్యాయి. వామపక్ష, కాంగ్రెస్ మద్దతుదారుల రబ్బరు తోటలు, ఇతర వ్యవసాయ పంటలను బీజేపీ కార్యకర్తలు కాల్చివేశారు. వందలాది ఆవులు, గేదెలు, ఇతర పశువులు కాలి బూడిదయ్యాయి. సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలు, నేతల ఇండ్లలోకి చొరబడి, ధ్వంసం చేసినా, కాల్చివేసినా అక్కడి బీజేపీ ప్రభుత్వం ఎవరినీ అరెస్టు చేయలేదు. దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం, పోలీసులు మౌనం దాల్చడంతో ఎంపీల బృందం నిజనిర్ధారణ కోసం రాష్ట్రానికి వెళ్లింది. ఈ బృందంలో సీపీఐ(ఎం) ఎంపీలు ఎలమారం కరీం, బికాష్ రంజన్ భట్టాచార్య, పిఆర్ నటరాజన్, ఎఎ రహీమ్, సీపీఐ ఎంపీ బినయ్ విశ్వం, కాంగ్రెస్ ఎంపీలు రంజితా రంజన్, అబ్దుల్ ఖలీక్ ఉన్నారు. వారు మూడు బృందాలుగా సెపాహిజాల, గోమతి, పశ్చిమ త్రిపుర, ఖోవై, ధలై జిల్లాల్లోని వివిధ ప్రాంతాలను సందర్శించారు.

పశ్చిమ త్రిపుర జిల్లా బిషాల్‌గఢ్‌లోని నేహాల్‌చంద్రానగర్ మార్కెట్‌లో ఎన్నికల ఫలితాలు తరువాత దాదాపు 20 షాపులను కాషాయమూకలు దహనం చేశాయి. ఆ ప్రాంతాన్ని సీపీఐ(ఎం) ఎంపీ ఎలమారం కరీంతో పాటు కాంగ్రెస్ ఎంపీ అబ్దుల్ ఖలీక్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జితేందర్ చౌదరి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ అజోయ్ కుమార్, ప్రతాప్‌గఢ్ ఎమ్మెల్యే రాముదాస్, పీసీసీ అధ్యక్షుడు బ్రిజిత్ సిన్హా, ఇతర ఎమ్మెల్యేలు సందర్శించారు. నేతలను లక్ష్యంగా చేసుకుని భయానక వాతావరణం సృష్టించిన బీజేపీ కార్యకర్తలు ప్రణాళికాబద్ధంగా హింసకు పాల్పడ్డారు. మోహన్‌పూర్‌లో సందర్శనకు వెళ్లిన సీపీఐ(ఎం) ఎంపీలు బికాష్ రంజన్ భట్టాచార్య, ఎఎ రహీం, కాంగ్రెస్ ఎంపీ రంజితా రంజన్ బృందం



ప్రయాణించే వాహనంపై బీజేపీ కార్యకర్తలు దాడికి ప్రయత్నించారు. పోలీసులు చూస్తుండగానే ఈ ఘటన జరిగింది. సెక్యూరిటీగా ఉన్న పోలీసులు మౌనం దాల్చారు. దీంతో పోలీసుల వైఖరిపై ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్, సీపీఐ(ఎం) ఎంపీ పిఆర్ నటరాజన్, సీపీఐ ఎంపీ బినయ్ విశ్వంలతో కూడిన బృందం పశ్చిమ త్రిపురలోని బర్జాలా, బముతియా నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించింది.

బాధితులకు ఎంపీల ఓదార్పు

బీజేపీ హింసాకాండలో దగ్ధమైన ఇండ్లు, వ్యాపారాల ప్రాంతాలను సందర్శించిన ప్రతిపక్ష ఎంపీల బృందం బాధితులను ఓదార్చింది. ఇన్నాళ్లూ కట్టుకున్న ఇండ్లు, ఇతర పొదుపు చేసుకున్న వనరులు కళ్లముందే బూడిదగా మారుతున్నాయని బాధితులు గుండెలవిసేలా ఆవేదనను పంచుకున్నారు. ఈ పర్యటన బాధితుల్లో విశ్వాసాన్ని నింపింది. మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ కూడా పాల్గొన్నారు.

గవర్నర్‌కు వినతి

అయితే దాడుల నేపథ్యంలో ఎంపీల బృందం శనివారం తమ పర్యటనను వాయిదా వేసుకుంది. అనంతరం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ సత్యదేవ్ నారాయణ్ ఆర్యను కలిసి వినతిపత్రం సమర్పించింది. సోనార్టరి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బృందం సభ్యులు మాట్లాడారు. ప్రజల జీవితాలను, జీవనోపాధిని రక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. హింసాకాండతో ప్రతిపక్ష ఎంపీల బృందాన్ని తిప్పికొట్టగలమన్నది బీజేపీ భ్రమ మాత్రమేననీ, అది జరగదని స్పష్టం చేశారు. శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్న త్రిపురలో బిజెపి గూండాయిజం కొనసాగుతోందని విమర్శించారు. త్రిపురలో జరిగిన హింసాకాండను పార్లమెంటులో లేవనెత్తుతామని అన్నారు.

దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి: సిపిఎం

బిషాల్‌ఘర్‌లోని నేహాల్‌చంద్రానగర్‌లో ప్రతిపక్ష ఎంపీల బృందంపై జరిగిన దాడిని సీపీఐ(ఎం) త్రిపుర రాష్ట్ర కార్యదర్శి వర్గం ఖండించింది. దోషులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. బీజేపీ పాలనలో రాష్ట్రానికి వచ్చే ఎంపీలకు కూడా భద్రత లేదని పేర్కొంది.

సేద్యానికి కార్పొరేట్ ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

లెక్కలో లేని కౌలు రైతు : కౌలు రైతుల పేరిట కేంద్ర ప్రభుత్వం ముసాయిదా బిల్లును పార్లమెంటులో చర్చకు పెట్టింది. కార్పొరేట్ల ఒత్తిడిమేరకు ఆ ప్రక్రియను మధ్యలోనే ఆపేసింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఉన్న చట్టాన్ని అమలు చేయకపోగా, వారిని గుర్తించడానికి కూడా ఇష్టపడటం లేదు. రాష్ట్రంలో 15 నుంచి 20 లక్షల మంది కౌలు రైతులున్నారు. వారికి ఎటువంటి రక్షణ సౌకర్యాలు లేవు. కనీసం ఆత్మహత్య చేసుకుంటే పరిహారం కూడా దక్కని దయనీయపరిస్థితి. ఆత్మహత్యల్లో కౌలు రైతులే ఎక్కువ.

సహకార సంఘాలకూ బీజేపీ సర్కారు ఎసరు

రైతులకు చేదోడు, వాదోడుగా ఉంటున్న సహకార సంఘాలకు కూడా కేంద్రం ఎసరు పెట్టింది. బహుళ రాష్ట్ర సహకార సంఘాల బిల్లు-2022 తెచ్చింది. ఆ గొడుకు కిందకు అన్ని సంఘాలను తీసుకొచ్చి లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్న సహకార సంఘాలను కార్పొరేట్ల చేతుల్లో పెట్టేందుకు కుట్ర చేస్తున్నది.

బియ్యం కొనుగోలుకు కొత్త మెలిక

రాష్ట్రంలో దాదాపు 50 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తున్నది. కానీ రాష్ట్ర ప్రభుత్వంపై కోపంతో కేంద్రం ధాన్యం కొనుగోలు చేయబోమని ప్రకటించింది. కేంద్రంపై తీవ్ర వ్యతిరేతక రావడంతో కొత్త మెలిక పెట్టింది. ఉప్పుడు బియ్యం కొనబోమంటూ తన బాధ్యత నుంచి తప్పించుకుంటోంది. దీంతో రైతులు తమ ధాన్యాన్ని తక్కువ ధరకు మిల్లర్లకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారు.



తెలంగాణ రాష్ట్రంలోనే 908 సహకార సంఘాలున్నాయి. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉమ్మడి జాబితాలో ఉన్న వీటిని కేంద్రం తన గుప్పిట్లోకి లాక్కునే ప్రయత్నం చేస్తోంది.

ఆరు నెలల్లో చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

తెలియజేయాలని సీఎంను ప్రశ్నించగా.. అది ముగిసిన అధ్యాయమని ఎగతాళి చేశారని గుర్తు చేశారు. రైతుల ఆత్మగౌరమైన చక్కెర కర్మాగారం ముగిసిన అధ్యాయం అయితే.. కేసీఆర్ అధికారం కూడా ముగిసిన అధ్యాయమే అవుతుందన్నారు. మోడీ మెడలు వంచిన హర్యానా రైతుల స్ఫూర్తితో ఇక్కడి రైతులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. వారి పోరాటానికి కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మోడల్ పాలన అవసరమన్నారు. కాంగ్రెస్ పాలన.. బీఆర్ఎస్ పాలనపై చర్చకు సిద్ధమా అని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ నాయకులు జావిద్, జిల్లా అధ్యక్షుడు అల్లూరి లక్ష్మణ్, నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నరసింగరావు, రాష్ట్ర నాయకులు కృష్ణారావు, కల్వకుంట్ల సుజిత్ రావు, కొమిరెడ్డి కరంచంద్, కాటిపెల్లి శ్రీనివాస్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యనారాయణ రెడ్డి, ఎల్లాల జలపతి రెడ్డి, రైతు నాయకులు మామిడి నారాయణ రెడ్డి, బద్దం శ్రీనివాస్ రాజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

ఆద్యంతం ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు రాజ్‌భవన్ ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా పోలీసులకు వారికి మధ్య పెనుగులాట జరిగింది. మోడీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈడీ విచారణానంతరం ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేస్తారనే ప్రచారం జరగడంతో మంత్రులు టీ హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కే తారకరామారావు ముందురోజే (శుక్రవారం) ఢిల్లీకి వెళ్లారు. కవితను అరెస్టు చేస్తే రాష్ట్ర మంత్రులు ఢిల్లీలో ఆందోళనలు చేయాలనే వ్యూహంతో వెళ్లినట్టు సమాచారం. మరోవైపు ప్రగతి భవన్ వద్దకు భారీగా బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోవడంతో అక్కడ కూడా ఉద్రిక్తత ఏర్పడింది. ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ఎప్పటికప్పుడు ఆరా తీసారు. రాత్రి 7 గంటల సమయంలో కవితను అరెస్టు చేయట్లేదని ఢిల్లీలోని ఈడీ కార్యాలయం మీడియాకు లీకులు ఇచ్చింది. దీనితో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం

- **బూడిద, పొగతో కమ్ముకుపోయిన సమీప గ్రామాలు**

జకార్తా : ఇండోనేషియాలో జావా దీవికి సమీపంలోని మెరపి అగ్నిపర్వతం బద్దలైంది. పర్వతానికి పగుళ్లు పడిన ప్రాంతానికి సమీప గ్రామాలన్నీ అగ్నిపర్వతం నుండి పెద్ద ఎత్తున వస్తున్న బూడిద, పొగతో కమ్ముకుపోయాయి. దీంతో దేశంలోనే అత్యంత క్రియాశీలంగా వుండే అగ్నిపర్వతం ఏటవాలుల్లో పర్యాటకం, మైనింగ్ కార్యకలాపాలను అధికారులు నిలిపివేయాల్సి వచ్చింది. ఇండోనేషియాలోని యోగ్యకర్తా ప్రత్యేక ప్రాంతంలో వున్న ఈ అగ్నిపర్వతం శనివారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో బద్దలైంది. దీంతో పెద్ద ఎత్తున వేడిగాలులు, పొగ, బూడిద వెలువడ్డాయి. దానికి తోడు రాళ్ళురప్పలతో కూడిన లావా ఏటవాలుగా ఏడు కిలోమీటర్ల వరకు దిగువకు ప్రవహించింది. వేడి బూడిద మేఘాలు గాల్లో వంద మీటర్ల ఎత్తు వరకు లేచాయని జాతీయ విపత్తు నిర్వహణా సంస్థ ప్రతినిధి అబ్దుల్ ముహరి తెలిపారు. అగ్నిపర్వతం నుండి వెలువడిన బూడిద మేఘాలతో రోజంతా సూర్యుడు కనబడకుండా పోయాడు. 8 గ్రామాలు తీవ్రంగా బూడిదతో ప్రభావితమయ్యాయని మెరపి అబ్జర్వేషన్ పోస్ట్ అధికారి ఒకరు తెలిపారు. బూడిదతో కప్పడిపోయిన ఇళ్ళు, రోడ్ల దృశ్యాలను స్థానిక టివి ప్రసారం చేసింది. 2963 మీటర్ల ఎత్తువుండే మెరపి అగ్నిపర్వతం దేశంలోనే అత్యంత క్రియాశీలంగా వుండే పర్వతాల్లో ఒకటి. 2010లో చివరిసారిగా బద్దలైనపుడు 300మందికి పైగా మరణించారు.

దండిగా 'ధరణి' సమస్యలు..

- ఆఫీసుల చుట్టూ చెప్పలరిగేలా తిరుగుతున్న ప్రజలు
- ప్రతి 'ప్రజావాణి' అర్జీల్లో సగానికిపైగా వెల్లువలా భూసంబంధిత అర్జీలే!
- సవరణకు ఆప్షన్లు ఉన్నా.. పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం
- పేరు మార్పిడికాక.. భూమి కొలతల్లో తప్పులు సరి చేయక...
- గత ప్రభుత్వాలిచ్చిన భూముల రికార్డులూ నమోదు చేయక..
- రైతుబంధు, బీమా సహా సంక్షేమాలకు దూరం..
- పట్టాల్లేక ప్యాడీ సెంటర్లలో పండించిన ధాన్యం అమ్ముకునేందుకూ తిప్పలు



భూరికార్డులు, పట్టాపాసుపుస్తకాల వివరాలు నికచ్చిగా ఉంటాయని 2020లో తీసుకొచ్చిన ధరణి పోర్టల్ కొందరికి శాపంగామారింది. మ్యూటేషన్, విరాసత్ సహా రికార్డుల్లో సర్వేనెంబర్ల తప్పులు, ఒకరిపేరుకు బదులు మరొకరి పేరు.. సాదాబైనామాల పద్ధతిలో క్రయవిక్రయాలు సాగిన భూముల వివరాల్లో పాతయజమానుల వివరాలు నమోదు కావడం.. ఇలా అనేక సమస్యలను తెచ్చిపెట్టింది. అయితే పూరిస్థాయిలో పోర్టల్‌లో సమస్యల పరిష్కారానికి ఆప్షన్లు ఇస్తామని చెప్పిన సర్కారు కొన్నింటికి అవకాశం ఇచ్చింది. ఆప్షన్ల కింద వచ్చిన అర్జీలను పరిష్కరించాల్సిన అధికారులు మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా గ్రామానికి కనీసం పది మందికిపైగా రైతులు కండ్ల ఎదుటే భూమి ఉన్నా.. రికార్డుల్లో పేర్లు లేక అవస్థలు పడుతున్నారు. రైతుబీమా, రైతుబంధు వంటి పథకాలకూ దూరమవడమే కాకుండా ఆ భూమిలో పండించిన పంటను సర్కారు ప్యాడీ సెంటర్లలో అమ్ముకునేందుకూ పట్టాపాసుపుస్తకాల్లేక తిప్పలు పడుతున్నారు.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / ఎలిగేడు

ప్రజావాణిల్లో సగం 'ధరణి' సమస్యలే!

ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లోని కలెక్టరేట్లలో ప్రతి సోమవారమూ నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాల్లో వచ్చే అర్జీల్లో సగం ధరణి సమస్యలపైనే వస్తున్నాయి. కరీంనగర్‌లో సుమారు 6వేలు, పెద్దపల్లి జిల్లాలో 5వేలు, జగిత్యాల జిల్లాలో 8వేలు, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 4వేల దరఖాస్తుల వరకు ఉంటాయని రెవెన్యూ అధికారుల అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే ఇందులో మూడోవంతు దరఖాస్తులు కోర్టు కేసులని, ఇతర కారణాలు చూపి తిరస్కరిస్తుండగా.. మిగిలిన అర్జీలను మాత్రమే లెక్కలోకి తీసుకుంటున్నారు. అందులోనూ ఇప్పటివరకు కనీసం 10శాతం దరఖాస్తులు కూడా పరిష్కారానికి నోచుకోని పరిస్థితి నెలకొంది.

ఆకాశంలో భూముల ధరలు.. తారాస్థాయిలో వివాదాలు...

15 ఏండ్ల క్రితం వరకు ఏ గ్రామానికి వెళ్లినా ఎకరా భూమి రూ.2లక్షల నుంచి 4లక్షలకు మించి ధర పలకలేదు. అదే ఇప్పుడు ఏ మూలన భూమి ఉన్నా.. ఎకరా రూ.20లక్షలపైనే పలుకుతోంది. ఇక రోడ్డు సౌకర్యం, నీటి లభ్యత ఉన్న సాగు భూములు, పట్టణాలకు సమీపంలోఉన్న ప్రాంతాల్లో ఎకరాకు రూ.కోటికిపైగానే రేటు పలుకుతోంది. ఇదే సమయంలో భూముల వివరాలు, రికార్డులు ధరణిలో సవ్యంగా ఉన్నవి క్రయవిక్రయాలు జోరుగా సాగుతుండగా.. వివరాలు నమోదు కాని భూముల విషయంలోనే వివాదాలు తలెత్తుతున్నాయి. ఒకరి భూమి మరొకరి పేరున నమోదు కావడం, ఏండ్ల కిందట భూములు అమ్ముకున్న వారి పేర్లే రెవెన్యూ అధికారుల తప్పిదాలతో మళ్లీ రావడం, వంశపారంపర్యంగా వచ్చిన భూములు ఇతరుల పేర్లపై నమోదు కావడం వంటి సమస్యలు అనేకం ఉన్నాయి. పక్కాగా పట్టా ఉన్న భూములు సైతం కొన్ని నిషేధిత జాబితాలో చేరడం ఆ యజమానులకు శాపంగా మారింది. పాతయజమానుల ప్రమేయం పెరగడం, తాము అప్పుడు అగ్గువకో..సగ్గువకో విక్రయించామని, ఇప్పటి మార్కెట్ రేటు లెక్కించి ఇస్తేనే తిరిగి రిజిస్ట్రేషన్ చేస్తామని బెదిరింపులకు దిగుతున్నవారూ పెరిగారు. సర్వేనెంబర్లు మిస్ అయి, పేర్లలో తప్పులు దొర్లి కొందరు పంట రుణాలు పొందలేకపోతున్నారు. ఇలాంటి సమస్యల్లో కొన్ని భౌతికదారులు, హత్యలకూ దారి తీసిన ఘటనలూ చోటుచేసుకున్నాయి.

పట్టాలేకుంటే ప్యాడీ సెంటర్లలో తిప్పలు..

ధరణి పోర్టల్ వచ్చిన తరువాత అంతకు ముందు సాదాబైనామాల ద్వారా క్రయవిక్రయాలు జరిగిన వ్యవసాయ భూముల వివరాలు చాలా వరకు వ్యవసాయశాఖ రికార్డుల్లో నమోదు కాలేదు. రైతుబంధు, రైతుబీమా దరఖాస్తు చేసుకునే వీలే లేకపోవడంతోపాటు ఇతర కారణాల వల్ల మ్యూటేషన్, విరాసత్ అయిన భూములూ రికార్డుల్లో లేవు. సదరు రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద తమ ఆధార్ నెంబర్ ఇస్తే.. కేవలం రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్న భూముల వివరాలు కనిపిస్తున్నాయి. దీంతో వారు పండించిన ధాన్యం సేకరించేందుకు వీల్లేకుండా పోయింది. వీరంతా పడావుగా ఉన్న భూముల యజమానుల పట్టాదారుపాసుపుస్తకాలు తెచ్చుకుని కొందరు అతి కష్టంమీద పంటను అమ్ముకుంటున్నారు. ఈ వ్యయప్రయాసాలెందుకని మరికొందరు మిల్లర్లకే తక్కువకు అమ్ముకుంటున్నారు.



ఈయన పేరు సాగర్. ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన ఈ రైతు 14 ఏండ్ల క్రితం ఎకరం సాగు భూమి కొనుగోలు చేశాడు. అప్పుడు పట్టా, పాసుపుస్తకమూ వచ్చింది. ధరణి వచ్చిన తరువాత రికార్డుల్లో కేవలం 30గుంటలు మాత్రమే ఆన్‌లైన్‌లో చూపెడుతోంది.మిగిలిన 10 గుంటలు కలిపి సరి చేయాలని తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా, కలెక్టరేట్ ప్రజావాణిల్లో ఎన్నిమార్లు అర్జీలు ఇచ్చినా కనీసం సరి చేసిన పాపాన పోలేదు.



ఈయన పేరు పల్లె రాజేశం, సుల్తాన్‌పూర్‌కు చెందిన ఈయనకు 2009లో అప్పటి ప్రభుత్వం 10గంటల సాగు భూమి ఇచ్చి పట్టా, పాసుపుస్తకం ఇచ్చింది. ధరణి వచ్చాక ఆయన పేరుగానీ, భూమిగానీ రికార్డుల్లో లేవు. ఈయనా ఎన్నిమార్లు ఆఫీసుల చుట్టూ తిరిగినా ఇప్పటికీ నమోదు చేయడం లేదు.



సుల్తాన్‌పూర్ గ్రామానికే చెందిన కవ్వంపల్లి జ్యోతి పరిస్థితి అలాగే ఉంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. గత ప్రభుత్వం లావణ్యపట్టా కింద ప్రభుత్వ భూమి ఇవ్వగా ఇప్పటికీ సాగు చేసుకుంటోంది. ఈమెకు సంబంధించిన భూమి వివరాలు ధరణిలో నమోదు కాలేదు. దీంతో రైతుబంధు, బీమాకు దూరమవడమేకాకుండా పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకూ ప్రతియేడూ తిప్పలు పడుతోంది.

ఒక్కసుల్తాన్‌పూర్ గ్రామంలోనే ఇలా సుమారు 20మందికిపైగా రైతులు ధరణిలో పట్టా, పాస్తకాలు రాక అవస్థలు పడుతున్నారు. ఇలాంటి రైతులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కనీసం 50వేల మంది తహశీల్దార్ ఆఫీసుల చుట్టూ చెప్పలరిగేలా తిరుగుతున్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ముత్యంరావు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ - సుల్తానాబాద్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రతిఘటనగా ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు అన్నారు. శనివారం సుల్తానాబాద్ రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ జనరల్‌బాడీ సమావేశం తాండ్ర అంజయ్య అధ్యక్షతన జరిగింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రతిఘటనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ నిర్వహించాలని రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల అఖిలభారత కమిటీలు పిలుపునిచ్చాయని తెలిపారు. ఇందులో జిల్లాలోని కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం ప్రభుత్వరంగ పరిశ్రమలను, సంస్థలను, వ్యవసాయాన్ని మొత్తం ప్రైవేట్ కార్పొరేటు శక్తులకు అప్పచెప్పి దేశాన్ని పరాధీనం చేసే దుర్మార్గపు విధానాలను అనుసరిస్తున్నదని విమర్శించారు. ఆదేవిధంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు, చట్టాలను, సౌకర్యాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని, వ్యవసాయ కార్మికులకు ఉన్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా అనేక చర్యలు చేపట్టిందన్నారు. యువకులు, మహిళలు, విద్యార్థులు, బడుగు, బలహీన వర్గాల హక్కులను హరించే పద్ధతిలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బండారి తిరుపతి, కిరణ్, శీను, మల్లేష్, రాజు, సతీష్, అనిల్, సంపత్, మల్లయ్య రమేష్, సంతు, వేణు, మహేష్, లింగమూర్తి, ఏలియా, నర్సింగ్, రామచంద్రరావు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణానికి కాలువ నీరు

చోద్యం చూస్తున్న అధికారులు



నవతెలంగాణ - మంథని

అనుమతి లేని భవన నిర్మాణానికి ఓ వ్యక్తి కాలువ నీరు విద్యుత్ పంపు మోటర్‌తో వాడుతున్నాడు. సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని మండల ప్రజల ఆరోపణలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే మంథని మండలం మల్లేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పాత గోదావరిఖని క్రాస్ రోడ్డు వద్ద మంథనికి చెందిన ఓ రియల్టర్ అనుమతి లేకుండా పశువుల కొట్టం పేరిట అనుమతి అని చెప్పి పంచాయతీ అనుమతి లేకుండానే భారీ రేకుల షెడ్డు నిర్మాణం చేపడుతున్నారు. నిర్మాణం చేయడమే కాకుండా రైతులకు చెందాల్సిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు కెనాల్ కు మోటార్ పెట్టి నీటి చౌర్యం చేస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. గోదావరిఖని ప్రధాన రహదారికి అనుకుని ఉన్న అనుమతి లేని నిర్మాణంతో పాటు నీటి చౌర్యం చేస్తున్న పరిస్థితి కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతినిత్యం ఈ రహదారి వెంట ఎందరో అధికారులు వెళ్తున్నా వారికి ఈ దృశ్యాలు కానరావడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేడు అల్లూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

నవతెలంగాణ - యైటింక్లైన్ కాలనీ

సింగరేణి ఆర్జీ-2 ఏరియా వకిల్ పల్లి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామం అల్లూరులో ఆదివారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. వైద్య శిబిరంలో జనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జన్, ఎముకల, గైనకాలజీ, చాతి, చెవి, ముక్కు, గొంతు, చర్మ దంత, కంటి వైద్యులు పరీక్షలు చేస్తారని, ల్యాబ్‌కు సంబంధించిన అన్ని పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని డిజిఎం పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి జి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. అల్లూరు గ్రామ ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండ గొర్రెను అడవిలో వదిలిన అధికారులు

నవతెలంగాణ - వీర్నపల్లి



వీర్నపల్లి మండలం ఎర్రగడ్డ తండా గ్రామంలో కొండ గొర్రెను కుక్కలు తరిమి గాయపర్చాయి. గ్రామస్తుల సహాయంతో అటవీ శాఖ అధికారులు కొండ గొర్రెను పట్టుకొని ప్రథమ చికిత్స అందించారు. సురక్షితంగా ఉందని తెలుసుకొని ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటపూర్ అర్బన్ ఫారెస్టులో శనివారం వదిలినట్టు వీర్నపల్లి అటవీ శాఖ సెక్షన్ అధికారి రంజిత్ కుమార్ తెలిపారు. వన్య ప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరిదని, వాటిని వేటడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బకాయిలు చెల్లించాలి

బిఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

నవతెలంగాణ - గోదావరిఖని



రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణి సంస్థకు రావలసిన విద్యుత్తు, బొగ్గు బకాయిలు రూ.25వేల కోట్ల రూపాయలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. సింగరేణి ఆర్జీ 1 పరిధిలోని జిడికె 2ఎ గనిలో శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 2014 ఆర్థిక సంవత్సరం నుండి రావలసిన విద్యుత్, బొగ్గు బకాయిలు 25 వేల కోట్ల రూపాయలు సింగరేణి కాలనీ సంస్థలో వెంటనే జమ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించుటకు చర్యలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యానికి డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఆకుల హరిణ్, తాట్ల లక్ష్మయ్య, సంగాని సాంబయ్య, రాపల్లి వజ్ర వేణు, భీమునిపెళ్లి నారాయణ, వై.కోటయ్య, బోడకుంట రాజేశం, ఆరేపల్లి వెంకటరాజం, జనగామ రాయలింగు, గుండెబోయిన భూమయ్య, గొడుగు సమ్మయ్య, పిట్టల వినోద్ తదితరులున్నారు.

మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా తోట శంకర్

నవతెలంగాణ - రామగిరి



రామగిరి మండలంలోని కల్వచర్లలో గ్రామంలో శనివారం మున్నూరు కాపు సంఘం సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా తోట శంకర్, ఉపాధ్యక్షుడిగా చింతం అనిల్, ప్రధాన కార్యదర్శిగా రేండ్ల శ్రీధర్, కోశాధికారిగా రేండ్ల కృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షుడిగా కుడిది వేణుగోపాల్, ముఖ్య సలహాదారులుగా కొప్పుల సునీల్, రాపెల్లి శ్రీధర్, కార్యవర్గ సభ్యులుగా కస్తు మహేందర్, రేండ్ల శ్రీనివాస్, జంగిలి రాజయ్య, వరాల హరీష్, బూస అజయ్‌ను ఎన్నుకున్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు పోస్టరు ఆవిష్కరణ

నవతెలంగాణ - పెద్దపల్లి

హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 12న నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు పోస్టర్‌ను హనుమంతునిపేట గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వైస్ చైర్మన్ నూనె రాజేశం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మన వెంకటేశం, నాగమల్ల వెంకటేశం, దామ కనకయ్య, దామ చిన్న కనకయ్య, తీగల సతీష్, బయ్య కొమురయ్య, తీగల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

విదేశాలలో ఉద్యోగాలకు 13న ఎన్రోల్మెంట్ డ్రైవ్

పెద్దపల్లి జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు

నవతెలంగాణ - పెద్దపల్లి

ఆస్ట్రేలియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యూఎస్ఈ దేశాల్లో పనిచేసేందుకు నైపుణ్యం గల అభ్యర్థుల కోసం ఈ నెల 13న కరీంనగర్ బైపాస్ రోడ్డులోని ఉజ్వల పార్క్ ఎదురుగా గల టాస్క్ రీజినల్ సెంటర్‌లోని ఐటి టవర్స్‌లో టామ్ కామ్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ ను నిర్వహించనున్నట్టు పెద్దపల్లి జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకుని హాజరు కావాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద నమోదు చేయబడిన రిక్రూట్మెంట్ ఏజెన్సీ టామ్ కామ్ అని, దీని ద్వారా తెలంగాణ నుండి అర్హత, నైపుణ్యం కలిగిన వారికి ఉద్యోగాలు కల్పించేందుకు విదేశాలలో ప్రభుత్వ, ప్రైవేట్ రిజిస్టర్డ్ ఏజెన్సీలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నదని తెలిపారు. ఆస్ట్రేలియాలో హెచ్‌డి మెయింటెనెన్స్ టెక్నీషియన్స్, ఫిట్టర్, భారతీయ రెస్టారెంట్‌లలో పనిచేయుటకు చెఫ్‌లు, అలాగే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ యూఏఈలో బ్లాస్టర్ పెయింటర్, క్లీనర్, ఫోర్‌మాన్ బ్లాస్టింగ్, పెయింటింగ్ ఫోర్‌మాన్ ప్లేటర్, జిటిడబ్ల్యూటీ వెల్డర్, ఐటివి డ్రైవర్, మెషినిస్ట్ - సిఎన్సి, పైప్ ఫిట్టర్, ప్లేటర్ ఫ్యాబ్రికేటర్, సెక్యూరిటీ సిస్టమ్స్ టెక్నీషియన్, సీనియర్ ఆఫీసర్ ఆపరేషన్స్ ఖాళీలకు రిక్రూట్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల కనీస చెల్లుబాటు కలిగిన పాస్‌పోర్ట్ ఉండి, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ పేర్లను వెబ్సైట్ www.tomcom.telangana.gov.in, మొబైల్ యాప్, ఈ-మెయిల్ hrm-tomcom-letf@telangana.gov.in ద్వారా నమోదు చేసుకోవాలని, ఎంపికైన అభ్యర్థులకు భోజన, వసతి, చేరిక టికెట్‌లు అందిస్తారని, మరిన్ని వివరాలకు మేనేజర్ సెల్ 9100798204, 7893566493, 8328602231 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



అభిలాష్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటపూర్ గ్రామానికి చెందిన గొట్టే అభిలాష్ (20) డిగ్రీ విద్యార్థి గ్రామంలో ఓ మిత్రుని వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. శనివారం ఉదయం సుమారు 3గంటల సమయంలో మిత్రుడు సోమిత్ కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళ్తుండగా పెద్దూరు గ్రామశివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికులు వారిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాల పాలైన అభిలాష్‌కు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు పరిస్థితి విషమించి మృతిచెందాడు. స్వల్ప గాయలపాలైన మరో వ్యక్తి చికిత్స పొందుతున్నాడు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాశాఖ వర్క్‌షాప్‌కు ఎంపికైన సర్పంచులు

నవతెలంగాణ - వేములవాడ

విద్యా విధానంలో పంచాయతీరాజ్ శాఖ పాత్రపై ఈ నెల13న హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ భవన్‌లో రాష్ట్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో వర్క్ షాప్ నిర్వహించనున్నారు. ఈ వర్క్ షాప్‌కు రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి ముగ్గురు సర్పంచులు ఎంపికయ్యారు. వారిలో వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం ఆర్అండ్ఆర్‌కాలనీ సర్పంచ్ ఊరడీ రాంరెడ్డి, రూరల్ మండలంలోని చెక్కపల్లి సర్పంచ్ అడ్డిక జైపాల్‌రెడ్డి, చందుర్తి మండలం మూడపల్లి సర్పంచ్ చిలుక అంజిబాబు ఉన్నారు.

ఆర్థికంగా నిలదొక్కుకోవడంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ - గోదావరిఖని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా శనివారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో వేస్ట్ టు వెల్త్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటి వద్దనే తడి చెత్త నుండి కంపోస్ట్ తయారు చేసుకొని కిచెన్ గార్డెన్, రూఫ్ గార్డెన్ తో పూల మొక్కలు పెంచుతూ కూరగాయలు పండిస్తూ ఆదాయం ఆర్జిస్తున్న స్వశక్తి మహిళలందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మరింత ప్రోత్సహించడానికి పలువురు మహిళలు కోరిన ప్రకారం కంపోస్ట్ తయారు చేసుకోవడానికి అనువుగా ఉండే సిమెంట్ గాజులు తాను ఉచితంగా అందిస్తానని ప్రకటించారు. గౌతమి నగర్ లో డ్రై రిసోర్స్ సెంటర్ నిర్వహిస్తున్న స్వశక్తి మహిళ బిజిలీ విజయను అభినందిస్తూ అందరూ ఆమె పట్టుదలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ప్రతి రెండు నెలలకోకసారి ప్రభుత్వ వైద్య కళాశాలలో స్వశక్తి మహిళల కోసం ఉచిత వైద్య పరీక్షలు, మందులు ఇవ్వడానికి ఏర్పాట్లు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్ మాట్లాడుతూ హోమ్ కంపోస్టింగ్, కిచెన్ గార్డెన్‌తో పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు ఆరోగ్యకరమైన పండ్లు, కూరగాయలు అందుబాటులో ఉంటాయని అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ బి. సుమన్ రావు మాట్లాడుతూ మహిళలనుండి మహిళల నాయకత్వంలో స్వచ్ఛత వరకు పరివర్తన జరిగిన నేపథ్యంలో స్వచ్ఛోత్సవ్ 2023 పేరుతో ఈ నెల 30 వతేదీ వరకు ఒక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సానిటేషన్, వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో చాంపియన్ మహిళలను గుర్తించి విన్స్ (విమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత) అవార్డ్స్ 2023 ఇస్తామని తెలిపారు. ఈ అవార్డుల కోసం మహిళా పారిశ్రామిక వేత్తలు, స్వశక్తి మహిళలు, ఎన్‌జిఓ, స్టార్ట్ అప్, సూక్ష్మ పరిశ్రమల నిర్వాహకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గడువులోగా వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన ఐదు నామినేషన్లను జాతీయ స్థాయి పురస్కారం నిమిత్తం ప్రభుత్వానికి సమర్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు ఏప్రిల్ 5లోపు నగర పాలక సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. మెప్మా విభాగంలో సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలుపుతారని అన్నారు. సమావేశంలో ఐదవ డివిజన్ కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణి, నగర పాలక సంస్థ సూపరింటెండెంట్ మనోహర్, మెప్మా డిఎంసి రజనీ, టిఎంసి శ్వేత సిఓలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

సమ్మె ఒప్పందాలను అమలు చేయాలి

నవతెలంగాణ-గోదావరిఖని



మాట్లాడుతున్న నాయకులు

18 రోజుల సమ్మె సందర్భంగా చేసిన ఒప్పందాలను సింగరేణి యాజమాన్యం అమలు చేయాలని ఐఎఫ్‌టియు అనుబంధ ఎస్‌సిసిడబ్ల్యూయు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తోకల రమేష్ డిమాండ్ చేశారు. ఎస్‌సిసిడబ్ల్యూయు ఆధ్వర్యంలో గోదావరిఖనిలో పవర్ హౌస్ జోన్‌లో గేట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను దోపిడీ చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నదని, అన్ని రోజుల సమ్మె సందర్భంగా చేసిన ఒప్పందాన్ని సైతం అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, కాంట్రాక్టు కార్మికుల చెమట చుక్కల మీద లాభాలు ఆర్జిస్తూ కాంట్రాక్టు కార్మికుల వేతనాలపై చిన్నచూపు చూస్తున్నదని, రోడ్లు భవనాల శాఖకు చెందిన వేతనాల జీవోను సింగరేణి యాజమాన్యం గుడ్డిగా అమలు చేస్తున్నదని, మైనింగ్‌కు సంబంధించిన జీవోలను అమలు చేయడం లేదని అన్నారు. పారిశుధ్య కార్మికులకు సంబంధించిన జీవోలను కూడా అమలు చేయకుండా చట్టాల ఉల్లంఘనకు పాల్పడుతున్నదని అన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం 18 రోజుల సందర్భంగా చేసిన ఒప్పందాలను వెంటనే అమలుకు పూనుకోవాలని, 22వ జీవో కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొయ్యడ శంకర్, మాట్ల సమ్మయ్య, ఎం.వాసుదేవారెడ్డి, దీక్షాకుమారి, మమత, సాయి, రాంబాబు, దుర్గ, లక్ష్మి, కొమురమ్మ, రాజేశ్వర, పోచమ్మ తదితరులున్నారు.

డి10 మోడల్ పరికరాన్ని ప్రారంభించిన సింగరేణి డైరెక్టర్

నవతెలంగాణ - గోదావరిఖని



ప్రారంభిస్తున్న డైరెక్టర్

గోదావరిఖనిలోని సింగరేణి ఆసుపత్రిలో పాథలాజికల్ ల్యాబ్‌లో హెచ్‌బీ ఎ1సి మూడు నెలల షుగర్ పరీలకు సంబంధించి రూ.14లక్షల విలువ గల బయోరాడ్ కంపెనీకి చెందిన డి10 మెడల్ పరికరాన్ని సంస్థ డైరెక్టర్ (పా) ఎన్.బలరాం, ఆర్జీ 1 జిఎం కల్వల నారాయణతో కలిసి శనివారం ప్రారంభించారు. ముందుగా డైరెక్టర్ ఎన్.బలరాం ఏరియా ఆసుపత్రిలోని అన్ని వార్డులను తనిఖీ చేశారు. రోగులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులను కూడా స్వయంగా కలిసి వారికి అందజేస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో డివైసిఎంఓ డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్, డివైసిఎంఓ డాక్టర్ బి.అంబిక, పాతాలిజస్ట్ డాక్టర్ విష్ణుమూర్తి, టిబిజికెఎస్ ఏరియా ఆసుపత్రి ఫిట్ సెక్రటరీ రత్నమాల, సివిల్ సూపర్‌వైజర్ పెద్దపల్లి శ్రీనివాస్, ఏరియా ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి : పాలకుర్తి జడ్పిటిసి కందుల సంధ్యారాణి

నవతెలంగాణ - గోదావరిఖని



సత్కరిస్తున్న బ్యాంక్ మెనేజర్

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పాలకుర్తి జడ్పిటిసి కందుల సంధ్యారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గోదావరిఖని గోదావరి అర్బన్ బ్యాంక్ మేనేజర్ వంగల బలరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ఉత్తమ మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకుర్తి జడ్పిటిసి కందుల సంధ్యారాణి మాట్లాడారు. కార్యక్రమంలో వంగల మానస, మిట్టపల్లి సుమలత, కందుకూరి ప్రసన్న, జడల మమత, గూడెం స్వప్న, యంపటి నర్మద, బొజ్జ ఉమాదేవి, గుడిపాటి లత, సిబ్బంది పాల్గొన్నారు.

అచీవర్స్‌లో వార్షిక క్రీడా పోటీలు


నృత్యం చేస్తున్న విద్యార్థులు


జ్ఞాపికను అందిస్తున్న పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్

నవతెలంగాణ-కరీంనగర్: నగరంలోని స్థానిక కోతిరాంపూర్‌లో గల అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆశీర్వచన కార్యక్రమం, వార్షిక క్రీడా పోటీల బహుమతుల కార్యక్రమం నిర్వహించారు. శాతవాహన యూనివర్సిటీ డైరెక్టర్ ఎంబీఏ, హెడ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డాక్టర్ ఎనుగాల మనోహర్, పాఠశాల డైరెక్టర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సిహెచ్.పల్లవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, పాటలు, డ్రామాలతో హోరెత్తించారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ.. ఒక లక్ష్యం ఏర్పరచుకుని ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా పట్టుదలతో చదివి ఆ లక్ష్యాన్ని సాధించాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేసారు. పాఠశాల డైరెక్టర్ సి హెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పదో తరగతి ఒక పునాది లాంటిదని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను పట్టుదలతో అధిగమించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్.పల్లవి మాట్లాడుతూ.. చదువుపై ఆసక్తితో చదివి మంచి మార్కులు సాధించి బంగారు భవిష్యత్తు దిశగా పయనించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు, పాఠశాల సిబ్బందికి జ్ఞాపికలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జంగపల్లి జీపీలో కంటి అద్దాలు పంపిణీ

నవతెలంగాణ-గన్నేరువరం: జంగపల్లి గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజలకు కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి అద్దాల కోసం ఆర్డర్ పెట్టారు. 30 మందికి అద్దాలు రాగా వాటిని పంపిణీ చేసినట్లు హెల్త్ అసిస్టెంట్లు శ్రీరాములు, శ్రీనివాస్ తెలిపారు. ఇంకా 300 మందికి అద్దాలు రావాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


కంటి అద్దాలు ఇస్తున్న వైదులు

కల్వకోటలో శ్రీ వీరభద్ర స్వామి వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-మేడిపల్లి: మండలంలోని కల్వకోట గ్రామంలో శ్రీ వీరభద్ర స్వామి 13వ వార్షికోత్సవంలో భాగంగా శివ కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం 1200 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు తుల ఉమ, జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, సర్పంచ్ ఆదే హనుమక్క, మాజీ సర్పంచ్ ఆదే లక్ష్మీరాజం, ఎంపీటీసీ ఆదే రాజన్న, సింగిల్ విండో డైరెక్టర్ ఆదే గంగజల, జిల్లా, మండల విద్యాధికారి నరేశం, సీనియర్ నాయకులు ఎస్ఎస్ రెడ్డి, అల్లిపూర్ మాజీ సర్పంచ్ బాలే శోభారాణి, శేఖర్, సామాజిక కార్యకర్త బత్తుల అంజయ్య, పాలకమండలి సభ్యులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం, భక్తులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న భక్తులు, ప్రజా ప్రతినిధులు

గోవిందారంలో 'విద్యార్థి మహోత్సవ్-2023'

నవతెలంగాణ-మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలోని గోవిందారం జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాల ఆధ్వర్యంలో, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సహకారంతో 'విద్యార్థి మహోత్సవ్-2023' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల ఆవరణలో సభా కార్యక్రమాల ద్వారా, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థి బృందం ద్వారా ఈ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి నరేశం హాజరయ్యారు. చిన్నారుల వేషధారణలు, విన్యాసాలు, నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచులు కె.మధుకర్, ఎంపీటీసీ నెల్లుట్ల పూర్ణిమ ప్రభాకర్, సర్పంచులు లచ్చన్న నాయక్, దంపేటలక్ష్మీ నరసయ్య, గాజొజి చారి, ఎంపీటీసీ లోలపు రాజేశ్వరి, మాజీ సర్పంచ్ లోలపు రాజిరెడ్డి, ఉపాధ్యాయ, విద్యార్థి బృందం పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-రామడుగు: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని గుండి గ్రామంలో పది లక్షల విలువైన పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో గడపగడపకు సంక్షేమ ఫలాలు అందని ఇల్లు లేదన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుండి మానస ప్రవీణ్, ఉప సర్పంచ్ మేడి శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బండ అజయ్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గంట్ల వెంకటరెడ్డి, పార్టీ అధ్యక్షుడు గంట్ల జితెందర్ రెడ్డి, సీనియర్ నాయకులు కలిగేటి లక్ష్మణ్, ఫైండ్ల శ్రీనివాస్, శనిగరపు అర్జున్, జలపతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

ప్రజా సంక్షేమానికి రూ.200 కోట్లు నిధులు మంజూరు

- సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-తిమ్మాపూర్: మానకొండూర్ నియోజకవర్గంలోని ప్రజా సంక్షేమానికి రూ.200 కోట్ల నిధులు మంజూరైన సంధర్భంగా శనివారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో సీఎం కేసీఆర్, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ చిత్ర పటానికి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానకొండూర్ నియోజకవర్గానికి 3 వేల డబుల్ బెడ్రూం ఇళ్లకు గాను రూ.90 కోట్లు, దళిత బంధు యూనిట్‌కు రూ.110 కోట్లను మంత్రివర్గ సమావేశంలో సీఎం కేసీఆర్ మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, , మండలాధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు

శ్రీ సీతారామలక్ష్మీ నృసింహ స్వామిని దర్శించుకున్న కవ్వంపల్లి

నవతెలంగాణ-తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ గ్రామంలో గల శ్రీ సీతారామ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారిని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కవ్వంపల్లికి ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేసి, శాలువాతో సన్మానించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీసి, స్థానికులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎల్.గౌడ్, పోలంపెల్లి ఎంపీటీసీ బండారి రమేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నబోయిన రవి యాదవ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు గౌష్ పాషా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణ

వేములవాడ ప్రభుత్వాసుపత్రికి ఫ్యాన్ బహూకరణ

నవతెలంగాణ-మేడిపల్లి: వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పాలియేటివ్ కేర్ విభాగంలో సిబ్బంది ఇబ్బందిని గమనించి వాల్ ఫ్యాన్‌ను గోవిందారం ఎంపీటీసీ నెల్లుట్ల పూర్ణిమ ప్రభాకర్ అందజేశారు. ప్రభుత్వ హాస్పిటళ్లు.. కార్పొరేట్ హాస్పిటళ్లకు ధీటుగా వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రి పని చేస్తుందని ఆసుపత్రి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బగవంతం, బింగి లచ్చయ్య ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త నందు, ఆసుపత్రి సిబ్బంది నవీన, శైలజ పాల్గొన్నారు.


గోడ ఫ్యాన్ అందజేస్తున్న ఎంపీటీసీ

ఖేలో కరీంనగర్...జీతో కరీంనగర్

మానకొండూరు అసెంబ్లీ నియోజకవర్గ క్రీడా పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-తిమ్మాపూర్: క్రీడలు యువత వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని, ఆరోగ్య, ఉత్తేజకరమైన జీవితాన్ని అందించడంలో క్రీడలు కీలకపాత్ర, ముఖ్య భూమిక పోషిస్తాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఖేలో కరీంనగర్.. జీతో కరీంనగర్' పార్లమెంట్ స్థాయి క్రీడోత్సవాల సందర్భంగా శనివారం తిమ్మాపూర్ మండలంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో మానకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. క్రీడా ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో , క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు కల్పించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోడీ 'ఖేలో ఇండియా..జీతో ఇండియా' పేరిట ప్రతి నగరం , పట్టణంలో క్రీడా ఉత్సవాలు నిర్వహించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో పార్లమెంట్ స్థాయి నియోజక వర్గ క్రీడా పోటీలను కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రాల్లో ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. క్రీడా పోటీల నిర్వాణ కన్వీనర్ కళ్లెం వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ..క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్, అట్లాంటిక్ ఈవెంట్లతో కూడిన క్రీడా కార్యక్రమాలు ఈనెల 20 వరకు కొనసాగుతాయన్నారు. మానకొండూర్ అసెంబ్లీ నియోజక వర్గ క్రికెట్ క్రీడా పోటీల్లో శంకరపట్నం, గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ క్రీడోత్స వాల కన్వీనర్ కళ్లెం వాసుదేవ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, గుర్రాల వెంకటరెడ్డి, మాడ వెంకట రెడి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మానకొండూర్ నియోజక వర్గం అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి,సెన్సార్ బోర్డు సభ్యులు దరువు ఎల్లన్న, గడ్డం నాగరాజు సొల్లు అజయ్ వర్మ, శంకరపట్నం మండల అధ్యక్షులు శంకర్, అనిల్, ఆంజనేయులు, అనిల్, తిరుపతి రెడ్డి, నికేష్, శేఖర్, రాజు బీజేపీ, బీజేవైఎం జిల్లా పదాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలతో అతివల జీవనోపాధికి ఊతం

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు
- ఘనంగా మహిళ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కోరుట్ల: స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా కోరుట్ల కేంద్రంలో అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వడ్డీలేని రుణాలతో మహిళలు ఆర్థికంగా ప్రయోజనం పొందుతారని అన్నారు. ప్రతి మహిళా స్వశక్తితో ఎదిగేలా ఊతమివ్వడానికే రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. సీఎం కేసీఆర్ స్త్రీలు అన్ని రంగాల్లో ముందుండాలని, ఎన్నో కార్యక్రమాలు రూపకల్పన చేసి చిత్తశుద్ధితో అమలు పరిచి ఆడబిడ్డల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపుతున్నారని వెల్లడించారు. ముఖ్యమంత్రి శిష్యులుగా ప్రభుత్వంలో ఒక ముఖ్య పాత్రలో ఉన్న తామంతా కూడా మహిళల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య అనిల్, గడ్డమీది పవన్, కమిషనర్ అయాజ్, కౌన్సిలర్లు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శ్రీ చైతన్య కళాశాల ప్రాంగణ నియామకాల్లో 8 మంది విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-తిమ్మాపూర్: మండలంలోని మహాత్మా నగర్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఇటీవల నిర్వహించిన 'హోం ఫస్ట్ ఇండియా' కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల విజ్ఞానంతో పాటు సాధన నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రదర్శించాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం 5.25 లక్షలు ఉంటుందని కంపెనీ ప్రతినిధి ఇమ్రాన్ తెలిపారు. నియామక ప్రక్రియలో భాగంగా నిర్వహించిన రాత పరీక్ష, మౌఖిక పరీక్ష, టెక్నికల్ ఇంటర్వ్యూ ఆధారంగా ప్రతిభ చూపిన 8 మంది విద్యార్థులను రిలేషన్ షిప్ మేనేజర్స్‌గా ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులు 'హోమ్ ఫస్ట్ ఇండియా' కంపెనీలో ఉద్యోగ నియమాలకు కట్టుబడి ఉండాలని, వారు చేస్తున్న ఉద్యోగానికి న్యాయం చేయకూర్చాలని కోరారు. అదే విధంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. మేనేజ్మెంట్ ప్రతి విషయంలో విద్యార్థిని విద్యార్థులకు సహకరిస్తూ ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు 'బహిరంగ లేఖ'

- బుగ్గారం సర్పంచ్, ఆమె భర్త లను సస్పెండ్ చేయాలని డిమాండ్

నవతెలంగాణ-జగిత్యాల: జగిత్యాల జిల్లా బుగ్గారం సర్పంచ్ మూల సుమలత, ఆమె భర్త మూల శ్రీనివాస్ గౌడ్‌ల అవినీతి-అక్రమాలు, అరాచకాలపై, జీపీ నిధుల దుర్వినియోగంపై శనివారం బుగ్గారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు బహిరంగ లేఖ విడుదల చేశారు. గత డిసెంబర్ 27నే మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు సామాజిక కార్యకర్త, హక్కుల-ఆర్టీఐ ఆక్టివిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ ఉద్యమకారుడు, వీడీసీ కోర్ కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి రిజిష్టర్ పోస్ట్ ద్వారా ఒక లేఖను పంపినట్లు సూచించారు. మాజీ ఉప సర్పంచ్ చుక్క శ్రీనివాస్‌ను, ఇతర నాయకులను, ప్రజా ప్రతినిధులను, అధికారులను మచ్చిక చేసుకొని బుగ్గారం గ్రామ పంచాయతీలో రెండు కోట్లకు పైగా నిధులు డ్రా చేసి, కోటికి పైగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆ లేఖలో ఆరోపించారు. వీరంతా కలిసికట్టుగా వారి పదవులను, వారికున్న అధికారాన్ని, పార్టీ బలాన్ని, అక్కడక్కడ మంత్రి పేరును కూడా ఉపయోగించుకొని నిధుల దుర్వినియోగమే కాకుండా పంచాయతీల పేరుతో, అధికారుల లంచాల పేరుతో, ప్రయాణ ఖర్చుల పేరుతో పలు రకాలుగా ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై పగలు - ప్రతీకారాలు పెంచుకొని, కుట్రపూరితంగా, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని లేఖలో వివరించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ తక్షణమే స్పందించి వెంటనే బుగ్గారం సర్పంచ్ మూల సుమలత, ఎస్ఎంసీ చైర్మన్ మూల శ్రీనివాస్ గౌడ్‌తో పాటు వారి వెనుక ఉన్న వారిని పదవుల నుండి, బీఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేసి పూర్తిగా తొలగించాలని లేఖలో డిమాండ్ చేశారు.

సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి

- స్త్రీనిధి రాష్ట్ర డివిజనల్ మేనేజర్ ఎం.వేణుగోపాల్



నవతెలంగాణ-జగిత్యాల : మహిళ సంఘాలకు స్త్రీనిధి, సెర్ప్ ద్వారా సౌర విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసుకొని విద్యుత్తు ఖర్చును తగ్గించుకుని పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని స్త్రీనిధి రాష్ట్ర డివిజనల్ మేనేజర్ ఎం.వేణుగోపాల్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ గ్రామంలో మహిళ సంఘాల సభ్యులకు ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 125 దరఖాస్తులు వచ్చాయని అందులో 75 వరకు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేశామని అన్నారు. జగిత్యాల జిల్లాలో 25 వరకు దరఖాస్తులు వచ్చాయని, అందులో ఎక్కువగా జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో 9, కోరుట్ల రూరల్ మండలంలో 2 యూనిట్లు పెట్టినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సంబంధిత మండల ఏపీఎంని, స్త్రీనిధి మేనేజర్‌ని లేదా గ్రామంలో ఉన్న వి.ఓ.ఏలను సంప్రదించాలని కోరారు. రాష్ట్రంలోనే కల్లెడ గ్రామంలో మొదటి సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం అభినందనియమన్నారు. జిల్లా స్త్రీనిధి ఆర్.ఎ ఆనందరావు, సర్పంచ్ జె.మహేశ్వరరావు, ఎంపీటీసీ సి.హెచ్.పరుశారం, ప్యాక్స్ చైర్మన్ ఏ.సందీప్ రావు, మండల ఏపీఎం వి.గంగాధర్, స్త్రీనిధి మేనేజర్ రాణి, వీఓఏలు సి.హెచ్.రమ, కె.మీరబాయి, యూనిట్ సభ్యురాళ్లు కె.హేమలత, జె.అరుణ, వై.రమాదేవి, ఆర్.రామ, సి.హెచ్ గంగోత్రి ఉన్నారు.

'జీపీ నిధుల దుర్వినియోగం' పై విచారణ

- లోకాయుక్త (కోర్టు), కలెక్టర్ ల ఆదేశాలు జారీ
- పోలీస్ బందోబస్తు కోరిన ఫిర్యాదు దారుడు చుక్క గంగారెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల: జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామ పంచాయతీలో జరిగిన 'నిధుల దుర్వినియోగం', ఇతర అంశాలపై ఈనెల 14న విచారణ జరుగనుంది. లోకాయుక్త (కోర్టు), కలెక్టర్ పంచాయతీ విభాగం జగిత్యాల నుండి జారీ అయిన ఆదేశాల మేరకే ఈ విచారణ కొనసాగనుందని చుక్క గంగారెడ్డి తెలిపారు. లోకాయుక్త జారీ చేసిన ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ కూడా ఆదేశాలు జారీ చేస్తూ విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా పంచాయతీ అధికారులకు సూచించారు. ఈ మేరకు మెట్‌పల్లి డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయం నుండి విచారణకు నోటీసులు జారీ చేశారు. విచారణ సమయంలో ఎలాంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు, రాజకీయ పరిణామాలు చోటు చేసుకోకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని బుగ్గారం పోలీసులకు చుక్క గంగారెడ్డి వినతి పత్రం అందజేశారు.

పీఆర్సీ 2020 బిల్లు చేసుకోని వారికి అవకాశం

నవతెలంగాణ-జగిత్యాల: పీఆర్సీ 2020 ఫిక్సేషన్ బిల్లు ఇంతవరకు చేసుకోని ఉద్యోగులకు ఈ నెల 31 తేదీలోగా తప్పనిసరిగా చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ మెమో నెంబర్ 3037/2022 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అన్ని ప్రభుత్వ శాఖల హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ అధికారులకు, అన్ని జిల్లాల కలెక్టర్లకు, ట్రెజరీ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారని ఉద్యోగుల, పెన్షనర్స్ సమాచారం కోసం హరి ఆశోక్ కుమార్ తెలిపారు.

లక్ష్యాల సాధనలో ముందుండాలి

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

నవతెలంగాణ-కరీంనగర్: విద్యార్థులు సమాజంలో ఉన్నత లక్ష్యాలతో ఉండాలని, లక్ష్యాలను సాధించి ముందంజలో ఉండాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం రేకుర్తిలోని ఒక ప్రైవేట్ వేడుక మందిరంలో 'ఆల్ఫోర్స్ విగోర్-2023' వేడుకలకు (పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం) నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, సరస్వతి మాత విగ్రహానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థికి సామర్థ్యం, దానికి తోడుగా తెలివి ఉంటుందని, వీటిని ఎవరూ కల్పించరని కేవలం వ్యక్తిగత శ్రద్ధతో, ఏకాగ్రతతో పొందుతారని చెప్పారు. అనంతరం నరేందర్ రెడ్డిని విద్యార్థులు శాలువా, గజమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. తోటి ఉపాధ్యాయులకు జ్ఞాపికలను ప్రదానం చేసి గురు భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద కాలువ మట్టి మాయం

నవతెలంగాణ-మేడిపల్లి: మండలంలోని వల్లంపల్లి గ్రామంలో వరద కాలువను ఆనుకుని, స్మశాన వాటికకు సమీపంలో ఉన్న వరద కాలువ మట్టిని గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా గుట్టు చప్పుడు కాకుండా మాయం చేసి సొమ్ము చేసుకున్నారు. గతంలో తక్కలపెల్లి గ్రామ శివారులో మట్టి కుప్పలు కూలి పలువురు కూలీలు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. పలువురు పలు అభివృద్ధి పనుల పేర్లతో రాత్రి వేళల్లో మాయం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టకుండా పూర్తి అనుమతులతో మాత్రమే అనుమతించాలని గ్రామ ప్రజలు కోరుచున్నారు.


మాయమైన వరద కాలువ మట్టి

ఎస్సీ వర్గీకరణకు మద్దతివ్వండి

రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించిన పులింటి స్వామి

నవతెలంగాణ-మెట్‌పల్లి: ఎస్సీ వర్గీకరణకు మద్దతు కోరుతూ దళిత సమైక్య ప్రజా సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పులింటి స్వామి కుమార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపి బిల్లు పెట్టేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ బిల్లు పాస్ అయితే ఎస్సీల్లోని వెనుకబడిన కులాల వారికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి రవి, గడ్డం సుదర్శన్, సమ్మయ్య, శివకుమార్, భుజంగం, రామచంద్రం, నవీన్ కుమార్, రాజయ్య, సుధాకర్, బొందయ్య భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ-చొప్పదండి: క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని వెదురుగట్టు గ్రామంలో వెదురుగట్టు మాజీ సర్పంచ్, స్వర్గీయ గుడిపాటి నరసింహా రెడ్డి స్మారకార్థం ఉమ్మడి కరీంనగర్ జిల్లా గ్రామీణ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను గ్రామ సర్పంచ్ గుడిపాటి సుచరితా దేవి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ముఖ్య అతిథిగా హాజరై క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేసిందన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీలు నిర్వహిస్తున్న సర్పంచ్‌ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పెంచాల రమ్య, అంజయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

చెర్ల కొండాపూర్‌లో ఘనంగా రథోత్సవం

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-రాయికల్: మండలంలోని చెర్ల కొండాపూర్ గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మోర హనుమాన్లు, ఎంపీపీ లౌవుడియ సంధ్యారాణి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల రాజ్యలక్ష్మి, లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ సాయి రెడ్డి, టీఆర్ఎస్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోల శ్రీనివాస్, రవీందర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపిరాజ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు గుర్రం మహేందర్, తలారి రాజేష్, మాజీ ఎంపీటీసీ తలారి నాగమణి, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ

విజ్ఞాన్ స్కూల్‌లో 'కళా జ్ఞాన తృష్ణ'

నవతెలంగాణ-కరీంనగర్ : కరీంనగర్‌లోని స్థానిక విద్యానగర్‌లో ఉన్న విజ్ఞాన్ హై స్కూల్‌లో విద్యార్థుల్లో ప్రతిభా పాటవాన్ని పెంచేందుకు కళా జ్ఞానం తృష్ణ అభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి తరగతిలో కొంతమంది విద్యార్థులు పాల్గొని, ఆయా రంగాల్లో వారి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విద్యానగర్, ఆరేపల్లి, మల్యాపూర్, చింతకుంట గ్రామాల నుంచి జనం, పుర ప్రముఖులు తండోప తండాలుగా వచ్చి తిలకించి పిల్లలను ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థులను యాజమాన్యం వారు అభినందించారు. సహకరించిన ఉపాధ్యాయ వర్గాన్ని కొనియాడారు.


విజ్ఞాన ప్రదర్శనలో విద్యార్థులు

అన్ని రంగాల్లో ముందున్న మహిళలు

నగరపాలక కమిషనర్ సేవా ఇస్లావత్



మారథాన్ 2కె రన్‌లో కమిషనర్ సేవా ఇస్లావత్, తదితరులు

నవతెలంగాణ-కరీంనగర్ : మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని నగరపాలక కమిషనర్ సేవా ఇస్లావత్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ మహిళ వారోత్సవాల్లో భాగంగా శనివారం నగరపాలక సంస్థ మహిళా కార్పొరేటర్లు, ఉద్యోగులు, మెప్మా మహిళా సంఘాల సభ్యులు మారథాన్ 2కే రన్ నిర్వహించారు. కమిషనర్ సేవా ఇస్లావత్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి 2కే రన్‌ను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. జ్యోతి బాపూలే గ్రౌండ్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు పెద్దఎత్తున మహిళా కార్పొరేటర్లు, ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో చిరు ధాన్యాల వంటకాల పోటీలు నిర్వహించారు. నగరపాలక సంస్థ మహిళా ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు వివిధ రకాల రుచులతో కూడిన వంటకాలను చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు, ఉద్యోగులు, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-తిమ్మాపూర్: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం దేవక్కపల్లి గ్రామానికి చెందిన పంజాల రాజేశం (50) సమీపంలోని చల్మెడ ఫీడ్స్ కంపెనీలో కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయిన రాజేశం శనివారం ఉదయం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామ శివారులో కాకతీయ కాలువలో శవమై తేలాడు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకు రావడం చూసిన స్థానికులు ఎల్ఎండీ ఎస్ఐకి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ అక్కడకు చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి మృతదేహం ఆనవాళ్లను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తి కుటుంబ సభ్యులు గమనించి శనివారం సాయంత్రం ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించారు. తమ కుటుంబ సభ్యుడిగా ధృవీకరించారు. మృతుని కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్ రెడ్డి తెలిపారు.

సాయి మానేరులో అలరించిన పది విద్యార్థుల ఫేర్‌వెల్

నవతెలంగాణ-కరీంనగర్ : కరీంనగర్‌లోని స్థానిక మంకమ్మతోటలో గల సాయి మానేరు పాఠశాలలో ఖుదాఫీస్-23 పేరిట పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. వేడుకలను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కష్టపడాలన్నారు. లక్ష్య సిద్ధితో భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకొని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పతకాలను ప్రధానం చేశారు. విద్యార్థులు ఆట పాటలతో నృత్యాలు చేస్తూ కేరింతలు కొడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీత రెడ్డి, ఏఓ, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


ఫేర్‌వెల్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

'బండి'పై భగ్గుమన్న బీఆర్ఎస్ మహిళా శ్రేణులు

దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-కరీంనగర్: ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై అనుచిత వాఖ్యలు చేసిన కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నారు. నగరంలోని స్థానిక తెలంగాణ చౌక్‌లో బండి సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు మాట్లాడుతూ.. ఎంపీ హోదాలో ఉండి మహిళ పట్ల కనీస గౌరవం లేకుండా, సభ్యసమాజం తలదించుకునేలా అసభ్య పదజాలంతో మాట్లాడిన బండి సంజయ్‌ని వెంటనే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ మహిళా శ్రేణులు

టీబీ పేషెంట్లకు కిట్లు పంపిణీ



నవతెలంగాణ - జగిత్యాల టౌన్ : దేశంలో క్షయ(టీబీ) వ్యాధిని పూర్తిగా నిర్మించాలని ఉద్దేశంతో భారత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం నిక్షయమిత్రలో భాగంగా జగిత్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో 55 మంది టీబీ పేషెంట్లకు ఫుడ్ బాస్కెట్స్ (కిట్లు) పంపిణీ చేశారు. ఒక్క బాస్కెట్లో రెండు ప్రోటీన్ పౌడర్ డబ్బాలు, 5కిలోల బియ్యం,1 కిలో పెసరపప్పు, 1లీటరు మంచి నూనె అందజేశారు. ఇది కేవలం మొదటి విడత మాత్రమేనని ఇక ముందు కూడా వీలైనంత మంది టీబీ రోగులకు ఐఎంఏ ద్వారా తమ సహాయ సహకారాలు అందజేస్తామని అధ్యక్షులు డాక్టర్ తాటిపముల సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుప్పాల శ్రీధర్ మాట్లాడుతూ ప్రజలు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు అందరూ ఒక ఉప్పెన లాగా ముందుకు వచ్చి ప్రతి టీబీ పేషెంట్‌కు తమ వంతు సహాయం చేయాలని, అలాగే టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో పాల్గొని ప్రజల ఆరోగ్యంపైన అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ అజయ్ రెడ్డి, జిల్లా టీబీ అధికారి డాక్టర్ శ్రీనివాస్, అడిషనల్ డీఎంహెచ్వోస్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జైపాల్ రెడ్డి, టీబీ ఆఫీసర్లు డాక్టర్ గీతిక, డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు దుర్మరణం

ఒకరికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలం వద్ద మరణించిన కొలిపాక మల్లేశం

నవతెలంగాణ-గంగాధర : ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గంగాధర మండలం కురిక్యాల గ్రామ ప్రభుత్వ పాఠశాల సమీపంలోని కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో కొలిపాక మల్లేశం అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నేరెళ్ల సత్తయ్య ప్రాణం వదిలారు. గంగాధర మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల సత్తయ్య (55) అనే వ్యక్తి చొప్పదండి మండలం చాకుంటలో జరిగిన తన మనవరాలు 21వ రోజు ఫంక్షన్ వెళ్లి స్వగ్రామం వస్తుండగా, రామడుగు మండలం గోలిరామయ్యపల్లికి చెందిన కొలిపాక మల్లేశం (56) అనే వ్యక్తి సిరిసిల్ల నుండి తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్యాషన్ ప్రోపై వస్తున్న సత్తయ్య, టీవీఎస్ బైక్‌పై వెళ్తున్న మల్లేశం ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. ఈ దుర్ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు మృత్యుఒడికి చేరగా, మృతుడు మల్లేశం కుమారుడు శ్రీకాంత్ (32) తీవ్రంగా గాయపడ్డాడు. నేరెళ్ల సత్తయ్య గీత వృత్తి చేసుకుని జీవిస్తుండగా, మల్లేశం హోటల్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. మృతులిద్దరికి భార్యలు, పిల్లలు ఉన్నారు. బైక్‌లు ఢీకొని ఇద్దరు మరణించిన సంఘటన ఆయా గ్రామాల్లో విషాదాన్ని నింపింది. గంగాధర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో కులవృత్తులు దెబ్బతిన్నాయి

- ఏ వర్గ ప్రజలూ సంతోషంతో లేరు
- ప్రజల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై తీవ్ర అసంతృప్తి ఉంది
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి


మెట్‌పల్లి 03: మార్కెట్ యార్డులో పసుపును పరిశీలిస్తున్న రేవంత్ రెడ్డి

నవతెలంగాణ -మెట్ పల్లి : రాష్ట్రంలో ఏ వర్గ ప్రజలూ సంతోషంతో లేరని, కులవృత్తులు దారుణంగా దెబ్బతిన్నాయన్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ప్రజల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై తీవ్ర అసంతృపిస్తోందంటూ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా శనివారం మెట్‌పల్లి మార్కెట్ కమిటీలో పసుపు రైతులను కలిసిన ఆయన పసుపుకు అందుతున్న మద్దతు ధర గురించి ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు కేసీఆర్ చెప్పినట్లు వినడం తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణాలో ని సబ్బండ వర్గాల ప్రజలు ఏ ఒక్కరు సంతోషంగా లేరన్న విషయం తాను చేపట్టిన ఈ యాత్రకు అన్ని వర్గాల ప్రజలనుండి లభిస్తున్న మద్దతు తెలుపుతుందని, ఎవర్ని అడిగినా ఎమ్మెల్యేల అరాచకాలే చెబుతున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎన్నికలప్పుడు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రజలు, రైతులు గుర్తుచేస్తున్నారన్నారు. మహిళా సంఘం సభ్యులకు పావలా వడ్డీ చెల్లించకుండా మోసం చేసిన సర్కారు ఎన్నికలు దగ్గరపడుతుండటంతో పావలా వడ్డీని ఇస్తామంటూ మహిళా సంఘ సభ్యులను మభ్యపెట్టేందుకు ఎత్తుగడ వేసిందన్నారు. ప్రభుత్వం సబ్సిడీలు పూర్తిగా ఎత్తివేయడంతో కులవృత్తులు దారుణంగా దెబ్బతింటున్నాయన్నారు. దీంతో కులవృత్తులవారు ఉపాధికోసం వలస వెళ్తున్నారన్నారు. ఈ యాత్రలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-పెట్టీ కేసు ద్వారా నేర ప్రవృత్తి అదుపు

- సాక్షాధారాలతో శిక్షలు పడేలా పకడ్బందీ చర్యలు
- పెట్టీ కేసు బుక్ అయినా పాస్ పోర్ట్ రాదు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు అనర్హులు
- ఫిబ్రవరిలో 349ఈ పెట్టి కేసులు నమోదు
- జగిత్యాల ఎస్పీ శ్రీ ఎగ్గడి భాస్కర్



నవతెలంగాణ - జగిత్యాల టౌన్ : జిల్లా పరిధి లో చిన్న చిన్న నేరాలకు పాల్పడుతున్న వారిని అంతటితోటే వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి, కట్టడి చేయడానికి, భవిష్యతులో పెద్ద నేరాలు చేయకుండా నివారించడానికి ఈ పెట్టి కేసులు నమోదుచేయడం చేస్తున్నట్టు ఎస్పీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. చిన్న నేరాల చేసినప్పుడే కేసు నమోదు చేసి, కౌన్సిలింగ్ నిర్వహించి వారిని సక్రమ మార్గంలో నడపడానికి జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రతి నెలా జరిగే సమావేశంలో దిశానిర్దేశం చేస్తున్నట్టు తెలిపారు. ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించే వారిపై వారి నడవడికలో మార్పు తేవడానికి కౌన్సిలింగ్ నిర్వహించడంతో నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. బ్లూ కోర్ట్స్ పెట్రో కార్ సిబ్బంది విధినిర్వహణలో ఉన్నప్పుడు వారికి అందజేసిన అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ట్యాబుల్లో ఫోటో తీసి అప్లోడ్ చేస్తే వెంటనే కేసు నమోదు అవుతుందన్నారు. ఈ విధంగా ఫిబ్రవరి నెలలో 312 మందిపై నమోదైన పెట్టి కేసుల్లో వారికి కోర్ట్ ద్వారా జరిమానాలు విధించడం జరిగిందన్నారు.

పోచమ్మ బోనాలు


మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-కరీంనగర్ : కరీంనగర్ గౌడ సంఘం నేతలు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోడూరు సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పాల్గొని బొమ్మకల్ బైపాస్ రోడ్డులోని రేణుకాదేవి ఎల్లమ్మ బోనాల జాతర కార్యక్రమ వివరాలు తెలిపారు. ఎల్లమ్మ ఆలయ బోనాల పండుగ పూజలు ఏప్రిల్ 23 నుంచి 26వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 5న అమ్మవారి ఉత్సవ విగ్రహ గంగస్నానం, ఏప్రిల్ 6 నుంచి 22వ తేదీ వరకు జోగు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 23న పోచమ్మ బోనాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు భూమాగౌడ్, గుగ్గిళ్ల శ్రీనివాస్ జయశ్రీ, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ పొన్నం అనిల్ కుమార్, కోడూరు మహేందర్ గౌడ్, మాచెర్ల ప్రసాద్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కిరణ్ గౌడ్, గౌడ నాయకులు పాల్గొన్నారు.

మంత్రాల నెపంతో వేధిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-మల్యాల : మంత్రాల నెపంతో వేధిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ చిరంజీవి హెచ్చరించారు. మల్యాల మండలంలోని బల్వంతాపూర్ గ్రామంలో బండారి లచ్చవ్వ అనే వృద్ధురాలిపై మంత్రాల నెపంతో దాడి చేసిన కేసులో కుమారుడు గంగయ్య ఫిర్యాదు మేరకు ఎండీ దస్తగిరి, ఇబ్రహీంలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. భవిష్యతులో ఎవరైనా మంత్రాల నెపంతో దాడికి చేసినా, దూషించినా, మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ - రాయికల్ : 33కేవీ లైన్ విద్యుత్ మరమ్మతుల కారణంగా రాయికల్ మండలంలోని వీరాపూర్, వడ్డే లింగాపూర్,ఇటిక్యాల,తాట్ల వాయి సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీఈ హరీష్, ఏఈ అర్జున్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. విద్యుత్ మరమ్మతుల సమయంలో రైతులు, వినియోగదారులు అధికారుల పర్యవేక్షణ లేకుండా ఎలాంటి విద్యుత్ పనులను చేపట్టరాదన్నారు.

'బండి'పై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు


కోరుట్లలో ..


కొడిమ్యాలలో..


శంకరపట్నంలో..


తిమ్మాపూర్‌లో..

కోరుట్ల: పట్టణంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ యువజన సంఘం నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని, వెంటనే బేషరతుగా కవితకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శనివారం మండల శాఖ అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సామల లక్ష్మణ్, రైతుబంధు అధ్యక్షులు అంకం రాజేశం, పట్టణ అధ్యక్షులు కొత్తూరు స్వామి, గంగారం తండా సర్పంచ్ బొజ్యా నాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నేరెళ్ల మహేష్, నాయకులు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, గంగుల మల్లేష్ యాదవ్, బల్కం మల్లేష్ యాదవ్, ఒల్లాల లింగా గౌడ్, పార్లపల్లి ప్రభుదాస్, కోలాపురం రమేష్, బైరి వెంకటి, మొగిలిపాలెం రమేష్, దుబ్బాక నారాయణ, పర్లపల్లి ఆనందం, కాయితం రాజు, సుంకె నరేష్, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంట మైపాల్ ఆధ్వర్యంలో శనివారం ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవితపై అనుచిత వాఖ్యలు చేయడం సరైంది కాదని, వెంటనే బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బండి సంజీవ్‌పై కేశవపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ పులికోట రమేష్, మండల అధ్యక్షుడు గంట మైపాల్, కొత్తగట్టు ఆలయ చైర్మన్ సాగి మలహాలు రావు, బీఆర్ఎస్ నాయకులు ఉమ్మెత్తల సతీష్ రెడ్డి, బొజ్జ సుధాకర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ మండల రైతు సమితి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అల్గునూర్ చౌరస్తాలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను మానకొండూర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌ను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి.. ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు రావుల రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్లు, ఉప సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ మండల నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు, జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్ మాట్లాడుతూ... సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇక ముందు బీఆర్ఎస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే బండి సంజయ్‌ను గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు అమీరుల్లా ఖాన్, నెల్లి మురళి, పిట్టల మధు, ఉండింటి శ్యామ్సన్, ఎరుకల శ్రీనివాస్ గౌడ్, పార్నంది కిషన్, శాతారాజు యాదగిరి, పిండి సందీప్, కొండ్ర వెంకటస్వామి, రాయికంటి కిరణ్, ఆరెల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: మెట్‌పల్లి పాత బస్టాండ్‌లో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఎమ్మెల్సీ కవితకు.. బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రానా వేణి సుజాత సత్యనారాయణ , వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర రావు, ఎంపీపీ మారుసాయి రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి కోఆప్షన్ మార్గం గంగాధర్, కౌన్సిలర్స్ వనజ, గంగాధర్, బుచ్చిరెడ్డి, మన్నే కాన్, సుధాకర్ గౌడ్ నవాబ్, సలీం పారిపెల్లి రమేష్, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ లావుడియా సంధ్యారాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి మాట్లాడుతూ .. ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కోల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తలారి రాజేష్, రాయికల్ యూత్ పట్టణ అధ్యక్షులు రామ్మూర్తి, కౌన్సిలర్లు తురగ శ్రీధర్ రెడ్డి, మారంపల్లి సాయికుమార్, మహేందర్, సర్పంచ్ అనుపురం శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఉదయశ్రీ, రాజారెడ్డి, నాయకులు సురేందర్ నాయక్, మహేందర్ బాబు, రాజారెడ్డి, హుస్సేన్, వేణు,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర : ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఎంపీ బండి సంజయ్‌ని వెంటనే ఆరెస్టు చేయాలని, మంచి పదవిలో ఉండి మహిళా ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన విషయమంటూ మండి పడ్డారు. ఎంపీపై కేసు నమోదు చేయాలని స్థానిక ఎస్సైకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సర్పంచ్‌లు మడ్డపల్లి గంగాధర్, వేముల దామోధర్, జోగు లక్ష్మీరాజం, చంద్రయ్య, ఏఎంసీ ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు సురేందర్, వేముల అంజి, రేండ్ల శ్రీనివాస్, బొల్లాడి శ్రీనివాసరెడ్డి, చిలుముల రమేశ్, వడ్లూరి ఆదిమల్లు, బెజ్జంకి కళ్యాణ్, మ్యాక వినోద్, ద్యావ సంజీవ్, తిరుపతి, పిట్టల మల్లారెడ్డి, రఘు, శ్రీకాంత్, మోహన్, శంకర్ పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితపై తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆదేశానుసారం స్థానిక తహసీల్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.


జగిత్యాలలో..


తిమ్మాపూర్ ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు


మానకొండూర్‌లో..


మెట్‌పల్లిలో..


రాయికల్‌లో..


గంగాధరలో..

మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి..

నవతెలంగాణ - గోదావరిఖని



మహిళలు క్యాన్సర్‌కు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషా కుమార్ అన్నారు. ఎన్టీపీస ధన్వంతరీ ఆసుపత్రిలో దీప్తి మహిళా సమితి ఆధ్వర్యంలో స్త్రీ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషా కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి చెందిన సర్జికల్ గైనకాలజిస్ట్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సాయి లక్ష్మి దాయన అవగాహన ప్రసంగం చేశారు. అనంతరం దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషా కుమార్, సీఎంవో డాక్టర్ లక్రీపా మాట్లాడారు.

గ్రామాల్లో బెల్ట్ షాపుల జోరు..

- ఏరులై పారుతున్న మద్యం
- అధిక ధరలకు అమ్మకాలు
- బార్‌లను తలపిస్తున్న పర్మిట్ రూమ్‌లు..





నవతెలంగాణ - తంగళ్ళపల్లి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో తాగునీరు లభించని గ్రామం ఉందేమో కానీ.. మద్యం దొరకని ఊరంటూ ఏదీ లేదు.. ఎవరికైనా అనారోగ్యం ఉంటే మెడికల్ షాప్‌కు వెళ్లి మందులు కొనాలంటే కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి.. రాత్రయితే మెడిసిన్లు దొరకవు కానీ అర్ధరాత్రి అయినా సరే గ్రామాల్లో మద్యం దొరుకుతుంది. అంటే ఏ స్థాయిలో మద్యం అమ్మకాలు జరుగుతున్నాయో అర్థంచేసుకోవచ్చు. విపరీతమైన అమ్మకాలు చేస్తూ ప్రజల చేత బలవంతంగా ప్రభుత్వమే మద్యం తాగిస్తుందనే ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు మద్యం దుకాణాల్లో పర్మిట్‌రూమ్‌లు బార్‌లను తలపిస్తున్నాయి.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 255 గ్రామాలు ఉన్నాయి. మూడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. సిరిసిల్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 18, వేములవాడ పరిధిలో 16, ఎల్లారెడ్డిపేట పరిధిలో 14 మొత్తం 48 మద్యం దుకాణాలకు అనుమతి ఉంది. కాని అంతకు దాదాపు పదిరెట్లు ఎక్కువగా 450కిపైగా బెల్ట్ షాపుల నిర్వహణ సాగుతుంది. ప్రతి గ్రామంలో రెండు నుంచి నాలుగు బెల్ట్‌షాపులు ఉన్నట్టు సమాచారం.

మండలం	గ్రామాలు	వైన్స్‌లు	బెల్ట్ షాపులు
సిరిసిల్ల	8	20	1
తంగళ్ళపల్లి	30	4	60
ఇల్లంతకుంట	33	3	64
ఎల్లారెడ్డిపేట	24	4	56
వీర్నపల్లి	17	1	34
గంభీరావుపేట	21	3	30
ముస్తాబాద్	24	3	35
కోనరావుపేట	28	3	60
వేములవాడ అర్బన్	11	2	20
వేములవాడ రూరల్	17	2	20
బోయినపల్లి	23	3	36
చందుర్తి	18	2	70
రుద్రంగి	10	2	10

విచ్చలవిడిగా అమ్మకాలు

బెల్టుషాపుల ద్వారా గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. రాత్రీ పగలు తేడా లేకుండా అమ్మకాలు చేస్తున్నారు. వీటి నిర్వాహకులకు లైసెన్సు కలిగిన దుకాణాల వారే మద్యం సరఫరా చేస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. దీంతో వారికి గంపగుత్తగా అమ్మకాలు జరిగి అధిక లాభం చేరుకుంది. అలాగే కొందరు దుకాణాల వారే పలుచోట్ల బెల్ట్ షాపులు ఏర్పాటు చేసినట్టు సమాచారం. కిరాణం షాపులు, టీస్టాల్స్‌లో కూడా మద్యం అమ్ముతున్నారు. ఈ బెల్టుషాపుల నిర్వహణ పూర్తిగా సిండికేట్ వైన్సుల ఆధ్వర్యంలోనే నడుస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరి స్తున్నట్టు బహిరంగానే విమర్శలు వస్తున్నాయి. ఇష్టానుసారంగా ధరలు పెంచి విక్రయిస్తున్నారు. రూ.30ల నుండి రూ.50 ల వరకు అధికంగా తీసుకుంటున్నారు. ఒక ఫుల్‌బాటిల్ మందుకు సుమారు రూ.80, బీరుకు రూ.30 వరకు అదనంగా బెల్టుషాపులలో విక్రయాలు జరుగుతున్నాయి.

పెరుగుతున్న నేరాలు..

మద్యం మత్తులో అనేక నేరాలకు పాల్పడతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. మద్యం తాగే చోటనే హత్యలకు పాల్పడుతున్నారు. ఆత్మహత్యలు చేసుకునే వారు కూడా కొందరు మద్యం మత్తులోనే తాను ఏం చేస్తున్నానో కూడా తెలియకుండా పలు సంఘటనలకు కారణమవుతున్నారు. ఇక రోడ్డు ప్రమాదాలకు కూడా మద్యం కారణంగా ఉంది.

బార్‌లను తలపిస్తున్న పర్మిట్ రూములు

బార్‌లను తలపించేలా పర్మిట్ రూము ల నిర్వహణ కొనసాగుతుంది. జిల్లాలో ఉన్న ప్రతి వైన్స్‌కు అనుబంధంగా పర్మిట్ రూమును ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసింది. అక్కడ మద్యం సేవించేవారు నిలబడే మద్యం సేవించి వెళ్లిపోవాలి. కానీ నిర్వాహకులు మాత్రం బార్లను తలపించే మాదిరిగా టేబుళ్లు, బెంచీలు వేసి మరి సిట్టింగ్ ఏర్పాటు చేశారు.

ఫిర్యాదు వస్తే చర్యలు.. ఎప్పటికప్పుడు దాడులు..

పంచాక్షరి, ఎక్సైజ్ సూపరిండెంట్ రాజన్న సిరిసిల్ల జిల్లా

రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా ఏ గ్రామం నుండి అయినా సరే బెల్ట్ షాపులపై ఫిర్యాదు వచ్చిన వెంటనే దాడులు నిర్వహించి సంబంధించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. అంతేకాకుండా మా దృష్టికి వచ్చిన వాటిపై కూడా ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నాం. వైన్ షాపుల వద్ద నిర్వహించే పర్మిట్ రూములకు ఎలాంటి నిబంధనలు లేవు. ఎక్కడైనా సరే వైన్ షాపులల్లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవు. మద్యం షాపుల్లో ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువ అమ్మినా మాకు సమాచారం ఇవ్వండి.

ఏ రాత్రి అయినా మద్యం దొరుకుతుంది

జలగం ప్రవీణ్ కుమార్
కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తంగళ్ళపల్లి



ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైన్స్ షాపులు ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నిర్వహిస్తారు. రాత్రి పది దాటాక వైన్ షాపులు మూసివేస్తే మద్యం దొరకదు. రాత్రి అయితే మెడికల్ షాపుల్లో మందులు దొరకవు. కానీ గ్రామాల్లో ఉన్న బెల్టు షాపుల్లో అర్ధరాత్రి 12 గంటలకు అయినా సరే బెల్ట్ షాపులో తలుపు కొడితే చాలు మద్యం దొరుకుతుంది. అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

అధికారులు స్పందించాలి

మహేష్ - మద్దిమల్ల, వీర్నపల్లి మండలం



గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులో మద్యం ఏరులై పారుతోంది. తాగడానికి నీళ్లు దొరకడం లేదు కాని ప్రతీ గ్రామంలో మద్యం దొరుకుతుంది. బెల్ట్ షాపు లో విచ్చల విడిగా అమ్ముతూ ఇష్టానుసారంగా అధిక ధరలకు మద్యం విక్రయించి దోచుకుంటున్నారు. కానీ అధికారులు చోద్యం చూస్తున్నట్టు వివరిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కట్టడిచేయాలి.

ఉత్పత్తితో పాటు కార్మిక సంక్షేమంపై దృష్టి సారించాలి

సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

నవతెలంగాణ - గోదావరిఖని

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తితో పాటు కార్మిక సంక్షేమంపై యాజమాన్యం దృష్టి సారించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఆర్జీ-1 పరిధిలోని జీడికె 11వ గనిలో ఆరెపల్లి రాజమౌళి అధ్యక్షతన శనివారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 2వ గని నుంచి 11వ గని వరకు రోడ్డు వెడల్పు తక్కువ ఉడటం వలన పెద్ద వెహికిల్స్ వచ్చినపుడు కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, లైట్స్ సరిగ్గా లేవని, మంచి నీటి సమస్య చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ సమస్యలపై సీఐటీయూ గత రెండు సంవత్సరాలనుండి పోరాటం చేస్తుందని అన్నారు. ఆర్ఓ ప్లాంట్ కూడా అందరికి అందుబాటులో లేవని, రిటైర్డ్ కార్మికుల హెల్త్ కార్డు ప్రైవైట్ హాస్పిటల్స్‌కు వెళ్తే కార్డు లో డబ్బులు లేవని ట్రీట్మెంట్ చేయడం లేదని, కంపెనీలో పనిచేస్తున్న కార్మికులను సైతం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు రిఫరల్ చేస్తూ ఆ ఆసుపత్రులకు బిల్లులను సకాలంలో చెల్లించడం లేదని, కార్మికుల జీతంలో నుండి మెడికల్ క్లెయిమ్స్ పేరుతో యాజమాన్యం రికవరీ చేయడం ఏ విధంగా సబబని అన్నారు. ఆర్జీ 1 ఏరియాలో డిప్యూటేషన్ దందా నడుస్తుందని, ప్రమోషన్స్ విషయంలో ఆఫీసర్స్ కు ఒకవిధంగా, కార్మికులకు ఒక విధంగా ఉన్నాయని అన్నారు. వేసవి కాలం వస్తున్నందున గనిపైన ఫ్రిజ్లు రిపేరు చేయించి కార్మికులకు చల్లని నీరు అందుబాటులోకి తీసుకొని రావాలని, మళ్లీ వర్షాకాలం రాకముందే కార్మికుల కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థను, వర్షానికి ఉరిసే క్వార్టర్లు బాగు చేసే దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించి రిపేరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అన్నం శ్రీనివాస్, ఇప్పలపల్లి సతిష్, జంగాలపల్లి, మల్లేష్, జెల్ల గజేంద్ర, బగ్గారం శ్రీనివాసరావు, తిరుపతిరెడ్డి, అహ్మద్, దాసరి సురేష్, మహేందర్ పాల్గొన్నారు.

సిరిసిల్ల వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు వైద్యుల అభినందన

నవతెలంగాణ - సిరిసిల్ల



సిరిసిల్ల వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌ను పలువురు వైద్యులు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెంచలయ్య, జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మురళీధర్, జిల్లా డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ వసంతరావు, సిద్దిపేట వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ చందర్ స్వాగతం పలికి పూల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు.

కేరళ మోడల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ - వేములవాడ



వేములవాడ పట్టణంలోని కేరళ మోడల్ స్కూల్ వార్షిక దినోత్సవ వేడుకలను శనివారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఎంఈఓ బన్నాజీ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు నృత్యాలతో అలరించారు. అనంతరం వివిధ కేటగిరిలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కేరళ మోడల్ స్కూల్ 23వ వార్షికోత్సవ వేడుకలు జరుపుకోవడం సంతోషకరమని, ఎంతోమంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. మండల విద్యాధికారి బన్నాజీ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని వారి భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకోవాలని సూచించారు. కౌన్సిలర్లు రామతీర్థపు కృష్ణవేణి, నరాల శేఖర్, ట్రస్మా టౌన్ ప్రెసిడెంట్ నరాల దేవేందర్, పట్టణ సీఆర్పీలు ఆకుల శ్రీనివాస్, ఎనగందుల నగేష్, కేరళ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ సతి మనోజ్ కుమార్, ప్రిన్సిపాల్స్ నితిన్ రాజ్, సత్య, విశాల్ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎల్‌పీ గనిని సందర్శించిన జీఎం యుజి, మైన్స్, జీఎం సేఫ్టీ

నవతెలంగాణ - రామగిరి



భూగర్భ గనుల జనరల్ మేనేజర్ ఎస్.జగన్ మోహన్‌రావు, రామగుండం రీజియన్ రక్షణ జనరల్ మేనేజర్ ఎస్.సాంబయ్య, ఏపీఏ జనరల్ మేనేజర్ కె.వెంకటేశ్వర్లు శనివారం సింగరేణి అడ్రియాల లాంగ్‌వాల్ గనిని సందర్శించారు. ముందుగా సంబంధిత అధికారులతో యంత్రాల పనితీరు, మొదలగు అంశాలపై చర్చించారు. అనంతరం గని లోపలికి వెళ్లి నడుస్తున్న యంత్రాల పనితీరు, డాస్కో యంత్రాన్ని, పని స్థలాలను పరిశీలించారు. వారి వెంట కమిటీ సభ్యులతోపాటు కార్పొరేట్ డీజీఎం బి.చక్రవర్తి, ఏరియా రక్షణ అధికారి సిహెచ్.వెంకటరమణ, ప్రాజెక్ట్ అధికారి కె.నాగేశ్వరరావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ టి.రఘురాం, ఇతర అధికారులు ఉన్నారు.

తెలుగు దేశం పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి

నవతెలంగాణ - వీర్నపల్లి

తెలుగు దేశం పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అవునూరి దయాకర్‌రావు అన్నారు. వీర్నపల్లి మండలం కేంద్రంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ పర్మల మల్లేశం, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్, నాయకులు సూర్యనాయక్, మోతె రాజిరెడ్డి, దేవయ్య, చిన్న కాశిరాం, కృష్ణ, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్

నవతెలంగాణ - వేములవాడ



రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సి.పార్థసారథి కుటుంబ సమేతంగా శనివారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. కోడె మొక్కును చెల్లించుకున్న అనంతరం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తదనంతరం ఆలయ అర్చకులు ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. అంతకుముందు ఆలయ గెస్ట్ హౌస్ వద్ద కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు ఎస్పీ చంద్రయ్య పూల మొక్కలు అందజేసీ స్వాగతం పలికారు. ఆ వెంటనే పోలీస్‌ల గౌరవ వందనం స్వీకరించారు.

గోదాదేవికి వెండి కిరీటం సమర్పణ

నవతెలంగాణ - గోదావరిఖని

గోదావరిఖని బస్టాండ్ కాలనీలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని గోదాదేవికి ఎన్టిపిసి ప్రాంతానికి చెందిన దంపతులు సందిటి నరేందర్‌రెడ్డి-మాధవి శనివారం 18 తులాల వెండి కిరీటాన్ని సమర్పించారు. కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

'లైఫ్‌లైన్' ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

కొదురుపాకలో 700మందికి పరీక్షలు

నవతెలంగాణ - బోయినిపల్లి



పరీక్షిస్తున్న వైద్యుడు ప్రదీప్ కుమార్

గ్రామీణ పల్లె ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందించాలని సంకల్పంతో పదండి పోదాం పల్లెకి అనే కార్యక్రమాన్ని మండలంలోని కొదురుపాక గ్రామంలో లైఫ్‌లైన్ హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 700 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన కొదురుపాక గ్రామంలో ఈ కార్యక్రమాన్ని మొదటగా ప్రారంభించామని అన్నారు. గ్రామాన్ని దత్తత తీసుకుని ప్రతి నెల మొదటి ఆదివారం అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని చెప్పారు. శిబిరం నిర్వహించుకునేందుకు టీసీఏం ట్రస్ట్ కంటి దవాఖాన డాక్టర్ రాజలింగంకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య శిబిరంలో పలు విభాగాల వైద్య నిపుణులు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామలాదేవి, ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమాకొండయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ లెంకళ సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టపెల్లి సుధాకర్, వైస్ ఎంపీపీ కోనుకటి నాగయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిక్కాల సుధాకర్‌రావు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కొనుకటి లచ్చిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జోగినపల్లి వెంకటరామారావుతోపాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మక్కాన్‌సింగ్‌ను పరామర్శించిన శ్రీనుబాబు

నవతెలంగాణ - గోదావరిఖని

కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఆయన సోదరుడు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఠాకూర్ అయోధ్య సింగ్‌ను కాంగ్రెస్ నాయకులు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు శనివారం పరామర్శించారు. వారి సోదరుడు శైలేందర్ సింగ్ ఇటీవల మరణించగా, రామగుండం మజీద్ కార్నర్ వద్ద గల వారి ఇంటికి శ్రీనుబాబు వెళ్లి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకుడు దాసరి విజయ్ తదితరులున్నారు.

ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



సిరిసిల్లలో..

నవతెలంగాణ - సిరిసిల్ల

ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసనగా సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ బండి సంజయ్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, తెలంగాణ మహిళలను అవమానించారని ఖండించారు. వెంటనే ఆయనపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ముస్తాబాద్

ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసనగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బోయినిపల్లి

మండల కేంద్రంలో జెడ్పీటీసీ ఉమాకొండయ్య ఆధ్వర్యంలో ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం నిర్వంచారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎంపీపై ఎస్సై అభిలాష్‌కి ఫిర్యాదు చేశారు.

నవతెలంగాణ - వీర్నపల్లి

వీర్నపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు దహనం చేశారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మల్లేశం, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ సాగర్, నాయకులు దేవరాజు, దేవరాజు, కళా, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపీపీ పిల్లి రేణుకకిషన్, ఎంపిటిసి పందిళ్ళ నాగరాణి, ఎలగందుల అనసూయ, బిఆర్ఎస్ పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు అప్సరా, జడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్ విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ముస్తాబాద్‌లో..

నవతెలంగాణ - చందుర్తి

మండల కేంద్రంలో ఎంపీ సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఎమ్మెల్సీ కవితకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

నవతెలంగాణ - గంభీరావుపేట

గంభీరావుపేట మండల కేంద్రం ప్రధాన కూడలి వద్ద ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి ఆధ్వర్యంలో దహనం చేశారు. అనంతరం బండి సంజయ్ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కొత్తపెల్లి సింగల్‌విండో చైర్మన్ భూపతి సురేందర్, సర్పంచ్ బాలరాజు, ఉపసర్పంచులు నాగరాజు గౌడ్, నర్సింలు, పట్టణ ప్రధాన కార్యదర్శి అభిలాష్, నాయకులు పాల్గొన్నారు.



చందుర్తిలో..



ఎల్లారెడ్డిపేటలో..



గంభీరావుపేట : పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయండి

జిల్లా ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్

నవతెలంగాణ - ఓదెల

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించే ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయాలని పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీమాన్ కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సదస్సును జిల్లానుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వారివెంట ధనుంజయ్, పెంచాల మల్లయ్య, శ్రీమల్ల హనుమాన్లు, దొంగల సతీష్, శ్రీను, రమేష్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.


ఎంఎహెచ్‌ఆర్ అర్హత కలిగిన అంతర్గత అభ్యర్థులకు అవకాశాన్ని పొడగించాలి

నవతెలంగాణ - గోదావరిఖని

సింగరేణి సంస్థలో జరిగే సంక్షేమ అధికారి రిక్రూట్‌మెంట్ కోసం ఎంబీఎహెచ్‌ఆర్ అర్హత కలిగిన అంతర్గత అభ్యర్థులకు అవకాశాన్ని పొడగించాలని ఐఎన్‌టీయుసి సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ యాజామాన్యాన్ని కోరారు. ఇటీవలి కాలంలో వెలువడిన సంక్షేమ అధికారి పదవికి సంబంధించిన అర్హతను పునఃపరిశీలించాలని యాజమాన్యాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. సంస్థ ఉద్యోగులు అత్యున్నత స్థానాలకు చేరుకోవడానికి వీలుగా చాలా అవకాశాలు కల్పిస్తూ వారికి ఎన్‌ఓసిలను జారీ చేస్తుందని, అలా తీసుకొని అత్యల్ప క్యాడర్ నుండి అత్యున్నత స్థానాలకు చాలా మంది ఉద్యోగులు చేరుకున్నారని తెలిపారు. ఉద్యోగుల అభివృద్ధి, ఎదుగుదల పట్ల యాజమాన్య నిబద్ధతకు ఇది నిదర్శనమని నమ్ముతున్నామని, వెల్ఫేర్ ఆఫీసర్ స్థానానికి సంబంధించిన అర్హత ప్రమాణాలు అంతర్గత, బాహ్య ఆశావాదులకు ఎంబిఎ హెచ్‌ఆర్‌అర్హతను కలిగి ఉంటాయని, అయితే, ఇటీవల ఈ అర్హత ప్రమాణాన్ని అంతర్గత అభ్యర్థులకు విస్తరించడం లేదని దృష్టికి వచ్చిందని తెలిపారు. యాజమాన్యం వెంటనే ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించి ఎంబిఎ హెచ్‌ఆర్ అర్హత కలిగిన అంతర్గత అభ్యర్థులందరికీ సంక్షేమ అధికారి స్థానానికి అర్హత ప్రమాణాలను విస్తరించాలని యాజమాన్యాన్ని కోరారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్‌ల పంపిణీ

నవతెలంగాణ - ముత్తారం



ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన నూనె శ్రీను, సుధాడి రత్నాకర్‌రావుకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దాసరి చంద్రమౌళి, యువజన అధ్యక్షుడు దాసరి పవన్ కల్యాణ్ శనివారం అందజేశారు. గ్రామ బిసి సెల్ ఉపాధ్యక్షుడు దేవనూరి సదయ్య, ఎస్ఎస్-ఎల్ గ్రామ అధ్యక్షుడు రత్న శంకరి, నాయకులు తీగల సత్యనారాయణరావు, గౌరిశెట్టి సత్యనారాయణ, తదితరులున్నారు.

శుభ్‌మన్ గిల్ (128) శతకోత్సవం. ఆసీస్ కెప్టెన్ స్మిత్ ఫీల్డింగ్ పద్మవ్యూహంతో పరుగులను కట్టడి చేయగా.. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ శతకంతో గర్జించాడు. అహ్మదాబాద్‌లో సెంచరీతో అదరగొట్టిన గిల్.. రోహిత్, పుజార, కోహ్లిలతో మూడు కీలక భాగస్వామ్యాలు నిర్మించాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌ను ముందుండి నడిపించాడు. ఆసీస్ మూడు సెషన్లలో మూడు వికెట్లతో మూడో రోజును అసంతృప్తిగా ముగించింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో మరో 191 పరుగుల వెనుకంజలో కొనసాగుతోంది.

శతక శుభ్‌మన్

- స్వదేశంలో గిల్ తొలి సెంచరీ
- రాణించిన కోహ్లి, పుజార, రోహిత్
- భారత్ తొలి ఇన్నింగ్స్ 289/3
- భారత్, ఆసీస్ నాల్గో టెస్టు మూడో రోజు

నవతెలంగాణ-అహ్మదాబాద్

శుభ్‌మన్ గిల్ (128, 235 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్), విరాట్ కోహ్లి (59 బ్యాటింగ్, 128 బంతుల్లో 5 ఫోర్లు) ఆసీస్ బౌలర్లను దంచికొట్టారు. యువ ఓపెనర్ స్వదేశంలో తొలి టెస్టు శతకం అందుకోగా.. విరాట్ కోహ్లి మరో అర్థ సెంచరీతో చెలరేగాడు. రోహిత్ శర్మ (35), చతేశ్వర్ పుజార (42, 121 బంతుల్లో 3 ఫోర్లు) రాణించగా తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 289/3 పరుగులతో కొనసాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో మరో 191 పరుగుల వెనుకంజలో నిలిచిన టీమ్ ఇండియా.. ఏడు వికెట్లు చేతిలో ఉండటంతో నేడు ధనాధన్ జోరుపై కన్నేసింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి విరాట్ కోహ్లికి తోడుగా రవీంద్ర జడేజా (16 బ్యాటింగ్, 54 బంతుల్లో 1 సిక్స్) అజేయంగా క్రీజులో నిలిచాడు.

తొలి సెషన్ : ఓపెనర్లు శుభారంభం

ఓవర్‌నైట్ స్కోరు 36/0తో మూడో రోజు బ్యాటింగ్ మొదలెట్టిన టీమ్ ఇండియాకు ఓపెనర్లు శుభారంభం అందించారు. బ్యాటింగ్‌క అనుకూలిస్తున్న పిచ్‌పై రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ వేగంగా ఆడేందుకు మొగ్గు చూపారు. ఓపెనర్లు ధాటిగా పరుగులు సాధించగా.. ఆసీస్ బౌలర్లలో ఎవరూ గిల్, రోహిత్‌లను ఇబ్బంది పెట్టలేకపోయారు. భారీ ఓపెనింగ్ భాగస్వామ్యం దిశగా సాగుతున్న తరుణంలో రోహిత్ శర్మ ఓ సాధారణ బంతికి వికెట్ కోల్పోయాడు. కునేమాన్ ఓవర్లో బ్యాక్‌ఫుట్ పంచీ షాట్ ఆడిన రోహిత్ శర్మ.. షార్ట్ ఎక్స్‌ట్రా కవర్‌లో లబుషేన్ చేతికి చిక్కాడు. చెమటోడ్చకుండా దక్కిన వికెట్‌తో ఆసీస్ సంబుర పడింది. అప్పటికి భారత్ స్కోరు 21 ఓవర్లలో 74 పరుగులు. తొలి గంట ఆటలో కెప్టెన్ వికెట్‌ను చేజార్చుకున్న భారత్.. లంచ్ విరామానికి మరో పడకుండా జాగ్రత్త పడింది. టెస్టు స్పెషలిస్ట్ చతేశ్వర్ పుజారతో కలిసి శుభ్‌మన్ గిల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 90 బంతుల్లో అర్థ సెంచరీ నమోదు చేసిన శుభ్‌మన్ గిల్.. ఆసీస్ బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు.



ఉదయం సెషన్లో ఆసీస్ ఓ వికెట్ దక్కించుకోగా, భారత్ 93 పరుగులు సాధించింది.

రెండో సెషన్ : నెమ్మదించిన వేగం!

లంచ్‌కు ముందు రోహిత్, గిల్ దూకుడుగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. గిల్‌కు పుజార తోడవటంతో సహజంగానే ఇన్నింగ్స్‌లో వేగం మందగించింది. లంచ్ విరామం అనంతరం భారత్ 59 పరుగులు నమోదు చేసింది. తొలి సెషన్లో 3.48 రన్‌రేట్‌తో పరుగులు పిండుకున్న భారత్.. రెండో సెషన్లో 2.98 రన్‌రేట్‌కు పడిపోయింది. ఓ ఎండ్‌లో పుజార డిఫెన్స్‌తో అడ్డుగోడగ నిలువగా.. మరో ఎండ్‌లో గిల్ పరుగుల బాధ్యత తీసుకున్నాడు. ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న గిల్ అలవోకగా పరుగులు సాధించాడు. స్పిన్నర్లపై క్రీజు వదిలి స్వేచ్ఛగా బౌండరీలు సాధించాడు. 10 ఫోర్లు, ఓ సిక్సర్ సంధించిన శుభ్‌మన్ గిల్ 194 బంతుల్లో స్వదేశంలో తొలి శతకం నమోదు చేశాడు. డీప్ స్క్వేర్ లెగ్ దిశగా బౌండరీ బాదిన గిల్ అభిమానులకు అభివాదం చేస్తూ శతక సంబురం చేసుకున్నాడు. క్రీజులో కుదురుకున్న పుజార సైతం అనూహ్యంగా వికెట్ కోల్పోయాడు. సెషన్లో ఏమాత్రం మెప్పించని టాడ్ మర్ఫీ.. టీమ్ ఇండియా డిఫెన్స్‌ను ఛేదించాడు. పుజారను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి బ్రేక్ సాధించాడు. టీ విరామం ముంగిట పుజార వికెట్‌తో ఆసీస్ శిబిరం ఊరట చెందింది. విరాట్ కోహ్లి వస్తూనే లయాన్‌ను ఎదుర్కొనేందుకు ఇబ్బంది పడ్డాడు. మూడు బంతుల్లో ఇన్‌సైడ్ ఎడ్జ్, అవుట్‌సైడ్ ఎడ్జ్ సహా ఓ బంతిని ఆడలేకపోయాడు. 188/2 వద్ద రెండో సెషన్ ముగిసింది.

మూడో సెషన్ విరాట్ కోహ్లి అర్థ సెంచరీ

శుభ్‌మన్ గిల్ (128) ఇన్నింగ్స్ మూడో సెషన్లో ముగిసింది. ఆసీస్ బౌలర్లపై స్పష్టమైన ఆధిపత్యం చూపించిన గిల్.. ఏ దశలోనూ అసౌకర్యంగా కనిపించలేదు. అధిక ఉష్ణోగ్రతల నడుమ రోజంతా క్రీజులో నిలిచిన గిల్ బాగా నీరసించాడు!. ఫిజియో సాయం తీసుకుని బ్యాటింగ్ కొనసాగించాడు. సెంచరీ అనంతరం మరో రెండు బౌండరీలు బాదిన గిల్ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. నాథన్ లయాన్ ఓవర్లో వికెట్ల ముందు చిక్కిన గిల్.. శతక ఇన్నింగ్స్‌ను అసంతృప్తిగా ముగించాడు. రోహిత్‌తో 74, పుజారతో 113, కోహ్లితో 58 పరుగుల భాగస్వామ్యాలు నెలకొల్పిన గిల్..78.4 ఓవర్లో పెవిలియన్‌కు చేరుకున్నాడు. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (00)తో కలిసి విరాట్ కోహ్లి మూడో రోజు మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డాడు. లయాన్ నిలకడగా సవాల్ విసిరినా ఐదు ఫోర్లతో 105 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. 94 ఓవర్ల అనంతరం కొత్త బంతిని తీసుకున్న ఆసీస్.. వికెట్ కోసం గట్టిగా ప్రయత్నించింది. కోహ్లి, జడేజాలు కొత్త బంతిపై వేగంగా పరుగులు పిండుకుని ఎదురుదాడి చేశారు. చివరి సెషన్లో భారత్ 101 పరుగులు చేసి, ఓ వికెట్ కోల్పోయింది.

రోహిత్ @ 17000

భారత కెప్టెన్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ మరో రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 17000 పరుగులు చేసిన ఆరో భారత క్రికెటర్‌గా నిలిచాడు. ఆస్ట్రేలియాతో అహ్మదాబాద్ టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో 35 పరుగులు చేసిన రోహిత్ శర్మ.. 17000 పరుగుల మైలురాయి అందుకున్నాడు. 2007లో ఐర్లాండ్‌పై అరంగేట్రం చేసిన రోహిత్ శర్మ 48 టెస్టులు, 241 వన్డేలు, 148 టీ20ల్లో వరుసగా 3348, 9782, 3853 పరుగులు సాధించాడు. సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, రాహుల్ ద్రవిడ్, సౌరవ్ గంగూలీ, మహేంద్ర సింగ్ ధోనిలు 17000 పరుగుల క్లబ్‌లో ఉన్నారు.

స్కోరు వివరాలు....

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 480/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) లబుషేన్ (బి) కునేమాన్ 35, శుభ్‌మన్ గిల్ (ఎల్బీ) నాథన్ లయాన్ 128, చతేశ్వర్ పుజారా (ఎల్బీ) టాడ్ మర్ఫీ 42, విరాట్ కోహ్లి బ్యాటింగ్ 59, రవీంద్ర జడేజా బ్యాటింగ్ 16, ఎక్స్‌ట్రాలు : 09, మొత్తం (99 ఓవర్లలో 3 వికెట్లకు) 289.

వికెట్ల పతనం : 1-74, 2-187, 3-245.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 17-2-74-0, కామెరూన్ గ్రీన్ 10-0-45-0, నాథన్ లయాన్ 37-4-75-1, మాథ్యూ కునేమాన్ 13-0-43-1, టాడ్ మర్ఫీ 22-0-45-1.



సిట్సిపాస్ నిష్క్రమణ

- ఇండియన్ వెల్స్ మాస్టర్స్



ఇండియన్ వెల్స్ : గ్రీసు స్టార్ ఆటగాడు, రెండో సీడ్ స్టెఫానో సిట్సిపాస్‌కు చుక్కెదురైంది. ఇండియన్ వెల్స్ మాస్టర్స్ రెండో రౌండ్లోనే స్టార్ ఆటగాడికి పరాజయం ఎదురైంది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో ఆస్ట్రేలియా ఆటగాడు జోర్డాన్ థామ్సన్ చేతిలో ఓటమి పాలయ్యాడు. మూడు సెట్ల పోరులో 6-7(0-7), 6-4, 6-7(5-7)తో సిట్సిపాస్ పోరాడి ఓడాడు. టైబ్రేకర్‌కు దారితీసిన ఉత్కంఠ మ్యాచ్‌లో కంగారూ ఆటగాడు పైచేయి సాధించాడు. తొలి, నిర్ణయాత్మక మూడో సెట్లను టైబ్రేకర్‌లో చేజార్చుకున్న సిట్సిపాస్.. రెండోసెట్‌ను సులువుగా దక్కించుకునా ఫలితం లేదు. ఐదో సీడ్, రష్యా స్టార్ డానిల్ మెద్వదేవ్ మూడో రౌండ్లో అడుగుపెట్టాడు. అమెరికా ఆటగాడు బ్రాండన్ నకషిమాపై 6-4, 6-3తో వరుస సెట్లలో మెద్వదేవ్ గెలుపొందాడు. ఆండీ రూబ్లెవ్ సైతం 6-4, 6-2తో జిరి లేహెక (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందాడు. జర్మనీ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-3, 6-1తో అర్జెంటీనా ఆటగాడు పెడ్రోపై అలవోక విజయం నమోదు చేశాడు.

మహిళల సింగిల్స్‌లో కోకో గాఫ్ రెండో రౌండ్‌లో గెలుపొందింది. స్పెయిన్ అమ్మాయి క్రిస్టినాపై 6-2, 6-4తో సులువుగా నెగ్గింది. రెండో సీడ్ సబలెంక 6-2, 6-0తో రోడినపై ఏకపక్ష విజయం సాధించింది. మూడో సీడ్ జెస్సికా పెగుల మూడు సెట్ల మ్యాచ్‌లో కామిలాపై పైచేయి సాధించింది. 3-6, 6-1, 6-2తో జెస్సికా మూడో రౌండ్‌కు చేరుకుంది. కరోలినా ప్లిస్కోవా 2-6, 6-0, 6-4తో అనా కలినకయపై, పెట్రా క్విటోవా 6-1, 7-5తో ఎలిజబెత్ మండిక్‌పై రెండో రౌండ్లో విజయాలు సాధించారు. మరియ సక్కరి 2-6, 6-4, 6-0తో షెల్బీ రోజర్స్‌ను ఓడించింది. ఇక మెన్స్ డబుల్స్ విభాగంలో భారత ఆటగాడు రోహన్ బోపన్న జోడీ ప్రీ క్వార్టర్స్‌కు చేరుకుంది. ఆసీస్ ఆటగాడు మాథ్యూతో కలిసి 7-5, 3-6, 10-6తో రఫేల్, డెవిడ్ జోడీలపై మూడో రౌండ్లో విజయం సాధించారు.

పుంజుకున్న న్యూజిలాండ్

- శ్రీలంకతో తొలి టెస్టు మ్యాచ్

క్రైస్ట్‌చర్చ్ : న్యూజిలాండ్, శ్రీలంక తొలి టెస్టు మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతోంది. రెండో రోజు అనంతరం శ్రీలంక ముందంజలో నిలువగా.. మూడు రోజుల ఆట అనంతరం కివీస్ రేసులోకి వచ్చింది. 151 పరుగులే ఐదు వికెట్లు చేజార్చుకుని తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయే ప్రమాదంలో పడిన న్యూజిలాండ్‌ను మిడిల్ ఆర్డర్ బ్యాటర్ డార్లీ మిచెల్ (102, 193 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. టెయిలెండర్ మాట్ హెన్రీ (72, 75 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ అర్థ సెంచరీతో మెరవటంతో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 373 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో విలువైన 18 పరుగుల ఆధిక్యం సొంతం చేసుకుంది. మైకల్ బ్రాస్‌వెల్ (25), టిమ్ సౌథీ (25), నీల్ వాగ్నర్ (27) రాణించారు. ఇక శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 83/3తో ఆడుతోంది. బ్లెయిర్ టిక్‌నర్ (3/28) మూడు వికెట్లతో చెలరేగాడు. ఫెర్నాండో (28), కరుణరత్నె (17), మెండిస్ (14) నిష్క్రమించగా.. మాథ్యూస్ (20 బ్యాటింగ్), జయసూరియ (2 బ్యాటింగ్) అజేయంగా ఆడుతున్నారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 65 పరుగుల ముందంజలో నిలిచింది.



నెయ్‌మార్‌కు శస్త్రచికిత్స

- ఈ సీజన్‌కు దూరమైన బ్రెజిల్ స్టార్

దోహా : బ్రెజిల్ సూపర్‌స్టార్, పారిస్ సెయింట్ జర్మెన్స్ (పీఎస్‌జీ) ఫార్వర్డ్ నెయ్‌మార్ జూనియర్ విజయవంతంగా సర్జరీ చేయించుకున్నాడు. కుడి కాలు చీలమండ గాయానికి గురైన నెయ్‌మార్‌కు దోహాలో శస్త్ర చికిత్స చేశారు. ఈ మేరకు పీఎస్‌జీ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. పీఎస్‌జీ తరఫున గత మూడు మ్యాచులకు దూరమైన నెయ్‌మార్.. ఈ సీజన్ మొత్తానికి అందుబాటులో ఉండడు. చికిత్స, రిహాబిలిటేషన్ అనంతరం నెయ్‌మార్ తిరిగి మైదానంలోకి రానున్నాడు. ఇక బుధవారం బేయర్న్ మ్యూనిచ్ చేతిలో 0-2తో ఓడిన పీఎస్‌జీ చాంపియన్స్ లీగ్ నుంచి నిష్క్రమించింది. నెయ్‌మార్ గాయానికి గురైన 2019, 2020 సీజన్లలో సైతం పీఎస్‌జీ చాంపియన్స్ లీగ్ నాకౌట్‌కు చేరలేదు. లియోనల్ మెస్సి, కిలియన్ ఎంబాపె ఇద్దరూ బరిలో నిలిచినా.. పీఎస్‌జీ విజయం సాధించ లేకపోయింది.



నవచిత్రం

మెప్పించే భారీ తారాగణం



సదన్, దీపికారెడ్డి

బివిఆర్ పిక్చర్స్ బ్యానర్ పై సదన్, దీపికా రెడ్డి, రేఖ నిరోష నటీ,నటులుగా శేఖర్ ముత్యాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భారీ తారాగణం'. బి.వి రెడ్డి నిర్మాత. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ సినిమా విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి దర్శకులు యస్.వి.కృష్ణా రెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి, ఆలీ ముఖ్య అతిథులుగా పాల్గొని, ట్రైలర్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఎస్.వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ, 'దర్శకుడు శేఖర్, నిర్మాత బివి.రెడ్డి మంచి కంటెంట్ ఉన్న కథను సెలెక్ట్ చేసుకుని, చాలా బాగా తెరకెక్కించారు..ఈ సినిమాకు సుక్కు అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. అలీ చిన్న, పెద్ద క్యారెక్టర్ అనే తేడా లేకుండా ఏ పాత్ర ఇచ్చినా కూడా ఏమాత్రం వెనకాడకుండా పాత్రలో ఒదిగిపోతారు. నాకు ఇష్టమైన బాబా కొడుకు ఇందులో హీరోగా చేయడం చాలా సంతోషంగా ఉంది. స్క్రీన్ మీద హీరో ధనుష్‌లాగా కనిపిస్తున్నాడు' అని తెలిపారు. 'ట్రైలర్ చూస్తుంటే చాలా ఫ్రెష్‌గా ఉంది. ప్రతి ఫ్రేమ్ కూడా చాలా ఎట్రాక్టివ్‌గా కనిపిస్తుంది. ఈ సినిమా చేసిన దర్శక, నిర్మాతలకు మంచి పేరు వస్తుంది' అని నిర్మాత అచ్చిరెడ్డి అన్నారు. ఆలీ మాట్లాడుతూ,'మంచి కంటెంట్‌ను సెలెక్ట్ చేసుకుని, తీసిన దర్శక, నిర్మాతలకు ఈ సినిమా బిగ్ హిట్ అవ్వాలి. ఇలాంటి మంచి సినిమాలో నేను పార్ట్ అయినందుకు చాలా హ్యాపీగా ఉంది' అని చెప్పారు. 'లవ్, కామెడీ, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అని దర్శకుడు శేఖర్ ముత్యాల అన్నారు. హీరో సదన్ మాట్లాడుతూ, 'ఓ మంచి సినిమాలో నటించినందుకు చాలా ఆనందంగా ఉంది. అందరి సహకారంతో సినిమా చాలా బాగా వచ్చింది. ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుంది' అని చెప్పారు.

సెకెండ్ కరోనా టైమ్‌లో మా సినిమా స్టార్ట్ అయింది. అప్పటి నుండి మేం స్ట్రగుల్ పడుతూ వచ్చాం. చిన్న నిర్మాత అనుకోకుండా ఏ టైమ్‌కి పిలిచినా నటీనటులు, టెక్నీషియన్స్ అందరూ సపోర్ట్ చేయడంతో సినిమా బాగా వచ్చింది. త్వరలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న మా చిత్రం కచ్చితంగా అందరికీ నచ్చుతుంది. ఓ మంచి సినిమాని చేసినందుకు నిర్మాతగా గర్వపడుతున్నాను.
- నిర్మాత బి.వి.రెడ్డి



వేణు, చిరంజీవి

తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం

మంచి సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఆదరించినట్లు మరెవరూ ఆదరించరు అని మరోసారి రుజువు చేసిన చిత్రం 'బలగం'. దిల్ రాజు సారథ్యంలో శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హర్షిత్, హన్షిత నిర్మించిన సినిమా 'బలగం'. ప్రియదర్శి, కావ్యా కళ్యాణ్ రామ్ హీరో, హీరోయిన్లుగా నటించిన ఈ మూవీని వేణు ఎల్దండి తెరకెక్కించారు. ఈనెల 3న విడుదలైన ఈ చిత్రం సక్సెస్ టాక్‌తో ప్రేక్షకుల ఆదరాభిమానాలను పొందుతోంది. సామాన్యులతో పాటు సెలబ్రిటీలు సైతం సినిమాను అభినందిస్తున్నారు.

తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలోని పాత్రలు, వాటి మధ్య భావోద్వేగాలకు తెలుగు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. ఈ క్రమంలో చిరంజీవి 'బలగం' టీమ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాదు దర్శకుడు వేణు ఎల్దండికి శాలువా కప్పి సన్మానించారు.


ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, సినిమాను వేణు చాలా బాగా డైరెక్ట్ చేశాడు. 'బలగం' నిజమైన మూవీ. సినిమాలో నిజాయితీ ఉంది. దిల్ రాజు వంటి కమర్షియల్ ప్రొడ్యూసర్ ఉన్నప్పటికీ వేణు సినిమాకి న్యాయం చేశాడు. పక్కా నేటివిటీ ఉన్న సినిమా. తెలంగాణ సంస్కృతిని వేణు చక్కగా చూపించాడు. తను చిన్నప్పటి నుంచి చూసిన ప్రతీ విషయాన్ని ఇందులో చూపించాడు. గతంలో వేణు ఉగ్గు కథలు, బుర్ర కథలుపై ఓ జబర్దస్త్ షో చేసినప్పుడు చూశాను. నిజంగా వేణులో ఇంత టాలెంట్ ఉందా అని వేణుపై గౌరవం పెరిగిపోయింది. 'బలగం' సినిమాతో తను గొప్ప సినిమాను తీశాడనిపించింది' అని చెప్పారు.

ఆస్కార్ సందడి షురూ

ఆస్కార్ అవార్డ్స్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు రామ్ చరణ్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇందులో భాగంగా లాస్ ఏంజిల్స్‌లోని పారమౌంట్ పిక్చర్స్ స్టూడియోస్‌లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా హోస్ట్ చేసిన ప్రత్యేకమైన వేడుకలో రామ్ చరణ్ పాల్గొని సందడి చేశారు.

దక్షిణాసియాకి చెందిన చిత్రాలు ఆస్కార్‌కి నామినేట్ అయిన సందర్భంగా పారామౌంట్ సంస్థ ఈ పార్టీ ఇచ్చింది. భారత కాలమానం ప్రకారం ఈనెల 13న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో వైభవంగా జరుగనుంది.

ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'నాటునాటు' (ఆర్‌ఆర్‌ఆర్) పాటకి కచ్చితంగా ఆస్కార్ వస్తుందని సినీ విశ్లేషకులు జోస్యం చెబుతున్నారు. ఆ జోస్యం నిజం కావాలని మనం ఆశిద్దాం.



ప్రియాంక చోప్రా, రామ్‌చరణ్

ఫీల్ గుడ్ సినిమా



నాగచైతన్య, తేజ్ బొమ్మదేవర

తేజ్ బొమ్మదేవర, రిషిక లోక్రే జంటగా బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో సాయిరత్న క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'మాధవే మధుసూదన'. బొమ్మదేవర రామచంద్రరావు దర్శక, నిర్మాణ సారథ్యంలో ప్రొడక్షన్ నెం2గా ప్రారంభమైన ఈ చిత్ర పూజా కార్యక్రమానికి హీరో నాగ చైతన్య ముఖ్య అతిథిగా విచ్చేసి ఆల్ ది బెస్ట్ చెప్పారు. అలాగే లేటెస్ట్‌గా ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఆయన మొదటి పాటను ఆవిష్కరించడం విశేషం.

ఈ సందర్భంగా నాగ చైతన్య మాట్లాడుతూ,సినిమా నుంచి 'అలాంటి అందం..' సాంగ్ చూశా. చాలా చాలా బాగుంది. తేజ్‌కి కంగ్రాట్యులేషన్స్. తన డాన్స్, యాక్టింగ్ చాలా బావుంది. దర్శకుడిగా చంద్ర ఇంత బాగా హ్యాండిల్ చేస్తారని అనుకోలేదు. మంచి ఫీల్ ఉన్న ఈ సినిమా పెద్ద సక్సెస్ అవ్వాలి. వికాస్ మంచి మ్యూజిక్ ఇచ్చాడు. ఈ ఆల్బమ్‌లోని మూడు పాటలు విన్నాను. మూడు చాలా బావున్నాయి, కొరియోగ్రాఫర్స్ రాజు మాస్టర్, రఘు మాస్టర్, బృంద మాస్టర్ ముగ్గురు చాలా బాగా చేశారు. పాటలు ఆదిత్య మ్యూజిక్ ద్వారా రిలీజ్ అవుతున్నాయి. మిగిలిన పాటలూ త్వరలోనే విడుదలవుతాయి' అని చెప్పారు.

దసరా.. అద్భుతమైన చిత్రం

నాని నటించిన పాన్ ఇండియా చిత్రం 'దసరా'. శ్రీకాంత్ ఒదెల దర్శకుడు. కీర్తి సురేష్ కథానాయికగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈనెల 30న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఏకకాలంలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన దీక్షిత్ శెట్టి మీడియాతో శనివారం 'దసరా' చిత్రానికి సంబంధించి పలు విశేషాలను షేర్ చేసుకున్నారు. "మీట్ క్యూట్ వెబ్ సిరీస్‌లో చేశాను. 'దసరా'లో ఈ పాత్రకి ఆడిషన్ జరిగినప్పుడు 'మీట్ క్యూట్'కి పని చేసిన కో డైరెక్టర్ వినయ్ ఈ పాత్రకి నన్ను రిఫర్ చేశారు. అక్కడి నుంచి జర్నీ మొదలైయింది. ఇందులో నా పాత్ర పేరు సూరి. క్లోజ్ ఫ్రెండ్ క్యారెక్టర్. సినిమా అంతా ఉంటుంది. చాలా కీలకమైన పాత్ర. రోలర్ కోస్టర్ రైడ్ లాంటి సినిమా దసరా. మంచి కంటెంట్‌తో అన్నీ ఎలిమెంట్స్ మిక్స్ చేసిన అద్భుతమైన ఎంటర్‌టైనర్. 'దసరా' లాంటి పాన్ ఇండియా మూవీలో భాగం కావడం చాలా గొప్పగా, ఆనందంగా ఉంది. నా వరకూ 'దసరా' ఆల్రెడీ ఒక పెద్ద విజయం. ఈ సినిమా ద్వారా తెలంగాణ యాస, బాడీ లాంగ్వేజ్, నడవడిక ఇలా చాలా విషయాలు నేర్చుకున్నాను. దర్శకుడు శ్రీకాంత్ ఒదెల దగ్గర ఒక స్ట్రక్చర్ ఉంది. తనకి ఎలా కావాలో ఫుల్ క్లారిటీ ఉంది. ఆయన అనుకున్న పాత్రని ఆయన కోరుకున్నట్లు చేయడం పట్లే ఫోకస్ పెట్టాను. నానితో దాదాపు పది నెలల పాటు ప్రయాణించాను. ఆయన నుంచి చాలా స్ఫూర్తి పొందాను. కీర్తి సురేష్‌తో స్క్రీన్ షేర్ చేసుకుంటానని అనుకోలేదు. ఆమెతో కలిసి పని చేయడం మంచి అనుభవం. ఈ పాత్రను నేను చేయగలనని బలంగా నమ్మిన నిర్మాతలకు రుణపడి ఉంటాను' అని దీక్షిత్ శెట్టి చెప్పారు.



దీక్షిత్ శెట్టి

నిన్ను చూసీ చూడంగా..

'నిన్ను చూసీ చూడంగా.. నా కన్నె నన్ను దాటి నీ వైపోస్తుందే..'అంటూ ప్రేమికుడు ప్రేయసిపై తనకున్న ప్రేమను వ్యక్తం చేస్తే, 'కన్నూ కన్ను చాలంట ఆ చూపే చెప్పే సైగలోనే మాయుందే' అని ప్రేయసి తన ప్రేమికుడిని చూసి చెబుతుంది. వీ రిద్దరూ సముద్ర తీరంలో తమ. ప్రేమను అందంగా ఒకరిపై ఒకరు వ్యక్తం చేసుకుంటున్నారు. అసలు వీరి మధ్య అంత గాఢమైన ప్రేమ ఎందుకు పుట్టింది?, అందుకు దారి తీసిన పరిస్థితులేంటి? అనే విషయాలు తెలుసుకోవాలంటే 'కథ వెనుక కథ' సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్. దండ మూడి బాక్సాఫీస్ బ్యానర్‌పై రూపొందు తున్న తొలి చిత్రం 'కథ వెనుక కథ'.. విశ్వంత్ దుద్దుంపూడి, శ్రీజిత గౌష్, శుభ శ్రీ ప్రధాన తారా గణంగా నటిస్తున్నారు. కృష్ణ చైతన్య దర్శకత్వంలో ఈ చిత్రాన్ని అవనింద్ర కుమార్ నిర్మిస్తున్నారు. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి 'నిన్ను చూసీ చూడంగా ..' అనే లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన మూవీ టీజర్‌కు చాలా మంచి స్పందన వచ్చిందని, త్వరలోనే సినిమాను రిలీజ్ చేస్తామని నిర్మాతలు తెలిపారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.